PRAJASAKTI Regd.No. 15795/68

సిటీ

ప్రజాశక్తి

ప్రతి అక్షరం ప్రజల పక్షం

Published from Vijayawada, Visakhapatnam, Kurnool, Tirupathi, Rajahmundry, Srikakulam, Ongole and Ananthapuramu

సంపుటి : 43 సంచిక : 351 | విజయవాడ, బుధవారం 24 జులై 2024 | 10 + 8 పేజీలు వెల : 5.50

Vol No | Vijayawada, Wednesday 24 July 2024 | Rs

నరసాపురం ఎంపిడిఒ మృతదేహం లభ్యం

- అదృశ్యం ఘటన విషాదాంతం

5

మాటల మూటలే!

సామాన్యులకు కోతలు... సంపన్నులకు వరాలు

సామాన్యులకు మాటల్లో .. కార్పొరేట్లకు కోట్లలో వడ్డించే మోడీ ప్రభుత్వం తాజా బడ్జెట్‌లోనూ అదే విన్యాసం చేసింది. కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్ వరుసగా ఏడవసారి ప్రవేశపెట్టిన బడ్జెట్‌లోనూ సామాన్యులకు ఉత్త మాటలే దక్కాయి. 2024-25 ఆర్థిక సంవత్సరానికి మంగళవారం లోక్‌సభలో ప్రతిపాదించిన 48,20,512 కోట్ల రూపాయల బడ్జెట్‌లో అధికభాగం కార్పొరేట్ల వైపే పరుగులు పెట్టింది. ఫలితంగా అత్యంత కీలకమైన వ్యవసాయం నుండి అన్ని రంగాల్లోనూ కార్పొరేట్ల ప్రయోజనాలకే పెద్దపీట దక్కింది. నిరుద్యోగ నిర్మూలనకోసమంటూ అట్టహాసంగా ప్రకటించిన నూతన పథకాలను సైతం కార్పొరేట్ల ఖజానాలను నింపే వనరులుగా మార్చివేయడం మోడీ సర్కారు ప్రాధాన్యతకు అద్దం పడుతోంది. ఈ పథకాల్లోనూ కొత్త ఉద్యోగ, ఉపాధి అవకాశాలు శూన్యం! ఇంటర్న్‌షిప్‌లనే సర్వస్వంగా చిత్రించే ప్రయత్నించారు. గరీబ్, మహిళా, యువ, అన్నదాత.. అని మాటలు చెబుతూనే, వారికిచ్చే సబ్సిడీలలో భారీగా కోతలు పెట్టి వంచనాశిల్ప విద్యను కేంద్రం ప్రదర్శించింది. పెరిగిన ధరలతో నిరుపేదలు కుంగిపోతున్నా ఉపాధి హామీ నిధుల్లో అడ్డగోలు కోతను మోడీ సర్కారు కొనసాగించింది. అది చాలదన్నట్లు ఆహార సబ్సిడీ మీద 7,082 కోట్ల రూపాయల కోత పెట్టింది. అంగన్‌వాడీలతో పాటు మాతా శిశు పథకాలకు అరకొర కేటాయింపులే దక్కాయి. ఇక విద్య, వైద్యం గ్రామీణాభివృద్ధి రంగాలకు కూడా ద్రవ్యోల్బణాన్ని ఏ మాత్రం పరిగణలోకి తీసుకోకుండా విదిలింపులతో సరిపెట్టారు. వేతన జీవులకు పెద్దగా ఊరట లభించలేదు. పేదలకిచ్చే సబ్సిడీలపై కోతలు పెట్టిన మోడీ ప్రభుత్వం అదే సమయంలో సంపదపైనా, వారసత్వపు ఆస్తులపైనా నామమాత్రపు పన్ను విధించడానికి కూడా సిద్ధపడలేదు. ఫలితంగా రానున్న రోజుల్లో అంతరాల భారతం మరింత పెరగనుంది. సామాన్యులకు మరిన్ని కష్టాలు, కన్నీళ్లు తప్పని స్థితి! ఇక, మారిన రాజకీయ పరిస్థితుల్లో ఆంధ్రప్రదేశ్‌కు ప్రాధాన్యత ఇచ్చినట్లు కనిపించినా అది కూడా ఉత్తదే! ఆర్భాటంగా ప్రకటించిన రాజధాని నిధులు అప్పు మాత్రమే! ప్రత్యేకహోదా, విశాఖ ఉక్కు, పోలవరం ప్రాజెక్టు పునరావాసం తదితర సమస్యలకు ఎప్పటి మాదిరే కేంద్రం మొండి చేయి చూపింది.

పూర్తి వివరాలు 2, 3,7 పేజీల్లో




ఉజ్వల భవిష్యత్ తీసుకొస్తుంది : ప్రధాని మోడీ



బడ్జెట్.. మెరుగైన వృద్ధి, ఉజ్వల భవిష్యత్‌ను తీసుకొస్తుంది. నయా-మధ్యతరగతి ఆకాంక్షలకు మరింత శక్తినిస్తుంది. యువ తరానికి అపూర్వమైన అవకాశాలు లభిస్తాయి. విద్య, నైపుణ్యాల అభివృద్ధి కొత్త స్థాయిని సాధించి, మన దేశ వృద్ధికి ఆజ్యం పోస్తుంది. మధ్యతరగతి వర్గాలకు సాధికారతను చేకూరుస్తుంది. ప్రపంచంలో భారత్‌ను మూడో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా తయారు చేయటానికి బడ్జెట్ ఉత్ప్రేరకంగా పని చేస్తుంది"

కుర్చీని కాపాడుకోవడానికే : రాహుల్ గాంధీ



'ఇది కుర్చీని కాపాడుకునే (కుర్చీ బచావో) బడ్జెట్. మిత్ర పక్షాలను బుజ్జగించేందుకు ఇతర రాష్ట్రాల ప్రయోజనాలను పక్కనబెట్టి వారికి మాత్రమే వరాలు కురిపించారు. సామాన్య ప్రజలకు ఎలాంటి ఉపశమనం కల్పించకుండా.. ఆశ్రిత పెట్టుబడుదారులకు హామీలు ఇచ్చారు. ఇది గత బడ్జెట్‌ల కాపీ పేస్ట్ మాత్రమే'

నిరాశాజనకం : సీతారాం ఏచూరి



కేంద్ర బడ్జెట్ చాలా నిరాశాజనకంగా ఉంది. ఆర్థిక లోటు తగ్గించేందుకు, ద్రవ్యోల్బణాన్ని అదుపు చేసేందుకు ఎలాంటి ప్రయత్నాలు లేవు. మధ్యతరగతి ప్రజల జీవితాన్ని మరింత కష్టతరం చేస్తుంది. మహిళలకు సంబంధించి ప్రతి బడ్జెట్‌లోనూ ప్రకటనలున్నా, కేటాయింపులు పెరగడం లేదు. వాటినీ అమలు చేయడం లేదు. మణిపూర్ మండుతోంది. అయినా, ఈశాన్య రాష్ట్రాల అభివృద్ధికి బడ్జెట్‌లో ఎనిమిది కోట్లు మాత్రమే పెంచారు. దేశవ్యాప్తంగా అనేక నిర్మాణాలు, అభివద్ధిని తీసుకొస్తాయన్నారు. ఈ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత నిర్మించిన ఫ్లై ఓవర్లు, బ్రిడ్జిలు ఎన్ని కుప్పకూలాయి. ఇదే మోదీ ప్రభుత్వ అభివృద్ధి.


అమరావతికి రూ.15 వేల కోట్ల అప్పు

బడ్జెట్‌లో విభజన చట్టం ప్రస్తావన

ప్రపంచబ్యాంకు నుండి ఇప్పిస్తామన్న ఆర్థికశాఖ మంత్రి

పోలవరానికి నిధులపై అస్పష్టత

ప్రత్యేకహోదా, పునరావాసం, విశాఖ ఉక్కు ఊసు లేదు



ప్రజాశక్తి - అమరావతి బ్యూరో, న్యూఢిల్లీ బ్యూరో

రాజధాని అమరావతి నిర్మాణానికి కేంద్ర ప్రభుత్వం 15 వేల కోట్ల రూపాయలను కేటాయించినట్లు మీడియాలో విస్తృత ప్రచారమైన సంగతి తెలిసిందే. వాస్తవానికి కేంద్ర ప్రభుత్వం ఈ మొత్తాన్ని రుణంగా సర్దుబాటు చేస్తామని పేర్కొంది. ఆర్థికశాఖ మంత్రి నిర్మలాసీతారామన్ లోక్‌సభలో మంగళవారం ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో ఈ విషయాన్ని స్పష్టంగా పేర్కొన్నారు. రాష్ట్ర పునర్ వ్యవస్థీకరణ చట్టాన్ని బడ్జెట్ ప్రతిపాదనల్లో పేర్కొన్న కేంద్ర మంత్రి దాని అమలులో భాగంగా విదేశీ విత్త సంస్థల నుండి 15 వేల కోట్ల రూపాయలను సర్దుబాటు చేస్తామని, అవసరమైతే మరింతగా అదనపు నిధులకు సహకరిస్తామని పేర్కొన్నారు. నిజానికి పునర్‌వ్యవస్థీకరణ చట్టం ప్రకారం రాజధాని నిర్మాణానికి సహకరించడంతో పాటు, కీలక నిర్మాణాలకు ఆర్థిక సాయం చేయాల్సిఉంది. ఆ చట్టంలోని పదవ విభాగంలో 94వ సెక్షన్ సబ్‌సెక్షన్ 3లో ఈ విషయాన్ని స్పష్టంగా పేర్కొన్నారు. దాని ప్రకారం రాజ్‌భవన్, హైకోర్టు, సచివాలయం, అసెంబ్లీ, కౌన్సిల్ నిర్మాణాలతో పాటు ఇతర మౌలికవసతుల నిర్మాణానికి అవసరమైన నిధులను ప్రత్యేక ఆర్థికసాయంగా కేంద్రం అందిచాల్సిఉంది. దానికి భిన్నంగా రుణంగా ఇస్తామని కేంద్రం తాజాగా పేర్కొంది. బడ్జెట్‌ను ప్రవేశపెట్టిన అనంతరం విలేకరులతో మాట్లాడిన కేంద్ర ఆర్థికశాఖ మంత్రి ప్రపంచబ్యాంకు నుండి ఆ మొత్తాన్ని ఇప్పిస్తామని ఒక ప్రశ్నకు జవాబుగా చెప్పారు. మ్యాచింగ్ గ్రాంటు మొత్తం ఏదైనా ఉంటే దానిని సర్దుబాటు చేస్తామని అన్నారు. మొత్తం మీద రాజధాని నగర నిర్మాణ భారాన్ని రాష్ట్ర ప్రజలపైనే పడనుంది. ఇక విభజన చట్టంలో కీలకమైన పోలవరం ప్రాజెక్టు అంశాన్ని కూడా బడ్జెట్‌లో ప్రస్తావించినప్పటికీ, ఎంత నిధులు కేటాయిస్తారన్న విషయం చెప్పలేదు. త్వరగా పూర్తికావడానికి అవసరమైన ఆర్థికసాయం చేస్తామని మాత్రమే పేర్కొన్నారు. ఇక నిర్వాసితులు, పునరావాసం తదితర అంశాలనే ప్రస్తావించలేదు. పారిశ్రామిక అభివృద్ధిలో భాగంగా మిగతా 7లో

ఏ రూపంలో నిధులొచ్చినా మేలే

నిధులు ఏ రూపంలో వచ్చినా ఉపయోగమే. ఏజెన్సీల నుంచి వచ్చే అప్పును కేంద్రం పూచీకత్తుతో ఇస్తుంది. కొంత గ్రాంటు కలిపి ఉంటుంది. రాజధానికి నిధులు ఇవ్వడం వల్ల ఆర్థిక కార్యకలాపాలు పెరుగుతాయి. 'పోలవరం' ప్రాజెక్టు బాధ్యత తమదేనని కేంద్రం చెప్పింది. వెనుకబడిన జిల్లాలకు బుందేల్‌ఖండ్ తరహా సాయం ఉంటుందని, ఈ జాబితాలో ప్రకాశం జిల్లాను చేర్చడం అభినందనీయం.

ఎన్ చంద్రబాబునాయుడు, ముఖ్యమంత్రి

తీవ్ర నిరాశ


కేంద్ర ప్రభుత్వ బడ్జెట్ ఆంధ్రప్రదేశ్ ప్రజలకు తీవ్ర నిరాశ కలిగించింది. మాటలే ఘనం.. చేతులు శూన్యం. విభజన చట్టంలోని అన్ని అంశాల అమలుకు నిధులు ఇస్తారని ఆశించిన ప్రజలకు నిరాశే ఎదురైంది. సంక్షోభంలో ఉన్న విశాఖ ఉక్కును ఆదుకోకపోగా నిధులు గతం కంటే తెగ్గోయడం దారుణం. అమరావతికి రూ.15 వేల కోట్లు ఆర్థిక సంస్థల నుంచి ఇప్పిస్తే మేలు జరగదు. కేంద్రమే నేరుగా గ్రాంటు ప్రకటించాలి.

వి శ్రీనివాసరావు, సిపిఎం రాష్ట్ర కార్యదర్శి

రాష్ట్రానికి మొండిచేయి

కేంద్రంలో మిత్రపక్షంగా వుంటూ రాష్ట్రానికి నిధులు రాబట్టడంలో టిడిపి ప్రభుత్వం పూర్తిగా విఫలమైంది. బడ్జెట్‌లో రాష్ట్రానికి మరోసారి మొండిచేయి ఎదురైంది. రాజధానికి రూ.15 వేల కోట్లను అప్పుల రూపేణా ఇప్పిస్తామనడం రాష్ట్ర ప్రజలను మోసం చేయడమే.

- సామాజిక మాధ్యమాల్లో వైసిపి



ధరలు తగ్గేవి

- కొన్ని రకాల కేన్సర్ మందులు
- మెడికల్ ఎక్స్‌రే యంత్రాలు
- మొబైల్ ఫోన్లు, ఛార్జర్లు
- చేపలు, రొయ్యల మేత
- తోలు వస్తువులు
- పాదరక్షలు
- వస్త్రాలు
- బంగారం, వెండి, ప్లాటినం తయారీ ఛార్జీలు



ధరలు పెరిగేవి

- ప్లాటినం వస్తువులు
- బంగారు కడ్డీలు
- కృత్రిమ ఆభరణాలు
- సిగరెట్లు
- వంటగది చిమ్నీలు
- కాంపౌండ్ రబ్బరు
- కాపర్ స్క్రాప్
- దిగుమతి చేసుకున్న టెలికాం పరికరాలు



అంగన్‌వాడీ సమస్యలపై చర్చించాలి

- మండలిలో పిడిఎఫ్ వాయిదా తీర్మానం

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో



అంగన్‌వాడీ వర్కర్లు, హెల్పర్ల సమస్యలపై చర్చించాలని పిడిఎఫ్ ఎమ్మెల్సీలు కెఎస్ లక్ష్మణరావు, ఐ వెంకటేశ్వరరావు శాసన మండలిలో వాయిదా తీర్మానం అందజేశారు. మంగళవారం మండలి ప్రారంభం కాగానే అంగన్‌వాడీ సమస్యలపై చర్చించాలని ఛైర్మన్ కె మోషేన్ రాజుకు కెఎస్, ఐవి కోరారు. అయితే ఈ వాయిదా తీర్మానాన్ని తిరస్కరిస్తున్నట్లు ఛైర్మన్ తెలిపారు. మరో పద్ధతిలోనైనా ఈ అంశంపై చర్చించే అవకాశం ఇవ్వాలని ఛైర్మన్‌ను లక్ష్మణరావు కోరారు. రాష్ట్రంలో 1.5 లక్షల మంది అంగన్‌వాడీ వర్కర్లు, హెల్పర్లు ఉన్నారని తెలిపారు. జనవరిలో 42 రోజులు వీరు సమ్మె చేశారని, గత ప్రభుత్వం ఈ సమ్మెను నిర్దాక్షిణ్యంగా అణచివేసిందని అన్నారు. వీరి సమస్యలపై కొత్త ప్రభుత్వం యూనియన్లను చర్చలకు పిలవాలని కోరారు.

వ్యవ'సాయం' దారుణం

- ఎరువుల రాయితీలకు కోతలు
- ఆహార సబ్సిడీకి కూడా..
- ఎంఎస్‌పి చట్టం ఊసే లేదు
- సాగు కార్పొరేటీకరణ చర్యలు
- జాతీయ సహకార విధానం

ప్రజాశక్తి ప్రత్యేక ప్రతినిధి- అమరావతి



వ్యవసాయ, అనుబంధ రంగాలకు నిధుల కేటాయింపుల్లో భారీ కత్తిరింపులు, అత్తెసరు ప్రతిపాదనలు.. ఇవీ మంగళవారం ఎన్‌డిఎ ప్రభుత్వం పార్లమెంట్‌లో ప్రవేశపెట్టిన 2024-25 బడ్జెట్ తీరు. ఎరువుల సబ్సిడీకి పెద్ద ఎత్తున కేటాయింపులు తగ్గించారు. ప్రధాన మంత్రి గరీబీ కళ్యాణ్ యోజన అమలు చేస్తామంటూనే ఆహార సబ్సిడీకి భారీగా కోత పెట్టారు. వ్యవసాయ కూలీలకు పనులు కల్పించే ఉపాధి హామీకి బొటాబొటిగా నిధులు ప్రతిపాదించారు. పంటల బీమా, పిఎం కిసాన్, ఇలా అన్ని పథకాలదీ ఇదే పరిస్థితి. ఎన్‌డిఎ సంకీర్ణ సర్కారు బడ్జెట్‌లో తొమ్మిది ప్రాధాన్యతలను పేర్కొనగా, వాటిలో మొదటిది వ్యవసా యోత్పత్తుల ఉత్పాదకత పెంపు. ఎరువుల సబ్సిడీ, ఆహార సేకరణ సబ్సిడీ, ఉపాధి హామీలకు నిధులివ్వ కుండా ఏ విధంగా పంటల ఉత్పాదకత పెరుగుతుందో అర్థం కాదు. ఈ తడవ బడ్జెట్‌లో రైతుల ఆదాయాల రెట్టింపుపై మాట్లాడలేదు. వ్యవసాయ పంటలకు కనీస మద్దతు ధర (ఎంఎస్‌పి)లను గ్యారంటీ చేస్తూ చట్టబద్ధత కల్పించాలని రైతులు ఆందోళనలు చేస్తుండగా బడ్జెట్‌లో ఆ ఊసే లేదు. స్వామినాథన్ సిఫార సుల అమలును వదిలేసినట్లు కనిపిస్తోంది. ఎంఎస్‌పి లేని పంట ఉత్పత్తుల ధరలు తగ్గిన పక్షంలో మార్కెట్‌లో జోక్యం చేసుకునే స్కీంలను పూర్తిగా ఎత్తేశారు. ఆ స్థానంలో కార్పొరేట్లకు ఆస్కారం కలిగించే, సేకరణలో ప్రభుత్వ పాత్ర లేకుండా, ప్రైవేటు జోక్యానికి ఆస్కారం కలిగించే 'పిఎం-ఆశా' పథకానికి బడ్జెట్‌లో మొక్కుబడిగా నిధులు కేటాయించారు.

ముఖ్య స్కీంల ప్రతిపాదనలు


ఏడాదికి మూడు కిస్తుల్లో రూ.6 వేలు రైతులకు ఇచ్చే పిఎం కిసాన్‌కు రూ.60 వేల కోట్లే ప్రతిపాదించారు. నిరుడు కూడా అంతే కేటాయించారు. క్రాప్ ఇన్సూరెన్స్‌కు (ఫసల్ బీమా) 14,600 కోట్లు చూపించారు. గతేడాది కంటే 400 కోట్లు తక్కువ కేటాయించారు. రైతు రుణాలపై వడ్డీ రాయితీకి రూ.22,600 కోట్లు, ఆర్‌కెవివైకి 7,553 కోట్లు, డ్రోన్లకు 500 కోట్లు మిగతా 6లో

బడ్జెట్ కేటాయింపులు (రూ.కోట్లలో)

వివరం	2022-23 ఖర్చు	23-24 అంచనా	23-24 సవరించిన అంచనా	24-25 అంచనా
వ్యవసాయం	99,877	1,15,531	1,16,781	1,22,528
ఎరువుల సబ్సిడీ	2,51,340	1,75,103	1,88,901	1,64,102
ఆహార సబ్సిడీ	2,72,802	1,97,350	2,12,332	2.05.250

ఆర్థిక ఇబ్బందుల వల్లే ఓట్ ఆన్ ఎకౌంట్

- శాసనసభలో గవర్నర్ ప్రసంగంపై చంద్రబాబు
- ధన్యవాదాలు తెలిపే తీర్మానానికి సభ ఆమోదం



ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

ఆర్థిక ఇబ్బందుల వల్లే ప్రస్తుతం పూర్తి స్థాయి బడ్జెట్ ప్రవేశపెట్టలేకపోతున్నామని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు తెలిపారు. శాసనసభలో మంగళవారం గవర్నర్ ప్రసంగానికి ధన్యవాదాలు తెలిపే తీర్మానంపై జరిగిన చర్చలో ఆయన మాట్లాడుతూ మరో రెండు నెలల్లో పూర్తిస్థాయి బడ్జెట్‌ను ప్రవేశపెడతామని వెల్లడించారు. పివి నరసింహారావు ఆర్థిక సంస్కరణల వల్ల దేశ ఆర్థిక వ్యవస్థలో పెనుమార్పులు వచ్చాయన్నారు. ఈ సంస్కరణలను రాష్ట్రంలో కూడా అప్పట్లో తాను అమలు చేసి ప్రభుత్వ, ప్రైవేటు భాగస్వామ్యంతో ఎంతో అభివృద్ధి సాధించామన్నారు. విజన్ 2020 డాక్యుమెంట్ రూపొందించానని తెలిపారు. ఇదే కోవలో ప్రస్తుతం విజన్ 2047 లక్ష్యంతో పనిచేస్తున్నామని తెలిపారు. గత ప్రభుత్వ అవలంభించిన ఆర్థిక విధ్వంసం వల్ల రాష్ట్రం అధోగతిపాలైందన్నారు. ప్రభుత్వ ఆదాయం ఐదేళ్లలో దోపిడీ జరిగిందన్నారు. ఇసుక,మద్యం లాంటివి రూ.లక్షల కోట్ల మేరకు దోపిడీ జరిగిందన్నారు. 2019 నుంచి రాష్ట్ర వృద్ధి రేటు పడిపోయిందన్నారు. మూలధనాన్ని 60 శాతం మేర తగ్గించారని తెలిపారు. జలవనరులపై 56 శాతం, రోడ్లపై 85 శాతం మూల ధనం తగ్గిందన్నారు. రాష్ట్రంలో రహదారుల అభివృద్ధిని గత ప్రభుత్వం నిర్లక్ష్యం చేసిందని తాము త్వరలో బాగు చేస్తామన్నారు. ఎన్నికల మేనిఫెస్టోలో ప్రకటించిన ఆరు పథకాలను అమలు చేస్తామని తెలిపారు. రుషికొండపై త్వరలో శాసనసభ కమిటీ ఏర్పాటు చేసి అందరూ వెళ్లి పరిశీలిస్తామన్నారు. తాను కూడా వస్తానని తెలిపారు. గవర్నర్ ప్రసంగానికి ధన్యవాదాలు తెలిపారు.

వివేకా హత్యకు సమాధానం వస్తుంది

మాజీ మంత్రి వివేకానందరెడ్డి హత్య ఎవరు చేశారో త్వరలో జవాబు వస్తుందని సిఎం చంద్రబాబు నాయుడు తెలిపారు. వివేకా హత్య కేసు అనేక మలుపులు తిరిగిందన్నారు. హత్య జరిగాక ఘటన స్థలానికి వెళ్లిన అప్పటి సిఐపై సిబిఐ మిగతా 7లో

వేతన జీవికి నిరాశే!

స్వల్ప ఊరట పట్ల పెదవి విరుపు

ప్రజాశక్తి - న్యూఢిల్లీ



బడ్జెట్‌పై వేతన జీవులు పెట్టుకున్న ఆశలను మోడీ ప్రభుత్వం అందుకోలేకపోయింది. పన్ను శ్లాబుల్లో లతో పాటు, స్టాండర్డ్ డిడక్షన్ లో చేసిన మార్పుల పట్ల ఉద్యోగులు పెదవి విరుస్తున్నారు. ఆ చర్యల వల్ల పెద్దగా ఉపయోగం లేదన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది. ప్రస్తుతం స్టాండర్డ్ డిడక్షన్ మొత్తం 50 వేల రూపాయలు ఉండగా, దానిని 75 వేల రూపాయలకు పెంచుతున్నట్లు బడ్జెట్‌లో ప్రతిపాదించారు. దీనివల్ల 17,500 రూపాయల వరకు ఉద్యోగులకు ఆదా అవుతుందని కేంద్ర మంత్రి నిర్మలా సీతారామన్ చెప్పారు. అయితే, ఉద్యోగుల్లో మాత్రం కనీసం లక్ష రూపాయల వరకు మినహాయింపు ఇచ్చి ఉండాలన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది. ఇక పన్ను శ్లాబుల విషయాని కొస్తే కొత్త పన్ను విధానంలో ఉండే వారికి మూడు లక్షల రూపాయల వరకు ఎటువంటి పన్నూ ఉండదు. గతంలో 3-6 లక్షల శ్లాబులో ఉండే వారికి 5 శాతం పన్ను ఉండేది, ఇప్పుడు ఆ మొత్తాన్ని 7లక్షల రూపాయలకు పెంచారు. గతంలో 6-9 లక్షల రూపాయల శ్లాబులో ఉండేవారికి 10శాతం పన్ను ఉండగా, తాజా శ్లాబుల ప్రకారం 7-10 లక్షల రూపాయల శ్లాబులో ఉండేవారు 10 శాతం పన్ను చెల్లించాల్సి ఉంటుంది. పాత పన్ను విధానంలో కొనసాగుతున్న వారికి ఎటువంటి మార్పులు లేవు. పెన్షనర్లకు 15 వేల రూపాయలుగా ఉన్న స్టాండర్డ్ డిడక్షన్‌ను 25 వేల రూపాయలకు పెంచారు.

కొత్త శ్లాబులు ఇలా...

ఆదాయం (రూ లక్షలలో)	పన్ను (శాతం)
0-3	0
3-7	5
7-10	10
10-12	15
12-15	20
15 లక్షల పైన	30

గుక్కెడు మంచినీరూ కరువే..

- పిల్లలకు అందని పాలు
- జ్వరపీడితులనూ పట్టించుకోని వైనం
- పునరావాస కేంద్రాల్లో దయనీయంగా బాధితులు
- గోదావరి ముంచేసినా కనికరించని ప్రభుత్వం

ఫైళ్ల దహనం కేసులో విచారణ ముమ్మరం

- సబ్ కలెక్టరేట్‌కు చేరుతున్న రికార్డులు
- డిఆర్‌ఒ, 5 బృందాలు పరిశీలన
- పెద్దిరెడ్డి అనుచరుల ఇళ్లలో సోదాలు

లోపలి పేజీల్లో..

ప్రజాశక్తి www.prajasakti.com
విజయవాడ బుధవారం 24 జులై 2024

తొమ్మిది ప్రాధాన్యతలు

- వరుసగా ఏడోసారి బడ్జెట్ ప్రవేశపెడుతూ ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్
- తీర్థయాత్రలు, పర్యాటకానికి ప్రోత్సాహం!
- మైనారిటీ పథకాలకు కోతలు !
- చదువుకు రూ.10లక్షల వరకు రుణం
- ఉపాధి హామీకి తగ్గిన కేటాయింపులు



న్యూఢిల్లీ : కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ మంగళవారం వరుసగా ఏడవసారి కేంద్ర బడ్జెట్‌ను పార్లమెంట్‌లో ప్రవేశపెడుతూ తొమ్మిది ప్రాధాన్యతల గురించి పేర్కొన్నారు. వ్యవసాయం, ఉపాధి, నైపుణ్యం, సామాజిక న్యాయం, వస్తూత్పత్తిరంగం, పట్టణాభివృద్ధి, ఇంధన భద్రత, మౌలిక సదుపాయాలు, ఇన్నోవేషన్ పరిశోధనలు మలివిడత సంస్కరణలు తమ ప్రాధాన్యతలని చెప్పిన ఆమె ఈ రంగాల్లో కేటాయింపులకు కోతలు పెట్టారు. మాజీ ప్రధాని మొరార్జీ దేశాయ్ రికార్డును అధిగమించి కొత్త రికార్డును నెలకొల్పారు. మోడీ ప్రభుత్వం మూడోసారి అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రవేశపెట్టిన మొదటి బడ్జెట్ ఇది. ఈ బడ్జెట్‌లో ప్రధానంగా తొమ్మిది ప్రాధాన్యతాంశాలను పేర్కొన్నారు. అవి వ్యవసాయ రంగంలో ఉత్పాదకత పెంపు, ఉపాధి, నైపుణ్యాల అభివృద్ధి, సమగ్ర మానవ వనరుల అభివృద్ధి, సామాజిక న్యాయం, తయారీ రంగం-సేవలు, సూక్ష్మ, చిన్న, మధ్య తరహా సంస్థలకు తోడ్పాటు, పట్టణాభివృద్ధి, ఇంధన భద్రత, మౌలిక వసతులు, వినూత్న పరిశోధనలు - అభివృద్ధి రంగాలు, తదుపరి తరం సంస్కరణలని చెప్పారు.

మైనారిటీ పథకాలకు కోతలు

మైనారిటీ వ్యవహారాల మంత్రిత్వ శాఖకు కేటాయింపులు చాలా స్వల్పంగా 2.7శాతం మేరకే పెరిగాయి. అందులో కూడా పలు పథకాలకు కోతలు పడ్డాయి. మైనారిటీలకు కోచింగ్, ఇతర సంబంధిత పథకాలకు కేటాయింపులను ఈ ఏడాది రూ.30 కోట్ల నుండి రూ.10 కోట్లకు తగ్గించారు. విదేశాల్లో చదువుకునే మైనారిటీ విద్యార్థుల రుణాలపై ఇచ్చే వడ్డీ సబ్సిడీని కూడా తగ్గించారు. మదరసాలు, మైనారిటీల విద్యా పథకానికి ఇచ్చే బడ్జెట్‌కూడా దారుణంగా రూ.10 కోట్ల నుండి రూ.2 కోట్లకు తగ్గిపోయింది.

రైల్వేలకు బడ్జెట్‌లో రూ.2.62 లక్షల కోట్లను కేటాయించారు. 40వేల కొత్త రైల్వే ఉద్యోగాల కల్పనపై దృష్టి పెట్టినట్లు చెప్పారు.

పన్ను శ్లాబ్‌లో మార్పులు

పన్ను చెల్లింపుదారులకు మంచి వార్తను వినిపించారు. పన్ను శ్లాబుల్లో మార్పులను తీసుకొచ్చారు. స్టాండర్ట్ డిడక్షన్‌ను ప్రస్తుతమున్న రూ.50వేల నుండి రూ.75 వేలకు పెంచారు. కొత్త పన్ను శ్లాబ్‌ల కింద ఆదాయపన్నులో రూ.17,500 వరకు ఉద్యోగులు ఆదా చేసుకోవచ్చని మంత్రి చెప్పారు. పాత పన్ను వ్యవస్థలో ఎలాంటి మార్పులు చేయలేదు.

ఐటీ చట్టంపై సమగ్ర సమీక్ష

ఐటీ చట్టంపై సమగ్ర సమీక్ష జరుపుతామని నిర్మలా సీతారామన్ చెప్పారు. అందరూ అర్థమయ్యేలా చదువుకునేందుకు, వ్యాజ్యాల సంఖ్యను తగ్గించేందుకు ఈ సమీక్ష అవసరమని అన్నారు. స్టార్టప్ కంపెనీలకు ఊతమిచ్చేందుకు ఏంజెల్ పన్నును రద్దు చేస్తామని ఆమె ప్రతిపాదించారు. విదేశీ కంపెనీలపై కార్పొరేట్ పన్ను రేటును 40% నుండి 35%కి తగ్గిస్తామని తెలిపారు.

ఉపాధి హామీకి తగ్గిన నిధులు

ఈసారి బడ్జెట్‌లో గ్రామీణ ఉపాధి హామీ పథకానికి కేటాయింపులు తగ్గాయి. గతేడాది ఖర్చు పెట్టిన దానికన్నా తక్కువ మొత్తమే కేటాయించారు. ఇటీవలి ఎన్నికల్లో గ్రామీణ భారతంలోని చాలా నియోజకవర్గాల్లో బిజెపి ఓటమి చవిచూసినప్పటికీ ఈ పథకానికి కేటాయింపులు పెరగలేదు.

పూర్వోదయ పథకం

బీహార్, జార్ఖండ్, పశ్చిమ బెంగాల్, ఒడిషా, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల సమగ్రాభివృద్ధి కోసం 'పూర్వోదయ' పథకాన్ని చేపడతామని ఆర్థిక మంత్రి చెప్పారు. బడ్జెట్‌లో మూలధనపు వ్యయ లక్ష్యాన్ని రూ.11.11 లక్షల కోట్లుగా చూపారు.

ఉపాధి, నైపుణ్యాలకు ప్రధానమంత్రి ప్యాకేజీ

ఈపీఎఫ్ఓలో తొలిసారిగా నమోదైన ఉద్యోగులు ప్రభుత్వం నుండి మొదటి నెలలో రూ.15,000 వరకూ అదనపు జీతం పొందుతారు. 'ప్రైమ్ మినిస్టర్ ప్యాకేజ్ ఫర్ ఎంప్లాయిమెంట్ అండ్ స్కిల్లింగ్' పథకంలో భాగంగా ఈపీఎఫ్ఓలో తొలిసారి పేరు నమోదు చేసుకున్న ఉద్యోగులకు ఒక నెల జీతం అదనంగా అందిస్తామని ఆర్థిక మంత్రి తెలిపారు. ఈ మొత్తాన్ని మూడు వాయిదాల్లో ఉద్యోగి బ్యాంక్ ఖాతాలో నేరుగా జమ చేస్తామని చెప్పారు. దీనివల్ల 2.10కోట్ల మంది యువత లబ్ధి పొందుతారన్నారు.

బడ్జెట్‌లో మహిళలకేం చేశారంటే

మహిళల నేతృత్వంలో అభివృద్ధి సాధనకు రూ.3లక్షలకు పైగా కోట్లతో పథకాలను తీసుకొచ్చారు. మహిళలకు కేటాయించిన బడ్జెట్‌ను చూస్తే ఆర్థికాభివృద్ధిలో మహిళా సాధికారతను పెంపొందించేందుకు ప్రభుత్వానికి గల నిబద్ధత తెలుస్తుందని మంత్రి నిర్మలా సీతారామన్ పేర్కొన్నారు. కార్మిక శక్తిలో మహిళల ప్రాతినిధ్యాన్ని ప్రోత్సహించేందుకు పరిశ్రమలతో ప్రభుత్వం అవగాహన కుదుర్చుకుంటుందని, వర్కింగ్ వుమెన్ హాస్టళ్లను ఏర్పాటు చేయడానికి, పిల్లల కోసం క్రెష్ వంటి సదుపాయాలను ఏర్పాటు చేయడానికి చర్యలు తీసుకుంటుందని చెప్పారు. పైగా మహిళల్లో నిర్దిష్ట నైపుణ్యాల అభివృద్ధికి, స్వయం సహాయక గ్రూపులకు మార్కెట్ సౌలభ్యాన్ని పెంచేందుకు కూడా పరిశ్రమలు - ప్రభుత్వం భాగస్వామ్యం ఉపయోగపడు తుందన్నారు. మహిళలు కొనుగోలు చేసిన ఆస్తులపై సుంకాలను కూడా తగ్గిస్తున్నట్లు ప్రకటించారు. సామాజిక న్యాయానికి సంబంధించినంతవరకు అర్హులైన వారందరికీ వివిధ పథకాల ద్వారా లబ్ధి పొందేలా చూడాలన్నదే తమ ప్రభుత్వ అభిమతమని చెప్పారు.

ఉపాధి, నైపుణ్యాల పెంపు, మధ్య తరగతి వర్గాలపై ప్రధానంగా దృష్టి కేంద్రీకరించామని ఆమె తెలిపారు. రాబోయే ఐదు సంవత్సరాల కాలంలో ఈ ప్యాకేజీ కింద 4.1 కోట్ల మంది యువతకు ఉపాధి కల్పన, నైపుణ్యాభివృద్ధి, ఇతర అవకాశాలు కల్పిస్తామని వివరించారు. ఇందుకోసం రెండు లక్షల కోట్ల రూపాయలు కేటాయించామని చెప్పారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో విద్య, ఉపాధి, నైపుణ్య చర్యల కోసం రూ.1.48 లక్షల కోట్లు అందజేస్తామని అన్నారు. ఈ ప్యాకేజీలోని ఐదు పథకాల్లో మూడింటికి 'ఉపాధి ఆధారిత ప్రోత్సాహకం' (ఇఎల్ఐ) అని పేరు పెట్టామని, తొలిసారి ఉద్యోగి అయ్యే వారికి దీని కింద నెల జీతం అందిస్తామని తెలిపారు. తయారీ రంగంలో ఉపాధి కల్పనకు మరో పథకాన్ని ఉద్దేశించామని, ఉద్యోగితో పాటు యజమానికి కూడా వారి ఈపీఎఫ్ఓ కంట్రిబ్యూషన్ ఆధారంగా ప్రోత్సాహకాలు అందిస్తామని చెప్పారు. ఉద్యోగం వచ్చిన మొదటి నాలుగు సంవత్సరాల వరకూ ఇది అమలులో ఉంటుందని అన్నారు.

మూడవ పథకంలో యజమానులకు అవసరమైన మద్దతు అందిస్తామని నిర్మల తెలిపారు. ప్రతి అదనపు ఉద్యోగి కోసం ఇపిఎఫ్ఓ కంట్రిబ్యూషన్ కింద చెల్లించే వాటాలో రెండు సంవత్సరాల పాటు నెలకు రూ.3,000 చొప్పున రీయంబర్స్‌మెంట్ చేస్తామని చెప్పారు. నాలుగో పథకంలో భాగంగా రాష్ట్ర ప్రభుత్వాలు, పరిశ్రమ సహకారంతో నైపుణ్యాభివృద్ధికి చర్యలు చేపడతామని అన్నారు. దీనికింద రాబోయే ఐదు సంవత్సరాల్లో 20 లక్షల మంది యువతకు శిక్షణ ఇస్తామని చెప్పారు. ప్రధానమంత్రి ప్యాకేజీలో చివరి పథకంలో భాగంగా ఇంటర్న్‌షిప్ అవకాశాలు కల్పిస్తామని, రాబోయే ఐదు సంవత్సరాల్లో ఐదు వందల ప్రముఖ కంపెనీల్లో కోటి మందికి ఇంటర్న్‌షిప్ ఇస్తామని వివరించారు. ఏ ప్రభుత్వ పథకాల్లోనూ ఇప్పటివరకు లబ్ధి పొందని విద్యార్థులు దేశీయ విద్యా సంస్థల్లో చదువుకోవడానికి రూ.10లక్షల వరకు రుణాలు పొందుతారు.

వ్యవసాయానికి రూ.1.5లక్షల కోట్లు

ప్రకృతి వ్యవసాయంలోకి దేశవ్యాప్తంగా కోటిమంది రైతులను తీసుకురావాలని బడ్జెట్‌లో ప్రతిపాదించారు. ఐదు రాష్ట్రాల్లో కిసాన్ క్రెడిట్ కార్డులను ఇవ్వనున్నట్లు ప్రకటించారు. వ్యవసాయం, అనుబంధ రంగాల అభివృద్ధికి రూ.1.5లక్షల కోట్లు కేటాయించినట్లు చెప్పారు. పప్పు ధాన్యాలు, నూనె విత్తనాల ఉత్పత్తిలో స్వావలంబన సాధించడానికి చర్యలు తీసుకున్నట్లు తెలిపారు. ప్రతికూల వాతావరణ పరిస్థితులను తట్టుకొని, అధిక దిగుబడిని అందించే 109 నూతన వంగడాలను విడుదల చేస్తామని ఆర్థిక మంత్రి ప్రకటించారు. అవసరాన్ని బట్టి పది వేల బయో-ఇన్‌పుట్ రిసోర్స్ కేంద్రాలను ఏర్పాటు చేస్తామని, వాటికి కేంద్రం చేయూత అందిస్తుందని చెప్పారు. సవరించిన అంచనాల ప్రకారం వ్యవసాయ మంత్రిత్వ శాఖకు రూ.1,16,788.96 కోట్లు కేటాయించారు.


విద్యుత్‌కు ప్రాధాన్యం

దేశంలో కోటి కుటుంబాలు నెలకు 300 యూనిట్ల వరకూ ఉచిత విద్యుత్ పొందేందుకు వీలుగా 'పీఎం సూర్యఘర్ ముఫ్త్ బిజిలీ యోజన' కింద ఇంటి పైకప్పులపై సౌర ఫలకాలను ఏర్పాటు చేస్తామని ఆర్థిక మంత్రి ప్రకటించారు. ఉచిత సౌర విద్యుత్ వినియోగం కారణంగా కుటుంబాలు ఏటా రూ.15,000 - 18,000 కోట్లు ఆదా చేసుకోగలుగుతాయని, మిగులు విద్యుత్‌ను పంపిణీ కంపెనీలకు విక్రయించుకోవచ్చునని తెలిపారు. 2030 నాటికి శిలాజయేతర ఇంధన వనరుల నుండి 50 జీడబ్ల్యూ పునరుత్పాదక ఇంధనాన్ని, విద్యుదుత్పత్తి స్థాపక సామర్థ్యంలో యాభై శాతాన్ని పొందాలని లక్ష్యంగా నిర్దేశించుకున్నామని వివరించారు. ఈ బడ్జెట్‌లో విద్యుత్ మంత్రిత్వ శాఖకు రూ.20,502 కోట్లు కేటాయించారు. గత ఆర్థిక సంవత్సరంలో ఈ మంత్రిత్వ శాఖ బడ్జెటరీ వ్యయం రూ.20,671.32 కోట్లు.

ఏ రూపంలో ఇచ్చినా రాష్ట్రానికి మేలే

- కేంద్ర బడ్జెట్‌పై సిఎం చంద్రబాబు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో



కేంద్ర ప్రభుత్వం నుంచి రాష్ట్రానికి నిధులు ఏ రూపంలో వచ్చినా ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అన్నారు. ఆర్థికంగా అప్పుల్లో కూరుకుపోయామని, ఈ సమయంలో నిధులు రావడం ఎంతో ఉపయోగకరమని చెప్పారు. మంగళవారం అసెంబ్లీ ముగిసిన తరువాత తనను కలిసిన విలేకరులతో చంద్రబాబు ఇష్టాగోష్టిగా మాట్లాడారు. అమరావతి రాజధాని నిర్మాణానికి కేంద్రం కేటాయించిన రూ.15 వేలకోట్లపై ఆయన స్పందించారు. వివిధ ఏజెన్సీల నుంచి వచ్చే అప్పును కేంద్రం పూచీకత్తుతో ఇస్తుందని, మరికొంత గ్రాంటు కూడా కలిపి ఉంటుందని వివరించారు. ఏజెన్సీల నుంచి నిధులు అప్పుల రూపంలో వచ్చినా 20 ఏళ్ల తర్వాతే కదా తీర్చాల్సి ఉంటుందని అన్నారు. రాజధానికి పెద్దమొత్తంలో నిధులు ఇవ్వడం వల్ల ఆర్థిక కార్యకలాపాలు పెరుగుతాయని, తద్వారా పన్నుల రూపంలో ఆదాయం పెరిగి రాష్ట్రాభివృద్ధి జరుగుతుందని అభిప్రాయం వ్యక్తం చేశారు. పోలవరం ప్రాజెక్టుకు ఇంతమేర నిధులు అని స్పష్టంగా పెట్టలేదని, ప్రాజెక్టు పూర్తిచేసే బాధ్యత తమదేనని కేంద్రం చెప్పిందని తెలిపారు. వెనుకబడిన జిల్లాలకు బుందేల్‌ఖండ్ తరహా సాయం ఉంటుందని సమాచారం ఉందన్నారు. ఈ ప్యాకేజీలో పారిశ్రామిక రాయితీలు కూడా వచ్చే అవకాశం ఉందని, నిబంధనలు పరిశీలించాక రాష్ట్రానికి అనుకూలంగా మలుచుకుంటామని తెలిపారు. వెనుకబడిన జిల్లాల జాబితాలో ప్రకాశం జిల్లాను కూడా చేర్చారని చెప్పారు. తాము పెట్టిన ప్రతిపాదనలు చాలా వరకు కేంద్రం ఆమోదించిందన్నారు.

కేంద్రానికి కృతజ్ఞతలు : లోకేష్

రాజధాని అమరావతి, జీవనాడి పోలవరం ప్రాజెక్టుల పూర్తికోసం సంపూర్ణ సహకారం అందిస్తామని ప్రకటించిన కేంద్ర ప్రభుత్వానికి ధన్యవాదాలు అని విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ సామాజిక మాధ్యమం ఎక్స్(ట్విట్టర్)లో పొందుపరిచారు. బడ్జెట్‌లో రూ.15 వేలకోట్లు కేటాయించి రాష్ట్ర పునర్నిర్మాణానికి కట్టుబడిన ఎన్‌డిఎ ప్రభుత్వానికి రాష్ట్ర ప్రజల తరపున కృతజ్ఞతలు అని తెలిపారు.

స్వాగతించిన జనసేన

కేంద్ర బడ్జెట్‌లో రాష్ట్రానికి ప్రత్యేక ప్రాధాన్యతనివ్వడాన్ని తాము స్వాగతిస్తున్నామని జనసేన పార్టీ రాజకీయ వ్యవహారాల కమిటీ ఛైర్మన్, రాష్ట్ర పౌరసరఫరాలశాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ పేర్కొన్నారు. అమరావతి, పోలవరంపై కేంద్రం మాట నిలబెట్టుకుందని, పవన్‌కల్యాణ్ ఆకాంక్షలకు అనుగుణంగా అడుగులు పడ్డాయన్నారు. జనసేన శాసనసభాపక్షం తరపున కూడా కేంద్రానికి కృతజ్ఞతలు తెలిపారు.

మాటలు ఘనం.. నిధులు స్వల్పం

- సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి శ్రీనివాసరావు

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో



కేంద్ర ప్రభుత్వ బడ్జెట్ ఆంధ్రప్రదేశ్ ప్రజలకు తీవ్ర నిరాశ కలిగించిందని, మాటలు ఘనం.. చేతులు శూన్యం అన్నట్లుగా ఉందని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి శ్రీనివాసరావు విమర్శించారు. ఎన్నికల అనంతరం ఆంధ్రప్రదేశ్‌కు న్యాయం జరుగుతుందని, భారీగా నిధులు వస్తాయని, విభజన చట్టంలోని అన్ని అంశాల అమలుకు నిధులు ఇస్తారని ఆశించిన ప్రజలకు నిరాశే ఎదురైందని పేర్కొన్నారు. పైగా సంక్షోభంలో ఉన్న విశాఖ ఉక్కును ఆదుకోకపోగా గత సంవత్సరం కన్నా రూ.63 కోట్లు తగ్గించారని తెలిపారు. విశాఖ పోర్టుకు రూ.125 కోట్లు కోత పడిందని వివరించారు. రాష్ట్రం పట్ల బిజెపికి సవతి తల్లి ప్రేమకు ఇది నిదర్శమని తెలిపారు. రాష్ట్రం నుండి ఎంపిగా ఎన్నికైన కేంద్ర ఉక్కు గనులశాఖ సహాయ మంత్రి శ్రీనివాసవర్మ దీనిపై సమాధానం చెప్పాలని కోరారు. ఆర్థిక మంత్రి ప్రసంగంలో ఆంధ్రప్రదేశ్ పేరు పలుసార్లు ప్రస్తావించారని, కానీ నిధులు కేటాయింపు నిరాశ కలిగించిందని తెలిపారు. చెప్పిన మాటల్లో కూడా స్పష్టత లేదని, ఉద్దేశపూర్వకంగానే రాష్ట్ర ప్రజలను మోసగించడానికి కేంద్రం ప్రయత్నించిందని వివరించారు. రాజధాని అమరావతికి రూ.15 వేల కోట్లు పలు ఆర్థిక సంస్థల ద్వారా ఇప్పిస్తామని మంత్రి పేర్కొనవడం వల్ల రాష్ట్రానికి రాజధానికి మేలు జరగదని తెలిపారు. రూ.15 వేల కోట్లను నేరుగా గ్రాంటుగా ప్రకటించాలని కోరారు. వివిధ సంస్థల ద్వారా అప్పులు ఇప్పించడం వల్ల రాష్ట్రాన్ని ఆర్థిక సంక్షోభంలోకి నెడుతుందని, రాష్ట్ర పరిస్థితిపై కేంద్రానికి అవగాహన ఉన్నా, బడ్జెట్లో నిధులు కేటాయించకపోవడం అన్యాయమని పేర్కొన్నారు. పోలవరం, వెనుకబడిన ప్రాంతాల అభివృద్ధి, విభజన హామీల అమలుకు కట్టుబడి ఉంటామని చెప్పారే తప్ప వాటికి నిధులు ప్రస్తావన లేదని తెలిపారు. ఆర్థిక మంత్రి ప్రస్తావించిన రెండు పారిశ్రామిక కారిడార్లకు నిధుల గురించి ప్రస్తావన లేదని పేర్కొన్నారు. పోలవరానికి రూ.12 వేల కోట్లు రావాలని రాష్ట్ర ప్రభుత్వం కోరినా బడ్జెట్లో స్పందన లేదని, నిర్వాసితులను గాలికి వదిలేశారని వివరించారు. ప్రత్యేక హోదా ఊసేలేదని, రైల్వేజోన్, కడప ఉక్కు, మెట్రో, విద్య, వైద్య సంస్థలు తదితర చట్టబద్ధమైన హామీలు బడ్జెట్లో చోటు చేసుకోలేదని పేర్కొన్నారు. గత పదేళ్ల నుండి విభజన చట్ట ప్రకారం నిధులు కేటాయించకుండా బిజెపి నిర్లక్ష్యం చేసిందని, ఈ బడ్జెట్లోనూ ఆశించిన రీతిలో కేటాయింపులు లేవని తెలిపారు. పుణ్యక్షేత్రాల టూరిజం, వరద నివారణ చర్యలు తదితర విషయాల్లో అనేక రాష్ట్రాలకు నిధులు కేటాయించినా ఆంధ్రప్రదేశ్, తెలుగు రాష్ట్రాల ప్రస్తావన లేదని పేర్కొన్నారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం తెలుగుదేశం, జనసేన పార్టీలు కేంద్రంపైనా బిజెపిపైనా రాజకీయ ఒత్తిడి తేవాలని సూచించారు. బడ్జెట్లో మాటలతో సంతృప్తి పడకుండా స్పష్టమైన నిధులు సాధించాలని, ఆంధ్రప్రదేశ్ ప్రజలు కేంద్రాన్ని, బిజెపిని నిలదీయాలని కోరారు. కేంద్ర ప్రభుత్వంలో భాగస్వాములైన తెలుగుదేశం, జనసేన పార్టీలపైన ఒత్తిడి తేవాలని, పార్లమెంటులో మన రాష్ట్ర ఎంపిలు న్యాయం కోసం పోరాడాలని కోరారు.

నిధులు రాబట్టడంలో రాష్ట్రం విఫలం : వైసిపి


ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

కేంద్రంలో మిత్రపక్షంగా వుంటూ రాష్ట్రానికి నిధులు రాబట్టడంలో చంద్రబాబు ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని వైసిపి విమర్శించింది. ఈ మేరకు కేంద్ర బడ్జెట్‌పై వైసిపి ట్విట్టర్‌లో టిడిపి ప్రభుత్వంపై విరుచుకుపడింది. బడ్జెట్‌లో రాష్ట్రానికి మరోసారి మొండిచేయి ఎదురైందని పేర్కొంది. ప్రత్యేక హోదా అంశంలో కేంద్రాన్ని ఒప్పించడంలో విఫలమయ్యారని విమర్శించింది. రాష్ట్రాభివృద్ధి కోసం కనీసం స్పష్టమైన హామీ ప్రకటనలు కూడా చేయించుకోలేకపోయారని పేర్కొంది. విభజన చట్టానికి కట్టుబడి వున్నామని చెబుతూనే రాష్ట్ర రాజధానికి రూ.15 వేల కోట్లను వివిధ ఏజెన్సీల నుంచి అప్పుల రూపేణా ఇప్పిస్తామనడం రాష్ట్ర ప్రజలను మోసం చేయడమేనని తెలిపింది. కీలకమైన పోలవరం ప్రాజెక్టుకు అందించే సాయం మీదా స్పష్టమైన ప్రకటన లేదని పేర్కొంది. కూటమిలో ప్రాధాన్యత వున్నా.. బీహార్ తరహాలో నిధులను రాబట్టడంలో చంద్రబాబు ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని విమర్శించింది.

పోలవరం పునరావాసంపై ప్రస్తావనేదీ?

- కేంద్ర బడ్జెట్‌పై వైఎస్ షర్మిల

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో



పోలవరం నిర్వాసితుల పునరావాసానికి సాయం అందించే విషయంలో కేంద్ర మంత్రి నిర్మలా సీతారామన్ నోరుమెదపడం లేదని పిసిసి అధ్యక్షులు వైఎస్ షర్మిల్ విమర్శించారు. విజయవాడలో ఆమె విలేకరులతో మాట్లాడుతూ.. పోలవరం నిర్వాసితులకు పునరావాసంపై రూ.12 వేల కోట్లు ఇవ్వాల్సి ఉండగా, ఇంత వరకు పట్టించుకోలేదన్నారు. ఇది బడ్జెట్ కాదని, ఎన్నికల మేనిఫెస్టోలా ఉందన్నారు. చంద్రబాబు రూ.లక్ష కోట్లు అడిగితే రూ.15 వేల కోట్ల రుణం ఇప్పిస్తామని ఆర్థిక మంత్రి ప్రకటించడం శోచనీయం అన్నారు. విభజన చట్టం ప్రకారం రాష్ట్రానికి ఇవ్వాల్సిన నిధులు ఇవ్వకుండా పదేళ్లుగా నిర్లక్ష్యం చేశారన్నారు. ప్రత్యేక హోదా ఊసే లేదన్నారు. హోదానే ఎపికి సంజీవని అన్నారు. హోదా వస్తేనే రాష్ట్రాభివృద్ధి చెందుతుందన్నారు. బీహార్ 12 మంది ఎంపిలను ఇస్తే రూ.26 వేల కోట్లు ఇచ్చారని, ఎపి నుంచి 25 మంది ఎంపిలు కేంద్రానికి మద్దతు పలికితే రూ.15 వేల కోట్లు ఇస్తారా? అని ప్రశ్నించారు. ఆంధ్రప్రదేశ్ పునర్వ్యవస్థీకరణ చట్టం 2014ను అమలు చేస్తానని హామీ ఇచ్చిన ప్రధాని నరేంద్ర మోడీ.. పదేళ్ల ఆలస్యంగా మేల్కొన్నట్లు కనిపిస్తున్నారని సిడబ్ల్యుసి ప్రత్యేక ఆహ్వానితులు, ఎపిసిసి మాజీ అధ్యక్షులు గిడుగు రుద్రరాజు అన్నారు.

రాష్ట్ర వాటా 50,475 కోట్లు

ప్రజాశక్తి ప్రత్యేక ప్రతినిధి - అమరావతి

కేంద్రం వసూలు చేసే పన్నుల ద్వారా రాష్ట్రానికి 50,474.64 కోట్ల రూపాయలు రానున్నాయి. బడ్జెట్ ప్రతిపాదనల్లో ఈ విషయం పేర్కొన్నారు. 2024-25 ఆర్థిక సంవత్సరానికి ఏడు విభాగాల పన్నుల ద్వారా ఈ మొత్తాన్ని కేటాయించనున్నారు. దేశ వ్యాప్తంగా వసూలయ్యే మొత్తం పనున్నల్లో 42 శాతాన్ని అన్ని రాష్ట్రాలకు జనాభా ప్రాతిపదికన పంపిణీ చేస్తారు. ఇందులో భాగంగా రాష్ట్రానికి 4.047 శాతం వాటా దక్కింది.కాగా వాటా పన్నులు గతేడాదికన్నా స్వల్పంగా పెరిగాయి. గత సంవత్సరంలో 44,409.58 కోట్లు కేటాయింపులు జరగ్గా, ఈ ఏడాది అదనంగా 6,065 కోట్లు నిధులు పెరిగాయి.


పన్నుల్లో వాటా వివరాలు (రూ. కోట్లలో)

విభాగం	వాటా నిధులు
కార్పొరేషన్ టాక్స్	15,156.51
ఇన్‌కమ్ టాక్స్	17,455.93
సెంట్రల్ జిఎస్‌టి	15,079.39
కస్టమ్స్ టాక్స్	2,228.46
యూనియన్ ఎక్సైజ్	469.73
సర్వీస్ టాక్స్	1.66
ఇతర పన్నులు	82.96
మొత్తం	50,474.64

సబ్సిడీలకు కోత

- ఆహారం, గ్యాస్, పెట్రోల్, యూరియా వంటి ఎరువులకు తగ్గిన కేటాయింపులు
- అంగన్‌వాడీల, పంట బీమాకు కోత
- ఉపాధి హామీ, పిఎం కిసాన్ కు పెంపు లేదు

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో



కేంద్ర బడ్జెట్‌లో సామాన్య, పేదలు, రైతులకు సంబంధించిన వాటిపై కేంద్ర ప్రభుత్వం కోత విధించింది. ఆహారం, వంటగ్యాస్, పెట్రోలియం, యూరియా వంటి ఎరువులకు బడ్జెట్ కేటాయింపులు తగ్గాయి. కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ మంగళవారం బడ్జెట్ ప్రవేశపెట్టారు. ఈ బడ్జెట్‌లో సామాన్య, పేద ప్రజలకు ఎటువంటి ఉపశమనం కలగలేదు. పైగా ఆయా వర్గాలకు సంబంధించిన రంగాల కేటాయింపుల్లో కోత విధించారు. ఆహార సబ్సిడికి సంబంధించి 2022-23 బడ్జెట్‌లో రూ. 2,72,802 కోట్లు కేటాయించగా, 2022-23లో దాన్ని రూ.2,12,332 కోట్లకు తగ్గించారు. దాన్ని 2024-25 బడ్జెట్‌లో రూ.2,05,250 కోట్లకు తగ్గించారు. ప్రజా పంపిణీకి 2023-24లో రూ 137.36 కోట్లు కేటాయించగా, ప్రస్తుత బడ్జెట్‌లో రూ.106.73 కోట్లకు తగ్గించారు. గ్యాస్ సబ్సిడీకి 2023-24లో రూ 12,240 కోట్లు కేటాయించగా, ప్రస్తుత బడ్జెట్‌లో రూ.11,925.01 కోట్లకు తగ్గించారు.

పెట్రోలియానికి సంబంధించి 2023-24 బడ్జెట్‌లో రూ.12,240 కోట్లు కేటాయించగా, దాన్ని 2024-25 బడ్జెట్‌లో రూ.11,925 కోట్లకు తగ్గించారు. రైతులకు సంబంధించిన ముఖ్యమైన ఎరువులకు 2022-23 బడ్జెట్‌లో రూ. 2,51,339 కోట్లు కేటాయించగా, 2023-24లో రూ.1,88,894 కోట్లకు తగ్గించారు. దాన్ని 2024-25 బడ్జెట్‌లో రూ.1,64,000 కోట్లకు తగ్గించారు. అందులోనూ యూరియాకి 2022-23 బడ్జెట్‌లో రూ.1,65,217 కోట్లు కేటాయించగా, 2023-24లో దాన్ని రూ.1,31,100 కోట్లకు తగ్గించారు. 2024-25 బడ్జెట్‌లో రూ.1,00,340 కోట్లకు తగ్గించారు. పంటల బీమా పథకానికి సంబంధించి 2023-24 బడ్జెట్‌లో రూ.15,000 కోట్లు కేటాయించగా, దాన్ని 2024-25 బడ్జెట్‌లో రూ.14,600 కోట్లకు తగ్గించారు. ఎరువుల సబ్సిడీ కేవలం రూ.6 కోట్లే కేటాయించారు. నేషనల్ రూరల్ హెల్త్ మిషన్ (ఎన్ఆర్‌హెచ్ఎం)కి కేటాయింపులే లేవు. స్మార్ట్ సిటీలకు 2023-24లో రూ 13,200 కోట్లు కేటాయించగా, ప్రస్తుత బడ్జెట్‌లో రూ.10,400 కోట్లకు తగ్గించారు. అంగన్‌వాడీలకు 2023-24లో రూ 21,523.13 కోట్లు కేటాయించగా, ప్రస్తుత బడ్జెట్‌లో రూ.21,200 కోట్లకు తగ్గించారు. అంటే రూ. 323 కోట్లు తగ్గించారు. మహిళ భద్రత పథకాల కేటాయింపుల్లో భారీ కోత విధించారు. 2023-24లో రూ.1,009 కోట్లు కేటాయించగా, ప్రస్తుత బడ్జెట్‌లో రూ.155 కోట్లకు తగ్గించారు.

ప్రభుత్వ రంగ సంస్థల్లో పెట్టుబడులకు సంబంధించి 2023-24 బడ్జెట్‌లో రూ.34,354 కోట్లు కేటాయించగా, దాన్ని సవరించిన అంచనాల్లో రూ.32,800 కోట్లకు తగ్గించారు. 2024-25 బడ్జెట్‌లో రూ.31,107 కోట్లకు తగ్గించారు. అంటే రూ.3,247 కోట్లు తగ్గించారు. కోల్ ఇండియా లిమిటెడ్‌కు భారీ కోత పడింది. 2023-24లో రూ 16,500 కోట్లు కేటాయించగా, ప్రస్తుత బడ్జెట్‌లో రూ.15,500 కోట్లకు తగ్గించారు. ఎన్ఎల్సి ఇండియా లిమిటెడ్‌కు 2023-24లో రూ 2,880 కోట్లు కేటాయించగా, ప్రస్తుత బడ్జెట్‌లో రూ.2,429 కోట్లకు తగ్గించారు.

సాంస్కృతిక పథకాలకు 2023-24లో రూ 808.77 కోట్లు కేటాయించగా, ప్రస్తుత బడ్జెట్‌లో రూ.520.24 కోట్లకు తగ్గించారు. అకాడమీ, మ్యూజియంలకు బడ్జెట్‌లో కోత విధించారు. అకాడమీలకు సంబంధించి 2023-24లో రూ 435.45 కోట్లు కేటాయించగా, ప్రస్తుత బడ్జెట్‌లో రూ.389.37 కోట్లకు తగ్గించారు. మ్యూజియంలకు సంబంధించి 2023-24లో రూ 389.40 కోట్లు కేటాయించగా, ప్రస్తుత బడ్జెట్‌లో రూ.373.70 కోట్లకు తగ్గించారు. పిఎంకిసాన్, ఉపాధి హామీకి ఎటువంటి పెంపుదల లేదు. గతంలో కేటాయించిన వాటినే కాపీ, పేస్టు చేశారు.

ఏడాదికి 78 లక్షల ఉద్యోగాలు

- కేంద్ర ఆర్థిక మంత్రి ప్రకటన



న్యూఢిల్లీ: దేశం ఎదుర్కొంటున్న అత్యంత ముఖ్యమైన సవాళ్లలో ఒకటైన నిరుద్యోగ సమస్యపై కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ మాటల గారడీ ప్రదర్శించారు. గతంలో ఏడాదికి రెండు కోట్ల ఉద్యోగాలిస్తామన్న హామీని నెరవేర్చడంలో విఫలమైన బిజెపి నేతృత్వంలోని ఎన్డీయే ప్రభుత్వం ఈ బడ్జెట్‌లో ఏడాదికి సగటున 78 లక్షల ఉద్యోగాలు కల్పిస్తామని చెప్పారు. . మొన్నటి పార్లమెంటు ఎన్నికల్లో బిజెపి ఓటమికి నిరుద్యోగ సమస్య ఒక ప్రధాన కారణమని తెలిసి కూడా దీనిపై ప్రభుత్వం మళ్లీ అదే నిర్లక్ష్యం వహించింది. యువతకు అయిదు ఉపాధి పథకాలను ఆర్థిక మంత్రి ప్రకటించారు. మొదటి సారి ఉపాధిని ప్రోత్సహించడం, మ్యానుఫాక్చరింగ్ రంగంలో ఉద్యోగాల సృష్టి, ఉపాధి కల్పనకు మద్దతు, కేంద్ర ప్రభుత్వ ప్రాయోజిత పథకాల ద్వారా ఉద్యోగ కల్పన కు సంబంధించి బడ్జెట్‌లో ప్రకటించారు.

కానీ, ఆ పథకాలకు నామమాత్రపు కేటాయింపులతోనే సరిపెట్టారు. మొదటి సారి ఉపాధికి మద్దతు పేరుతో తెచ్చిన పథకం కింద వచ్చే అయిదేళ్లలో కోటి మందికి 500 టాప్ కంపెనీల్లో తర్ఫీదు ఇప్పిస్తామని చెప్పారు. ఇందుకు గాను నెలకు ఒకేసారి సాయం కింద నెలకు 5వేలు ఇస్తామన్నారు. ఉపాది కల్పనకు తోడ్పడే ప్రైవేట్ పరిశ్రమల యజమానికి సంవత్సరానికి ఒక్కో ఉద్యోగి తరపున 72 వేల రూపాయలు లబ్ధి చేకూరుతుంది. సిఎస్ఆర్ నిధుల ద్వారా ఈ సాయం అందుతుంది. ఈ పథకాన్ని ఆసరా చేసుకుని మళ్లీ ఉపాధి కల్పించినట్లు చూపి భారీ మొత్తాన్ని యాజమాన్యాలు కాజేసే అవకాశం ఉందని నిపుణులు పేర్కొంటున్నారు. ఇతర పథకాలు కూడా ఇదే రూటులో ఉన్నాయి. దీనిని కప్పిపుచ్చి అయిదేళ్లలో ఈ ఇంటర్న్‌షిప్ పథకం కింద 4.1 కోట్ల మంది యువతకు నైపుణ్యం, శిక్షణ కల్పిస్తున్నామని ఆర్థిక మంత్రి ఘనంగా చెప్పారు. . శిక్షణ, నైపుణ్యం ఇప్పటికే కలిగివున్న నిరుద్యోగ యువత గురించి మౌనం వహించారు. ఉద్యోగ కల్పనకు నిర్దిష్టంగా కేటాయింపులు జరపకుండా, విద్య, ఉపాధి, స్కిల్ డెవలప్‌మెంట్ ను ఒకే పద్దు కింద చేర్చి 1.48 లక్షల కోట్లు కేటాయించినట్లు చూపారు. మిగతా పథకాలది కూడా ఇదే తీరు.

అప్పుల భారతం

- ఆరేళ్లలో రూ.79,70,283.27 కోట్ల రుణం

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

మోడీ ఏలుబడిలో అప్పులు విపరీతంగా పెరుగుతున్నాయి. ఆరేళ్లలోనే దాదాపు రూ.82 లక్షల కోట్ల అప్పు పెరిగింది. కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ గురువారం ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో కేంద్ర ప్రభుత్వం అప్పులు వెల్లడయ్యాయి. 2024 మార్చి 31 నాటికి రూ.168,72,554.16 కోట్లు అప్పు ఉంటే, 2025 మార్చి 31 నాటికి అది కాస్తా రూ.181,68,456.91 కోట్లకు పెరుగుతుందని అంచనా వేసింది. అంటే ఏడాదిలోనే రూ.12,95,902.75 కోట్ల అప్పు పెరుగుతుందని ప్రభుత్వ బడ్జెట్ లెక్కలు స్పష్టం చేస్తున్నాయి. 2019-20లో రూ.101,98,173.64 కోట్ల అప్పు ఉంటే, అదికాస్తా 2024-25 నాటికి రూ.181,68,456.91 కోట్లకు పెరుగుతుంది. అంటే, రూ.79,70,283.27 కోట్లకు అప్పు పెరగనుంది. విదేశీ అప్పులకు వడ్డీ రూ.32,597.90 కోట్లు, దేశీయ అప్పుకు వడ్డీ రూ.85,7482.79 కోట్లు చెల్లిస్తుంది.

2024 మార్చి 31 నాటికి అప్పు

దేశీయ అప్పు : రూ.163,35,070.06 కోట్లు
విదేశీ అప్పు : రూ.5,37,484.10 కోట్లు
మొత్తం అప్పు : రూ.168,72,554.16 కోట్లు

2025 మార్చి 31 నాటికి అప్పు

దేశీయ అప్పు : రూ.175,93,529.40 కోట్లు
విదేశీ అప్పు : రూ.5,74,927.51 కోట్లు
మొత్తం అప్పు : రూ.181,68,456.91 కోట్లు

ఆరేళ్లలో పెరిగిన అప్పుల వివరాలు

ఏడాది అప్పు (కోట్లల్లో)

2019-20	రూ.101,98,173.64
2020-21	రూ.120,58,987.40
2021-22	రూ.135,45,605.78
2022-23	రూ. 152,23,605.78
2023-24	రూ.168,72,554.16
2024-25	రూ. 181,68,456.91

కేంద్ర బడ్జెట్ 2024-25

वित्त मंत्रालय MINISTRY OF FINANCE

అంకెల్లో బడ్జెట్
కోట్ల రూపాయల్లో

మొత్తం బడ్జెట్ రూ. 48,20,512 కోట్లు

	2022-23 (వాస్తవ ఖర్చు)	2023-24 (అంచనాలు)	2023-24 (సవరించిన అంచనాలు)	2024-25 (అంచనాలు)
రెవెన్యూ ఆదాయం	23,83,206	26,32,281	26,99,713	31,29,200
మూలధన ఆదాయం	18,09,951	18,70,816	17,90,773	16,91,312
మొత్తం ఆదాయం	41,93,157	45,03,097	44,90,486	48,20,512
మొత్తం ఖర్చు	41,93,157	45,03,097	44,90,486	48,20,512
సమర్థ మూలధన ఖర్చు	10,46,289	13,70,949	12,71,436	15,01,889
రెవిన్యూ లోటు	10,69,926	8,69,855	8,40,527	5,80,201
సమర్థ రెవిన్యూ లోటు	7,63,662	4,99,867	5,19,337	1,89,423
ద్రవ్య లోటు	17,37,755	17,86,816	17,34,773	16,13,312
ప్రాథమిక లోటు	8,09,238	7,06,845	6,79,346	4,50,372

ఇది సంకోచ, తిరోగమన బడ్జెట్ !

- అభివృద్ధికి కీలకమైన ఆర్థిక కార్యకలాపాల విస్తరణ ఏది?
- కేంద్ర బడ్జెట్‌పై సిపిఎం విమర్శ
- బడ్జెట్ వైఫల్యాన్ని నిరసిస్తూ ఆందోళనలకు పిలుపు

న్యూఢిల్లీ : కనీవినీ ఎరుగని స్థాయికి చేరుకున్న నిరుద్యోగం, అధిక ఆహార ద్రవ్యోల్బణం రేటు, అసాధారణమైన రీతిలో పెరుగుతున్న అసమానతలు, మందగించిన ప్రైవేట్ పెట్టుబడులు వంటి ఆర్థిక వాస్తవికతల నేపథ్యంలో ఈ బడ్జెట్ ఆర్థిక కార్యకలాపాలను విస్తరించడంపై ప్రధానంగా దృష్టిపెట్టాల్సి ఉందని, అందుకు భిన్నంగా ప్రస్తుత బడ్జెట్‌లో చేసిన ప్రతిపాదనలు వాటిని కుదించేలా, తిరోగమన ధోరణిలో వున్నాయని సిపిఎం విమర్శించింది. పార్టీ పొలిట్‌బ్యూరో ఈ మేరకు మంగళవారం ఒక ప్రకటన జారీ చేసింది. ప్రజలపై మరింత భారాలు మోపేలానే ఈ ప్రతిపాదనలు వున్నాయని, పెట్టుబడులు, ఉపాధి కల్పన స్థాయిలను దిగజార్చేలా వున్నాయని విమర్శించింది.

ప్రభుత్వ రెవిన్యూ ఆదాయాలు 14.5 శాతం మేరకు పెరగగా, వ్యయం మాత్రం కేవలం 5.94 శాతమే పెరిగినట్లు బడ్జెట్ గణాంకాలు తెలియచేస్తున్నాయి. ఈ రెవిన్యూలను ఆర్థిక కార్యకలాపాల విస్తరణకు ఉపయోగించడానికి బదులుగా, జిడిపిలో ఆర్థిక లోటును 5.8శాతం నుండి 4.9శాతానికి తగ్గించడం ద్వారా అంతర్జాతీయ ఫైనాన్స్ పెట్టుబడిదారులను బుజ్జగించడానికి ఉపయోగించారని పేర్కొంది.

బడ్జెట్‌లో అంచనా వేసిన జిడిపి గణాంకాలు డేటా ఫడ్జింగ్ (సమాచారాన్ని తప్పుగా చూపించడం, మోసపూరితమైన పద్ధతి)లో మరో ప్రక్రియ అని పొలిట్‌బ్యూరో విమర్శించింది. నామమాత్రపు జిడిపి వృద్ధి 10.5శాతమని అంచనా వేశారు, కానీ కీలకమైన ద్రవ్యోల్బణ రేటు 3శాతాన్ని మినహాయించడం ద్వారా వాస్తవిక జిడిపి 6.5 నుండి 7శాతం మేరకు వృద్ధి చెందుతుందని అంచనా వేశారు. కీలక ద్రవ్యోల్బణం రేటులో కూడా అధిక ఆహార ద్రవ్యోల్బణం 9.4శాతాన్ని మినహాయించారు. ఆ రకంగా వాస్తవిక జిడిపి వృద్ధిని ఎక్కువ చేసి చూపించారని సిపిఎం విమర్శించింది.

ప్రభుత్వ వ్యయాన్ని మరింతగా కుదించారు. సబ్సిడీల్లో గణనీయంగా కోత విధించారు. ఎరువుల సబ్సిడీని రూ.24,894 కోట్ల మేరకు కోత విధించారు. ఆహార సబ్సిడీని రూ.7082 కోట్ల మేరకు కోత పెట్టారు. విద్య, ఆరోగ్యం, గ్రామీణాభివృద్ధి రంగాలపై వ్యయాలను జిడిపిలో శాతంగా గనక చూసినట్లైతే పెద్దగా మార్పేమీ లేదని చెప్పవచ్చని సిపిఎం పొలిట్‌బ్యూరో పేర్కొంది. మహాత్మాగాంధీ గ్రామీణ ఉపాధి హామీ పథకం (ఎంజిఎన్‌ఆర్‌ఇజిఎస్)ను మరింతగా నిర్లక్ష్యం చేస్తూనే వచ్చారు. బడ్జెట్ కేటాయింపులు రూ.86వేల కోట్లు వున్నాయని, ఇది, 2023 ఆర్థిక సంవత్సరంలో ఖర్చు పెట్టిందానికన్నా తక్కువేనని పేర్కొంది. ఈ ఆర్థిక సంవత్సరంలో మొదటి నాలుగు మాసాల్లో ఇప్పటికే రూ.41,500కోట్లు ఖర్చు పెట్టగా, మిగిలిన 8మాసాల కాలంలో కేవలం రూ.44,500కోట్లు మాత్రమే ఖర్చు పెట్టడానికి వున్నాయి. గ్రామీణ భారతంలో తీవ్రంగా నెలకొన్న నిరుద్యోగ సంక్షోభాన్ని ఎదుర్కొనడానికి ఇవి ఎంత మాత్రమూ సరిపోవనేది స్పష్టమవుతోందని పొలిట్‌బ్యూరో పేర్కొంది.

నిరుద్యోగ సమస్యను పరిష్కరిస్తామనే పేరుతో, బడ్జెట్ అనేక జిమ్మిక్కులకు పాల్పడింది. ఎంప్లాయిమెంట్ లింక్డ్ ఇన్సెంటివ్‌గా తీసుకువచ్చిన కొత్త పథకం కింద సాధికార రంగంలో కొత్తగా చేరి రూ.లక్ష కన్నా తక్కువ సంపాదిస్తున్న వారికి ఒక నెల వేతనాన్ని ఇస్తామని ప్రకటించింది. అర్హులైన వర్కర్లు గరిష్టంగా రూ.5 వేలను మూడు నెలవారీ వాయిదాల్లో పొందుతారని పొలిట్‌బ్యూరో తెలిపింది. అయితే, దీనివల్ల యజమానులు ఎక్కువగా లబ్ధి పొందుతారని పేర్కొంది. రెండేళ్లలో సృష్టించిన ప్రతి అదనపు ఉద్యోగానికి రూ.లక్ష వరకు నెల జీతం వున్న ప్రతి ఒక్క కొత్త ఉద్యోగి వల్ల రూ.72 వేలు చొప్పున, 24 నెలవారీ వాయిదాల్లో యజమానులు లబ్ధి పొందుతారు. ఇటువంటి జిమ్మిక్కుల వల్ల ఉపాధి కల్పన జరగబోదని సిపిఎం పేర్కొంది. గత సంవత్సరాల్లో కార్పొరేట్ రంగం సంపాదించిన భారీ లాభాలు భారీ యంత్రాలు, ఉత్పత్తి రంగాల్లో పెట్టుబడుల రూపంలో కనిపించడం లేదు. ఆర్థిక వ్యవస్థలో నిలకడగా డిమాండ్ లేకపోవడమే ఇందుకు కారణంగా వుంది. దీనివల్ల ప్రజల్లో కొనుగోలు శక్తి బాగా క్షీణించిందని పేర్కొంది.

యువతలో నైపుణ్యాలను పెంపొందించే పథకాలను బడ్జెట్‌లో బాగా ప్రముఖంగా ప్రస్తావించారు. అయితే దీనివల్ల కూడా తీవ్రంగా వున్న నిరుద్యోగ సమస్య పరిష్కారం కాదు. 2016-2022ల్లో కేవలం 18శాతం మంది యువత మాత్రమే నైపుణ్యాల అభివృద్ధి పథకాల ద్వారా శిక్షణ పొంది ఉద్యోగాలు సంపాదించుకున్నారు. మరోసారి ఇక్కడ సుస్పష్టం చేయాల్సిన అంశమేమంటే ఆర్థిక కార్యకలాపాలు విస్తరించకపోతే వృద్ధి చెందలేం. 'సహకార సమాఖ్యవాదం' గురించి అంతలా చెప్పినప్పటికీ రాష్ట్ర ప్రభుత్వాలు మాత్రం ఇబ్బందులు పడుతున్నాయి. రాజకీయ ఒత్తిళ్ల కారణంగా ఆంధ్రప్రదేశ్, బీహార్‌ల పరిస్థితి మాత్రం వేరుగా వుంది. మిత్రపక్షాల మద్దతుపై ముఖ్యంగా తెలుగుదేశం పార్టీ, జనతాదళ్ (యునైటెడ్)లపై ఎన్‌డిఎ కూటమి ప్రభుత్వం మనుగడ ఆధారపడింది. అయితే, రాష్ట్రాలకు ఆర్థిక సంఘం మంజూరు చేసే నిధులు (పన్నుల ద్వారా వచ్చేది కాకుండా) 2022-23లో రూ.1,72,760 కోట్లు వుండగా, 2023-24కి వచ్చేసరికి రూ.1,40,429 కోట్లకు పడిపోయాయి. ఈ బడ్జెట్ ఈసారి ఇంకా కుదించబడి, 1,32,378 కోట్లకు చేరుకుంది. మొత్తమ్మీద చూసినట్లైతే, ఈ బడ్జెట్ సంపన్నులను మరింత సంపన్నులుగా చేయడానికి, పేదలను మరింత దుర్భర దారిద్ర్యంలోకి నెట్టడానికి ఉద్దేశించబడిందని పేర్కొంది. దేశంలోని సూపర్ సంపన్నులపై సంపద పన్ను లేదా వారసత్వపు పన్ను విధింపు ప్రతిపాదనను పరిశీలించేందుకు కూడా తిరస్కరించింది. ప్రజలపై పడే పరోక్ష పన్ను భారానికి ఉపశమనం కూడా ఈ బడ్జెట్‌లో లేదని విమర్శించింది. దేశ ప్రజలు, ఆర్థిక వ్యవస్థ ప్రస్తుతం ఎదుర్కొంటున్న పలు సమస్యలను పరిష్కరించడంలో విఫలమైనందుకు నిరసనగా ఆందోళనలు చేపట్టాల్సిందిగా అన్ని పార్టీ శాఖలకు పొలిట్‌బ్యూరో పిలుపునిచ్చింది.



ఉపాధి పనులు చేస్తున్న కూలీలు (ఫైల్)

హామీ లేని 'ఉపాధి'

ప్రజాశక్తి ప్రత్యేక ప్రతినిధి- అమరావతి

గ్రామీణ ప్రాంతాల్లో పనుల్లేని సమయాల్లో వ్యవసాయ కార్మికులకు ఏడాదిలో కనీసం వంద రోజులపాటు పని కల్పించేందుకు ఉద్దేశించినది ఉపాధి హామీ. దీనికి 2022-23లో కేంద్రం 90,805 కోట్లు ఖర్చు చేసింది. 2023-24లో అమాంతం 60 వేల కోట్లకు నిధులు తగ్గించింది. సవరించిన బడ్జెట్‌లో 86,000 కోట్లు చూపించింది. ఇప్పుడు కూడా అంతే నిధులు ప్రతిపాదించింది. ఒక వైపు వ్యవసాయం సంక్షోభంలో ఉంది. గ్రామాల్లో పనుల కోసం డిమాండ్ ఉంది. కరువు కాటకాల సమయంలో పరిస్థితి దారుణంగా ఉంటోంది. సంవత్సరానికి కనీసం 200 రోజులు పని కల్పించాలన్న డిమాండ్ వ్యవసాయ కార్మికుల నుంచి వ్యక్తమౌతోంది. అర్బన్‌లోనూ పనులు దొరకట్లేదు. పట్టణాలకూ ఉపాధి హామీని విస్తరించాలని కోరుతున్నారు. కరోనా తర్వాత ఈ డిమాండ్ ప్రముఖంగా ముందుకొచ్చింది. మోడీ సర్కారు మాత్రం గ్రామాల్లో పనులకు ఉన్న డిమాండ్‌ను పట్టించుకోవట్లేదు. ఎప్పుడైనా ద్రవ్యోల్బణం హెచ్చు తగ్గులు 5 శాతం వరకు ఉంటాయి. ఆ మేరకు కూడా ఉపాధి హామీకి నిధులివ్వలేదు.

మూడేళ్ల కంటే తక్కువ కేటాయింపు

- ఎఐఎడబ్ల్యుయు ప్రధాన కార్యదర్శి బి వెంకట్

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

కేంద్ర బడ్జెట్ దేశ సంపదను కార్పొరేట్లు, మతోన్మాదులు, పెత్తందారులకు దోచిపెట్టే బడ్జెట్ అని వ్యవసాయ కార్మిక సంఘం అఖిల భారత ప్రధాన కార్యదర్శి బి వెంకట్ విమర్శించారు. గ్రామీణ ఉపాధి.. పేదలకు నేడు ఒక తీవ్రమైన సమస్యగా మారిందని, దాని నుండి ప్రజలను కాపాడేందుకు ఏడాదికి రెండు లక్షల కోట్లు కేటాయించాలని మేధావులు చెబుతున్న మాటలు మోడీ చెవికెక్కపోవటం విచారకరమన్నారు. మూడేళ్ల క్రితం రూ.90 వేల కోట్లు కేటాయించగా, గతేడాది రూ.86 వేల కోట్లు ఖర్చు చేశారని, ఈసారి కూడా రూ.86 వేల కోట్లే కేటాయించడం ఉపాధిని నిర్వీర్యం చేయడానికే అని అన్నారు. మొత్తం కేంద్ర బడ్జెట్ రూ.44 లక్షల కోట్ల నుండి రూ.48 లక్షల కోట్లకు అంటే 10 శాతం పెరిగిందని, ఆ ప్రకారం కేటాయింపులు కూడా 10 శాతం పెరగాల్సి ఉండగా కుదించటం దారుణం అన్నారు. ఓట్లు మాత్రం గ్రామీణ పేదలవి కావాలి, కేటాయింపులు మాత్రం కార్పొరేట్లకు చేస్తామనే విధంగా మోడీ ప్రభుత్వం వ్యవహరిస్తున్నదని అన్నారు. పేదల గృహ నిర్మాణానికి కేంద్ర ప్రభుత్వం రూ.5 లక్షలు చొప్పున, రాష్ట్ర ప్రభుత్వం రూ.ఐదు లక్షల చొప్పున మొత్తం ఒక్కొక్క లబ్ధిదారునికి రూ.10 లక్షలు చొప్పున కేటాయించాలని కోరుతుంటే, కేటాయింపులు గతం కంటే, మరింత తగ్గించారని అన్నారు. అర్బన్ ఉపాధి హామీ ఊసేలేదని అన్నారు. సామాన్యుల వ్యతిరేక, సంపన్నులకూ అనుకూలమైన ఈ బడ్జెట్‌ను వ్యతిరేకించాలని, ప్రజా అనుకూల కేటాయింపుల కోసం దేశవ్యాప్తంగా ఉద్యమాలకు సిద్ధం కావాలని, ఈ నెల 24, 25 తేదీల్లో నిరసనలకు ఆయన పిలుపునిచ్చారు.

కేంద్ర బడ్జెట్‌ను స్వాగతించిన పురందేశ్వరి

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

కేంద్ర ప్రభుత్వం మంగళవారం ప్రవేశపెట్టిన బడ్జెట్ రాష్ట్రానికి ఎంతో ఉపయోగకరంగా ఉందని బిజెపి రాష్ట్ర అధ్యక్షులు, ఎంపి దగ్గుబాటి పురందేశ్వరి పేర్కొన్నారు. బడ్జెట్ కేటాయింపులను ఆమె స్వాగతించారు. ఆంధ్రప్రదేశ్ పునర్వ్యవస్థీకరణ చట్టం కేంద్ర ప్రభుత్వానికి కీలకమని, రాజధాని కోసం రాష్ట్ర అవసరాన్ని అర్థం చేసుకుని రూ.15 వేలకోట్లు ప్రత్యేక ఆర్థిక సహాయం చేసేందుకు, రాబోయే సంవత్సరాల్లో అదనపు నిధులు విడుదల చేసేందుకు సిద్ధంగా ఉన్నా మని ఆర్థికశాఖ మంత్రి నిర్మలా సీతా రామన్ పేర్కొనడం హర్షణీయమని ఆమె అన్నారు. ఇదే అంశంపై ప్రధానికి వైద్యారోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ అభినందనలు తెలుపుతూ లేఖ రాశారు.

వేతన జీవులను నిరాశపరిచిన బడ్జెట్ : యుటిఎఫ్

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

కేంద్ర ప్రభుత్వ బడ్జెట్ వేతన జీవులను నిరాశపరిచిందని యుటిఎఫ్ వెల్లడించింది. ఈ మేరకు రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎన్ వెంకటేశ్వర్లు, కెఎస్ఎస్ ప్రసాద్ మంగళవారం ఒక ప్రకటన విడుదల చేశారు. సిపిఎస్ విధానంలో మార్పులు తెస్తామని చెబుతూనే పాత పెన్షన్ విధానంలో పల్లెత్తుమాట బడ్జెట్‌లో లేకపోవడం ఉద్యోగ, ఉపాధ్యాయులకు నిరాశ కలిగించిందని తెలిపారు. విద్యారంగానికి బడ్జెట్‌లో 6 శాతం నిధులు కేటాయించాల్సి ఉండగా, ప్రస్తుత బడ్జెట్‌లో 3.25 శాతం మాత్రమే కేటాయించిందని పేర్కొన్నారు. ప్రభుత్వ విద్యారంగానికి ప్రాధాన్యత లేదన్నట్లు ప్రభుత్వం వ్యవహరించిందని విమర్శించారు. వచ్చే ఐదేళ్లలో నాలుగు కోట్ల మందికి ఉద్యోగాలు కల్పిస్తామని గొప్పగా చెబుతున్న ప్రభుత్వం గడిచిన పదేళ్లలో ఎన్ని ఉద్యోగాలు సృష్టించిందో కనీస ప్రస్తావన కూడా చేయలేదన్నారు. ద్రవ్యోల్బణం నాలుగు శాతానికి తగ్గిందని బడ్జెట్ ప్రసంగంలో ఆర్థికశాఖ మంత్రి చెప్పారని, కాని, దానికి అనుగుణంగా ధరలు తగ్గకపోవడం ఆశ్చర్యాన్ని కలిగిస్తుందన్నారు. ఇప్పటికైనా మధ్యతరగతి ఉద్యోగులకు ప్రయోజనం చేకూర్చేలా ప్రభుత్వం తక్షణం పాత పెన్షన్ పునరుద్ధరించేందుకు స్పష్టమైన విధానాన్ని ప్రకటించాలని డిమాండ్ చేశారు.

ఉద్యోగాస్తులను ఊసురుమనిపించిన కేంద్రం : ఎస్‌టియు

పాత పన్ను విధానంలో కొనసాగుతున్న మధ్యతరగతి ప్రజలు, ఉద్యోగులకు కేంద్ర బడ్జెట్ ఉసూరుమనిపించిందని ఎస్‌టియు అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎల్ సాయి శ్రీనివాస్, మల్లు రఘునాథ్ రెడ్డి అన్నారు. పదేళ్లుగా ఆదాయపు పన్ను మినహాయింపు రూ.2.5 లక్షలకే పరిమితమైందని తెలిపారు. ఒకవైపు రూ.8 లక్షల లోపు ఆదాయం కలవారిని ఆర్థికంగా వెనుకబడిన వారిగానే పరిగణిస్తూ, మరోవైపు రూ.2.5 లక్షల ఆదాయం దాటిన వారి నుంచి పన్ను వసూలు చేయడం దుర్మార్గమైన చర్య అని పేర్కొన్నారు. రూ.8 లక్షల వరకు పన్ను మినహాయింపు ఇవ్వాలని కోరారు.

విద్యారంగానికి మొండి చెయ్యి : ఎపిటిఎఫ్

బడ్జెట్‌లో విద్యారంగానికి మొండిచెయ్యి చూపారని ఎపిటిఎఫ్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు జి హృదయరాజు, ఎస్ చిరంజీవి అన్నారు. ఆర్థిక మంత్రి ప్రసంగంలో చెప్పిన 9 ప్రాధాన్యతలలో విద్యారంగం లేకపోవడం విచారకరమని పేర్కొన్నారు. ఆదాయపు పన్నుకు సంబంధించి వేతన జీవులను నిరాశపరిచారని తెలిపారు.

బీహార్‌కు రూ.58,900 కోట్లు

- కేంద్ర ఆర్థికశాఖ మంత్రి నిర్మలా సీతారామన్

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

బీహార్‌కు వివిధ ప్రాజెక్టులకు రూ.58,900 కోట్లు ఇస్తామని కేంద్ర ఆర్థికశాఖ మంత్రి నిర్మలా సీతారామన్ ప్రకటించారు. లోక్‌సభలో కేంద్ర మంత్రి నిర్మలా సీతారామన్ మంగళవారం బడ్జెట్ ప్రవేశపెట్టారు. రోడ్డు కనెక్టివిటీ ప్రాజెక్టుల అభివృద్ధికి తాము సహకరిస్తామని, రూ.26 వేల కోట్లతో పాట్నా-పూర్ణియా ఎక్స్‌ప్రెస్ వే, బక్సర్-భాగల్పూర్ ఎక్స్‌ప్రెస్ వే, బుద్ధగయ, రాజ్‌గిర్, వైశాలి, దర్భంగా స్పర్స్, గంగా నదిపై బక్సర్ వద్ద అదనపు 2-లేన్ వంతెన నిర్మిస్తామని పేర్కొన్నారు.

రూ.21,400 కోట్ల వ్యయంతో పిర్పైంటిలో కొత్తగా 2,400 మెగావాట్ల పవర్ ప్లాంట్ ఏర్పాటు చేస్తామని, బీహార్‌లో కొత్త విమానాశ్రయాలు, వైద్య కళాశాలలు, క్రీడా మౌలిక సదుపాయాలు నిర్మిస్తామని అన్నారు. బీహార్ తరచుగా వరదలతో బాధపడుతోందని, వాటిలో చాలా దేశం వెలుపల ఉద్భవించేవని తెలిపారు. నేపాల్‌లో వరద నియంత్రణకు నిర్మాణాల ప్రణాళికలు ఇంకా పురోగతి సాధించలేదని అన్నారు. తమ ప్రభుత్వం యాక్సిలరేటెడ్ ఇరిగేషన్ బెనిఫిట్ ప్రోగ్రామ్, ఇతర ప్రాజెక్టులతో కోసి-మెచి ఇంట్రా స్టేట్ లింక్ రూ.11,500 కోట్ల అంచనా వ్యయంతో బ్యారేజీలు, నదుల కాలుష్య నివారణ, నీటిపారుదల వంటి 20 ఇప్పటికే కొనసాగుతున్న, కొత్త ప్రాజెక్టులకు ఆర్థిక సహాయాన్ని అందిస్తామని అన్నారు. అదనంగా, కోసి సంబంధిత వరద ఉపశమన, నీటిపారుదల ప్రాజెక్టుల సర్వే, విచారణ చేపడతామని అన్నారు.

అమృత్‌సర్-కోల్‌కతా ఇండస్ట్రియల్ కారిడార్‌లో గయా వద్ద పారిశ్రామిక నోడ్ అభివృద్ధికి తాము మద్దతు ఇస్తామని, ఈ కారిడార్ తూర్పు ప్రాంతం పారిశ్రామిక అభివృద్ధికి అవకాశం ఉంటుందన్నారు. అలాగే పెట్టుబడులకు మద్దతుగా అదనపు కేటాయింపు అందిస్తామని, బ్యాంకుల నుండి సహాయం కోసం బీహార్ ప్రభుత్వం అభ్యర్థనలు వేగవంతం చేస్తామని అన్నారు. బీహార్‌లోని గయాలోని కాశీ విశ్వనాథ ఆలయ కారిడార్ తరహాలో విష్ణుపాద ఆలయ కారిడార్, మహాబోధి ఆలయ కారిడార్‌లను అభివృద్ధి చేస్తామని పేర్కొన్నారు. నలంద యూనివర్శిటీ అభివృద్ధికి, నీటిపారుదల ప్రాజెక్టులకు నిధులు కేటాయిస్తామని హామీ ఇచ్చారు.



బీహార్ సిఎం నితిష్ కుమార్

ఆతిథ్య రంగానికి తీవ్ర నిరాశ

హైదరాబాద్/న్యూఢిల్లీ : కేంద్రం ప్రవేశపెట్టిన 2024-25 బడ్జెట్ పట్ల ఆతిథ్య పరిశ్రమ తీవ్ర నిరాశను వ్యక్తం చేసింది. ఈ రంగానికి మౌలిక సదుపాయాల హోదా కల్పించాలనే ప్రధాన డిమాండ్‌ను కేంద్రం పట్టించుకోలేదు. పర్యాటకం, హోటల్ రంగంలో అంతర్జాతీయంగా తీవ్ర పోటీ నెలకొన్న సమయంలో సవాళ్లను అధిగమించేందుకు ఆతిథ్య రంగంలో నిర్మాణాత్మక మార్పులు తెచ్చేందుకు ఎటువంటి ప్రయత్నాలు జరగలేదని పేర్కొంది. టూరిజం పెంచడానికి ప్రచార బడ్జెట్‌ను పెంచాలని, జిఎస్‌టి రేట్లను తగ్గించాలనే తమ కీలక డిమాండ్లను కేంద్రం పక్కన పెట్టడం నిరాశకు గురి చేసిందని ఫెడరేషన్ ఆఫ్ అసోసియేషన్స్ ఇన్ ఇండియన్ టూరిజం అండ్ హాస్పిటాలిటీ (ఫెయిత్) కన్సల్టింగ్ సిఇఒ ఆశిష్ గుప్తా పేర్కొన్నారు.

"మేము టూరిజం సంఖ్యను పెంచడానికి సంబంధించి అనేక సిఫార్సులు ఇచ్చాము, కానీ అవి పూర్తిగా విస్మరించబడ్డాయి. ఉపాధికి ఊతమిచ్చే ఆతిథ్య రంగానికి తగు ప్రాధాన్యతను ఇవ్వలేదు. మేము ఈ విషయంలో పూర్తి నిరాశకు గురైయ్యాము." అని ఇండియన్ అసోసియేషన్ ఆఫ్ టూర్ ఆపరేటర్స్ ప్రెసిడెంట్ రాజీవ్ మెహ్రా అన్నారు.

వ్యాపారం మరింత సులభతరం : సిఐఐ

బడ్జెట్ వ్యాపారాలను మరింత సులభతరం చేసేలా ఉందని కాన్ఫిడరేషన్ ఆఫ్ ఇండియన్ ఇండస్ట్రీ (సిఐఐ) ప్రెసిడెంట్ సంజీవ్ పూరీ అన్నారు. పరిశ్రమల వృద్ధికి, సంస్కరణల్లో ప్రధాన మార్పులను తేనుందన్నారు. బహుళ రంగాలలో విస్తృత పెట్టుబడులకు మద్దతును ఇవ్వనుందన్నారు. ఈ బడ్జెట్ వ్యవసాయం, తయారీ నుండి సేవల వరకు అనేక రంగాలలోకి చాలా పెట్టుబడులను తీసుకురానుందని వ్యాపారాన్ని సులభతరం చేయడంపై చాలా దృష్టి సారించిందని పూరి పేర్కొన్నారు.



అభివృద్ధికి అనుకూలం.. : ఎఫ్‌టిసిసిఐ

కేంద్ర బడ్జెట్ అభివృద్ధికి అనుకూలంగా ఉందని తెలంగాణ ఛాంబర్స్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీ (ఎఫ్‌టిసిసిఐ) ప్రెసిడెంట్ సురేష్ కుమార్ సంఘాల్ అన్నారు. ఉపాధి, నైపుణ్యాలు, ఎంఎస్ఎంఇ, మధ్యతరగతి వంటి నాలుగు ప్రాధాన్యతా రంగాలకు పెద్దపీట వేస్తున్నట్లు ఆర్థిక మంత్రి చేసిన ప్రతిపాదనను తాము స్వాగతిస్తున్నామన్నారు. విదేశీ పెట్టుబడులను ఆకర్షించడానికి ఎఫ్‌డిఐ విధానాన్ని సరళీకృతం చేయడాన్ని సురేష్ కుమార్ ప్రశంసించారు. దేశంలో ఉన్నత విద్యకు మద్దతుగా రూ.10 లక్షల రుణ పథకాన్ని ఎఫ్‌టిసిసిఐ మాజీ అధ్యక్షులు మీలా జయదేవ్ స్వాగతించారు. దీని వల్ల చాలా మంది పేదలు ఉన్నత చదువులు చదివేందుకు దోహదపడుతుందని తెలిపారు.

మౌలిక సదుపాయాలకు మద్దతు : సిఎంఎ

కేంద్ర బడ్జెట్ మౌలిక సదుపాయాలు, ఉపాధి కల్పన, ఇంధన భద్రతకు ప్రాధాన్యతను ఇచ్చిందని సిమెంట్ తయారీదారుల సంఘం (సిఎంఎ) ప్రెసిడెంట్ నీరజ్ అఖౌరీ పేర్కొన్నారు. రూ.11 లక్షల కోట్ల మూలధన వ్యయం ప్రకటన, వివిధ ముఖ్యమైన ప్రాజెక్టులు, కేటాయింపుల ద్వారా భారతదేశ మౌలిక సదుపాయాలను ఆధునీకరించడానికి ప్రభుత్వ నిబద్ధతను సూచిస్తుందన్నారు. ఇది సిమెంట్, ఇతర నిర్మాణ సామగ్రికి డిమాండ్‌ను పెంచుతుందన్నారు. ఇది వివిధ రంగాలలో భారతదేశ మౌలిక సదుపాయాలను బలోపేతం చేయడానికి దోహదం చేస్తుందన్నారు.

తయారీకి మద్దతు : ఫిక్కీ

దేశాన్ని తయారీ కేంద్రంగా అభివృద్ధి చేయడానికి వీలుగా బడ్జెట్ ఉందని ఫిక్కీ ప్రెసిడెంట్ అనిష్ షా పేర్కొన్నారు. ప్రపంచంలోనే భారత్‌ను తయారీ కేంద్రంగా మార్చడానికి వీలుగా ఉందన్నారు. జిడిపిలో పెట్టుబడులు 3.4 శాతంగా కొనసాగేలా కేంద్రం దృష్టి కేంద్రీకరించడం సానుకూలాంశమన్నారు.

ఏంజెల్ పన్ను రద్దు హర్షణీయం : టిహబ్ సిఇఒ

కొత్త ఇన్నోవేషన్‌లను ప్రోత్సాహించే విధంగా బడ్జెట్ ఉందని టిహబ్ సిఇఒ మహంకాళి శ్రీనివాస్ రావు తెలిపారు. అన్ని రకాల పెట్టుబడిదారులకు విధించే ఏంజెల్ పన్ను రద్దు అనేది ఒక కీలకమైన చర్య అని పేర్కొన్నారు. ఇది నూతన ఆవిష్కరణలకు మంచి వాతావరణాన్ని కల్పిస్తుందన్నారు. ఈ టాక్స్ రద్దు అనేది స్టార్టప్‌లకు ప్రయోజనం చేకూరుస్తుందన్నారు.

స్మార్ట్‌ఫోన్ ధరలపై ప్రభావం తక్కువ...

న్యూఢిల్లీ : స్మార్ట్‌ఫోన్లు, చార్జర్ల ఉత్పత్తులపై బేసిక్ కస్టమ్స్ డ్యూటీ (బిసిడి) తగ్గిస్తున్నట్లు కేంద్ర ఆర్థిక మంత్రి మంగళవారం పార్లమెంట్‌లో ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో పేర్కొన్నారు. ప్రింటెడ్ సర్క్యూట్ బోర్డులు, మొబైల్ ఛార్జర్లతో పాటు స్మార్ట్‌ఫోన్ విడిభాగాలపై ప్రాథమిక కస్టమ్స్ సుంకంని 20 శాతం నుంచి 15 శాతానికి తగ్గిస్తున్నట్లు ఆర్థికమంత్రి నిర్మలా సీతారామన్ ప్రకటించారు. దీంతో అంతా, స్మార్ట్‌ఫోన్ల ధరలు భారీగా తగ్గుతాయని వినియోగదారుల్లో సంతోషం వ్యక్తమౌతోంది. ప్రాథమిక కస్టమ్స్ సుంకం తగ్గింపు ఐటీ రంగంలో వృద్ధిని మరింత ప్రేరేపిస్తుందని, మొబైల్ పరికరాలను వినియోగదారులకు విస్తృతంగా అందుబాటులోకి తెస్తుందని భావిస్తున్నారు. ఈ నిర్ణయం వల్ల దేశీయ ఉత్పత్తులను పెంచడంతో పాటు అంతర్జాతీయ మార్కెట్‌లో భారతదేశం యొక్క పోటీతత్వాన్ని పెంపొందించడం, అంతిమంగా వినియోగదారులకు ప్రయోజనం చేకూర్చడం ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది. దీంతో స్మార్ట్‌ఫోన్ల ధరలు తగ్గుతాయని అంతా భావిస్తున్నారు. అయితే, మొబైల్‌ఫోన్ ధరల తగ్గుదలపై పెద్దగా ఆశలు పెట్టుకోవద్దని ఇండస్ట్రీ నిపుణులు చెబుతున్నారు. వాస్తవానికి, స్మార్ట్‌ఫోన్ల ధరల తగ్గుదలలో పెద్దగా మార్పు ఉండకపోవచ్చని ఇండస్ట్రీ వర్గాలు చెబుతున్నాయి.



తక్కువ మార్జిన్లు, చిప్ సెట్ ధరలు పెరగడం, రూపాయి హెచ్చుతగ్గులు, మధ్యస్తం నుంచి ప్రీమియం స్మార్ట్‌ఫోన్ల సెగ్మెంట్లలో తీవ్రమైన పోటీ వున్న నేపథ్యంలో కస్టమ్స్ డ్యూటీలో 5శాతం తగ్గింపు సరిపోకపోవచ్చునని ఇండస్ట్రీ వర్గాలు చెబుతున్నాయి. శామ్‌సంగ్ వంటి మార్కెట్ లీడర్లకు ఈ పరిస్థితులు సాధారణమే. శామ్‌సంగ్ స్మార్ట్‌ఫోన్లపై సాధారణ ఆఫర్లు మినహా పెద్దగా ధర తగ్గింపును ఆశించలేం. ఎందుకంటే శామ్‌సంగ్ వంటి సంస్థలు దాదాపు అన్ని పరికరాలను భారతదేశంలోనే తయారు చేస్తున్నాయి. మార్జిన్లు తక్కువగా ఉండటంతో పాటు సుంకం తగ్గింపు నామమాత్రంగా ఉన్నందున, స్మార్ట్‌ఫోన్ సంస్థలు ఈ స్వల్ప లాభాన్ని కూడా కొనుగోలుదారులకు బదిలీ చేయకపోవచ్చు. స్మార్ట్‌ఫోన్లు, ఛార్జర్లు, పీసీబీఏలపై ప్రాథమిక కస్టమ్స్ సుంకం తగ్గింపు స్మార్ట్‌ఫోన్ల ధరలపై పెద్దగా ప్రభావం చూపదు. తక్కువ ధరల సెగ్మెంట్లలో మార్జిన్లు చాలా తక్కువగా ఉంటాయి.

5జీ వినియోగం పెరిగే అవకాశం...

అయితే, వినియోగదారులు ఫీచర్ ఫోన్ల నుంచి 5జీ స్మార్ట్‌ఫోన్లకు మారడానికి వీలుగా చౌకైన 5జీ ఫోన్లను విడుదల చేయాలని మార్కెట్ చూస్తోంది. స్మార్ట్‌ఫోన్ విడిభాగాలపై ప్రాథమిక కస్టమ్స్ డ్యూటీని 15 శాతానికి తగ్గించడం వల్ల స్థానికంగా అసెంబ్లింగ్ పెరగడంతో పాటు మరిన్ని విదేశీ పెట్టుబడులను ఆకర్షించే అవకాశం ఉంటుంది. ముఖ్యంగా రూ.7వేల నుంచి రూ.20వేల శ్రేణిలో వున్న స్మార్ట్‌ఫోన్ ధరలను తగ్గించడానికి కేంద్రప్రభుత్వ నిర్ణయం కొంతమేరకు దోహదం చేస్తుంది. రూ.25 వేల లోపు స్మార్ట్‌ఫోన్ల ధర, ముఖ్యంగా రూ.12-13 వేల లోపు మొబైల్‌ఫోన్ల ధర తగ్గింపుతో 5జీ డివైజ్‌ల వినియోగం మరింత పెరుగుతుందని ఇండస్ట్రీ వర్గాలు చెబుతున్నాయి.

ధరలు తగ్గుతాయని పెద్దగా ఆశించొద్దు... : టెక్‌ఇన్సైట్స్ ఇండస్ట్రీ అనలిస్ట్ అభిలాష్ కుమార్

'క్వాల్కమ్, మీడియాటెక్, యూనిసోక్ వంటి సంస్థలు 5జీ చిప్ సెట్లను సరసమైన ధరలకే విడుదల చేస్తున్నందున రూ.10వేల లోపు సెగ్మెంట్‌లో ఉత్తేజకరంగా ఉంటుంది. కాబట్టి, రూ.10వేల నుంచి 13వేల ధరల విభాగంలో ఉన్నవారికి 5జీ స్మార్ట్‌ఫోన్లు అందుబాటులో ఉంటే రూ.10వేల లోపు విభాగంలోకి మారే అవకాశం వుంది. దీనివల్ల మధ్యస్త రేట్ల విభాగంలో కొద్దిమేరకు ప్రభావం చూపవచ్చు. అదికూడా చాలా తక్కువగా ఉంటుందని నమ్ముతున్నాను. అంతేతప్ప మరే ఇతర విభాగంలోనూ ఇప్పుడు పెద్దగా ధరల తగ్గింపును ఆశించవద్దు.'

వినియోగదారుల వ్యయంలోనూ పెరుగుదల : జియోమి ఇండియా ప్రెసిడెంట్ మురళీకృష్ణన్

"మొబైల్ ఫోన్‌లు, ఛార్జర్‌ల ప్రాథమిక కస్టమ్స్ సుంకాన్ని తగ్గించాలన్న కేంద్రప్రభుత్వ ప్రకటనను మేము స్వాగతిస్తున్నాం. అదే సమయంలో స్మార్ట్‌ఫోన్ తయారీ, మూలధన వస్తువులు, ఎలక్ట్రానిక్స్ పరిశ్రమలో మూలధన వస్తువుల కోసం ముడి పదార్థాలపై మినహాయింపులను పొడిగిస్తూ... ఒక ప్రతిపాదన టారిఫ్ రేట్ స్ట్రక్చర్‌ను సమగ్రంగా సమీక్షించడం, పరిశ్రమను మరింత బలోపేతం చేసే మరో సానుకూల దశ. మొదటిసారిగా ఉద్యోగులకు ఉపాధితో అనుసంధానించబడిన ప్రోత్సాహకాలను మేము అభినందిస్తున్నాం. ఈ చర్యలతో, స్మార్ట్‌ఫోన్‌లకు పెరిగిన డిమాండ్‌తో సహ వినియోగదారుల వ్యయంలోనూ పెరుగుదలను మేము అంచనా వేస్తున్నాం."

ట్రేడింగ్ లాభాలపై పన్నులు

- ఇన్వెస్టర్లకు మోడీ షాక్
- షార్ట్ టర్మ్ కాపిటల్ గెయిన్స్‌పై 20శాతం పన్ను


న్యూఢిల్లీ : స్టాక్ మార్కెట్లలో ట్రేడింగ్‌పై వచ్చే లాభాలపై భారీగా పన్నులు వేయాలని మోడీ సర్కార్ నిర్ణయం తీసుకుంది. మంగళవారం ప్రవేశ పెట్టిన బడ్జెట్‌లో దీర్ఘకాలిక మూలధన లాభాలపై పన్ను రేటును 10 శాతం నుంచి 12.5 శాతానికి పెంచుతూ మంత్రి సీతారామన్ ప్రకటన చేశారు. అలాగే షార్ట్ టర్మ్ క్యాపిటల్ గెయిన్స్ ట్యాక్స్‌ను 15 శాతం నుంచి 20 శాతానికి పెంచుతున్నట్లు ప్రకటించారు. అలాగే ఫ్యూచర్ అండ్ ఆప్షన్స్ ట్రేడింగ్ లో సెక్యూరిటీస్ ట్రేడింగ్ ట్యాక్స్‌ను 0.01 శాతం నుంచి 0.02 శాతానికి పెంచారు. నాన్ ఫైనాన్షియల్ అసెట్స్, ఇతర ఫైనాన్షియల్ అసెట్స్ ట్యాక్స్ రేట్లు మాత్రం యథాతథంగా ఉంటాయని మంత్రి తెలిపారు. కాగా.. సాధారణ ఇన్వెస్టర్లపై క్యాపిటల్ గెయిన్ మినహాయింపు పరిమితిని సంవత్సరానికి రూ.1 లక్ష నుంచి రూ.1.25 లక్షలకు పెంచారు. ఆదాయపు పన్ను నిబంధనల ప్రకారం ఒక వ్యక్తి క్యాపిటల్ అసెట్స్‌ను విక్రయించినపుడు లాభం లేదా నష్టం ఉంటుంది. వీటినే మూలధన లాభాలు లేదా నష్టాలు అంటారు. ఇన్వెస్టర్ కంపెనీ షేర్లను ఏడాది లోపు విక్రయిస్తే వాటిని షార్ట్ టర్మ్‌గా, ఏడాది పైబడి షేర్లను విక్రయించకుండా ఉంటే లాంగ్‌టర్మ్ పెట్టుబడులుగా పరిగణిస్తారు.



రూ.50వేల కోట్ల డిజిన్వెస్ట్‌మెంట్ లక్ష్యం

న్యూఢిల్లీ : గడిచిన సార్వత్రిక ఎన్నికల్లో బిజెపికి తీవ్ర ఎదురుదెబ్బలు తగిలినప్పటికీ.. ప్రభుత్వ రంగ సంస్థల్లో వాటాల విక్రయాన్ని మాత్రం కొనసాగింపునకే ప్రయత్నిస్తోంది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం (2024-25)లో రూ.50వేల కోట్ల విలువ చేసే పిఎస్‌యుల వాటాలను అమ్మాలని నిర్దేశించుకున్నామని కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి సీతారామన్ బడ్జెట్‌లో తెలిపారు. గడిచిన 2023-24లోనూ ఇదే స్థాయిలో పెట్టుబడుల ఉపసంహరణ లక్ష్యాన్ని పెట్టుకుంది. కాగా.. 30వేల కోట్ల వాటాలను విక్రయించింది. 2024-25లో ఆర్‌బిఐ సహా బ్యాంక్‌ల ద్వారా రూ.1.2 లక్షల కోట్ల డివిడెండ్‌ను ఆశిస్తోన్నట్లు మంత్రి తెలిపారు. ఇతర పిఎస్‌యుల నుంచి రూ.48వేల కోట్ల డివిడెండ్ వచ్చే అవకాశం ఉందని అన్నారు. 2023-24కు గాను ఆర్‌బిఐ నుంచి ఏకంగా రూ.2.11 లక్షల కోట్ల డివిడెండ్ పొందిన విషయం తెలిసిందే.





బంగారంపై కస్టమ్స్ సుంకం తగ్గింపు

న్యూఢిల్లీ : దేశంలో భారీగా పెరిగిన బంగారం ధరల నుంచి వినియోగదారులకు కొంత ఉపశమనం లభించే అవకాశం ఉంది. బంగారం, వెండితో పాటు ప్లాటినంపై కస్టమ్స్ సుంకాన్ని తగ్గిస్తున్నట్లు ఆర్థికమంత్రి నిర్మలా సీతారామన్ బడ్జెట్‌లో తెలిపారు. బంగారం, వెండిపై కస్టమ్స్ సుంకాన్ని 6 శాతానికి కోత పెట్టినట్లు వెల్లడించారు. ఇంతక్రితం ఈ లోహాలపై ఏకంగా 15 శాతం కస్టమ్స్ సుంకం అమల్లో ఉంది. ప్లాటినంపై కస్టమ్స్ ట్యాక్స్‌ను 6.4 శాతానికే పరిమితం చేస్తున్నట్లు తెలిపారు. 2022-23 ఆర్థిక సంవత్సరంలో పసిడి దిగుమతులు రూ.2.8 లక్షల కోట్లుగా నమోదయ్యాయని విఘ్నహర్తా గోల్డ్ ఛైర్మన్ మహేంద్ర లునియా పేర్కొన్నారు. దీంతో పసిడి పరిశ్రమపై ఏకంగా రూ.42వేల కోట్ల పన్ను భారం పడిందన్నారు. బంగారంపై సుంకాన్ని 15 శాతం నుంచి ఆరు శాతానికి తగ్గించడంతో పరిశ్రమకు మేలు జరగనుందన్నారు. డిమాండ్ కూడా పెరగనుందన్నారు. మంగళవారం హైదరాబాద్‌లో 24 క్యారెట్ల స్వచ్ఛత కలిగిన 10 గ్రాముల బంగారంపై రూ.2,990 తగ్గి రూ.70,860 వద్ద ముగిసింది. 22 క్యారెట్ల స్వచ్ఛత కలిగిన బంగారంపై రూ. 2,750 తగ్గి రూ.64,950గా నమోదయ్యింది. కిలో వెండిపై రూ.3500 దిగివచ్చి రూ.92,500గా పలికింది.

సంపాదకీయం

మళ్లీ మాటల గారడీ!

కేంద్ర ఆర్థిక శాఖామంత్రి నిర్మలా సీతారామన్ మంగళవారం పార్లమెంటులో ప్రవేశపెట్టిన బడ్జెట్ ఉత్త మాటల గారడీగానే తేలిపోయింది! కీలకమైన రంగాలు వేటికీ ఘనమైన కేటాయింపులు జరపలేదు. ధరల పెరుగుదలకు కారణమై, సామాన్యుల దైనందిన జీవితాన్ని అతలాకుతలం చేస్తున్న ద్రవ్యోల్బణాన్ని అరికట్టటానికి ఏ చర్యలూ ప్రకటించలేదు. ఈ దశాబ్ది ఆఖరికి పదికోట్ల ఉద్యోగాలు సృష్టిస్తామని ఘనంగా పేర్కొన్నా- అందుకు తగిన కార్యాచరణ, నిధుల కేటాయింపూ కనపడలేదు. ఉపాధి అనుసంధాన ప్రోత్సాహక పథకం యజమానులకు ఉపయోగపడుతుంది తప్ప ఉద్యోగార్థులకు పెద్దగా మేలు చేసేది కాదు. యువతకు నైపుణ్య శిక్షణ ఇస్తారు సరే ... శిక్షణానంతరం ఉద్యోగాల మాటేమిటి? అన్న ప్రశ్నకు ఈ బడ్జెట్‌లో సమాధానం లేదు. ఏడాదికి సగటున 78.5 లక్షల ఉద్యోగాలు సృష్టిస్తామన్న మంత్రి మాట... గతంలో మోడీ ఇచ్చిన ఏడాదికి రెండు కోట్ల ఉద్యోగాల హామీ వలె డొల్లగా కనిపిస్తోంది. వ్యవసాయ రంగం మీద, ఉపాధి హామీ పథకం మీదా గతంలో మాదిరిగానే మోడీ ప్రభుత్వపు చిన్నచూపు కొనసాగింది. ఎరువుల రాయితీని మరింత తగ్గించి, రైతులకు ద్రోహం చేసింది. గ్రామీణ వ్యవసాయ కార్మికులకు, చిన్న రైతులకు, పేదలకు తోడ్పాటునిస్తున్న ఉపాధి హామీకి నిధులను తెగ్గోసింది. గత బడ్జెట్‌తో పోలిస్తే- ఎరువుల సబ్సిడీలో రూ.24,894 కోట్లు, ఆహార సబ్సిడీలో రూ.7082 కోట్లు కోత పెట్టారు.

ఈకాలంలో కేంద్ర ప్రభుత్వ ఆదాయంలో పెరుగుదల 14.5 శాతం మేర ఉండగా, వ్యయంలో పెరుగుదల 5.94 శాతం మాత్రమే! పెరిగిన ఆదాయాన్ని ఆర్థిక కార్యకలాపాల విస్తరణకు ఉపయోగిస్తే- యువతకు ఉద్యోగ ఉపాధి అవకాశాలు పెరుగుతాయి. కానీ, ఈ బడ్జెట్లో ఆ మొత్తాన్ని జిడిపిలో ఆర్థికలోటు తగ్గించే అంకెల విన్యాసం వైపు మళ్లించారు. ఇది కార్పొరేట్లను, అంతర్జాతీయ ఫైనాన్స్ పెట్టుబడిదారులను సంతృప్తపరిచే చర్యే తప్ప- దేశ ప్రజలకు దోహదపడేది కాదు. ఆర్థిక సంఘం ద్వారా రాష్ట్రాలకు జరిపే నిధుల కేటాయింపు బిజెపి హయాంలో అంతకంతకు కుదించుకుపోతోంది. 2022 బడ్జెట్‌తో పోలిస్తే ఈసారి ఏకంగా రూ.40 వేల కోట్లకు ఎగనామం పెట్టేశారు! ప్రతిపక్షాల ఏలుబడిలో ఉన్న రాష్ట్రాలకు మరింత ద్రోహం చేయటానికి ఇది దారి తీయొచ్చు! ప్రభుత్వరంగంలోని రూ.50 వేల కోట్ల మేర వాటాల ఉపసంహరణకు ప్రతిపాదించటం మరీ దారుణం.

ఆంధ్రప్రదేశ్‌కు ఈసారి కూడా కేటాయింపుల్లో తీరని ద్రోహం జరిగింది. గొప్ప సాయం అందిస్తున్నట్టు ప్రసంగంలో ప్రవచించినా, నిజంగా చూపిన ప్రేమ శూన్యం. విభజనచట్టంలోని ఏ ఒక్క హామీని నెరవేర్చటానికి నిర్దిష్టమైన ప్రస్తావన కానీ, కేటాయింపులు కానీ చేయలేదు. రాజధాని నిర్మాణానికి రూ.15 వేల కోట్ల నిధులను అంతర్జాతీయ ద్రవ్య సంస్థల ద్వారా రుణం తీసుకోవటానికి సాయపడతామని చెప్పారే కానీ, గ్రాంటుగా ఒక్క రూపాయి కూడా విదిలించలేదు. ఈ అప్పును ఎవరు చెల్లిస్తారో, వడ్డీని ఎవరు భరిస్తారో స్పష్టత లేదు. అప్పు ఇప్పించటమే ఒక ఘనమైన సహాయం అని కేంద్రం మభ్యపెట్టదలిస్తే అది రాష్ట్ర ప్రజలతో క్రూర పరిహాసమే! పోలవరం ప్రాజెక్టు గురించి గొప్ప ప్రస్తావనలు చేసినా, నిధుల కేటాయింపు మీద కానీ, నిర్వాసితులకు పునరావాసం మీద కానీ ఒక్క మాటా లేదు. విశాఖ రైల్వే జోనూ, కడప స్టీలు ఫ్యాక్టరీ ఊసే లేదు. విశాఖ ఉక్కు కర్మాగారాన్ని ప్రయివేటీకరించబోమని ఆ మధ్య కేంద్ర మంత్రి కుమారస్వామి విశాఖలో కుంటి తుడుపు ప్రకటన చేశారు కానీ, ఈ బడ్జెట్లో అలాంటి భరోసా ఏమీ ఇవ్వలేదు. వెనకబడిన జిల్లాలకు సహాయం జాబితాలో ప్రకాశంను కూడా కలపటం హర్షించదగ్గదే కానీ, కొద్దిపాటి విదిలింపు నిధులతో ఒరిగేదేమీ ఉండదు. ఈ బడ్జెట్ ద్వారా రాష్ట్రానికి మేలు జరిగిపోయినట్టు ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ హర్షం వ్యక్తం చేయడం తొందరపాటే అవుతుంది. విభజన హామీలను అమలు జరపటం కేంద్ర ప్రభుత్వ బాధ్యత. రాజధాని నిర్మాణానికి, పోలవరం పూర్తికి, ఇతర అభివృద్ధి కార్యక్రమాలకూ తగినన్ని నిధులు పొందటం మన హక్కు. గట్టిగా అడిగి, పోరాడి సాధించాలి. లేదంటే ఇలాంటి ప్రసంగాల ప్రహసనాలతో, అంకెల గారడీలతో మళ్లీ మళ్లీ మోసపోతూనే ఉంటాం. రాష్ట్ర విభజన జరిగి, పదేళ్లు గడిచిపోయాక కూడా 'అన్ని హామీలూ అమలు చేస్తా'మన్న దగ్గరే బిజెపి ప్రభుత్వం ఆగిపోవటాన్ని ఎట్టి పరిస్థితుల్లోనూ అంగీకరించకూడదు.

మహనీయుల మాట



సమాజంలో దోపిడీకి, అణచివేతకు గురవుతున్న కార్మికుల ప్రయోజనాలు అన్ని దేశాల్లోనూ ఒకే విధంగా ఉంటాయి.

- క్లారా జట్కిన్,
మహిళా హక్కుల కార్యకర్త.



విశ్లేషణ

ప్రజా ఉద్యమాలతోనే పురోగతి



విభజన అనంతరం పార్టీ ఇతర వామపక్షాలతోనూ, అభ్యుదయవాదులతోనూ కలిసి అనేక ఉద్యమాలు నిర్వహించింది. ప్రత్యేక హోదా, విభజన హామీలపై పట్టు వదలకుండా పోరాడుతున్నది. విశాఖ ఉక్కు ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా కార్మిక పోరాటాలకు మద్దతునివ్వడమేగాకుండా స్వతంత్రంగా ఉద్యమాలు నిర్వహించింది. 42 రోజుల చారిత్రాత్మక అంగన్‌వాడీల సమ్మె, మున్సిపల్ వర్కర్స్ సమ్మె, ఆశాల ఆందోళనలకు వెన్నుదన్నుగా నిలిచింది. మూడు రాజధానులకు వ్యతిరేకంగా గళం విప్పింది. కార్మిక ఉద్యోగుల పోరాటాలకు చురుకైన మద్దతునివ్వడం, విద్యుత్ చార్జీలు, పన్నుల భారాలకు వ్యతిరేకంగా, దళితులు, మహిళలపై దాడులు, అత్యాచారాలకు వ్యతిరేకంగా అనేక పోరాటాలు నిర్వహించింది. ప్రత్యేకించి భూపోరాటాలకు సిపిఐ(యం) అండగా నిలిచింది. బలవంతపు భూసేకరణను వ్యతిరేకించింది. నూతన విద్యా విధానానికి వ్యతిరేకంగా జాబ్ క్యాలెండర్ కోసం పోరాడిన యువతీ యువకులకు అండగా నిలబడింది. ఢిల్లీ కేంద్రంగా సాగిన రైతు ఉద్యమంలో పార్టీ క్రియాశీల పాత్ర పోషించింది.



వి. శ్రీనివాసరావు

గత 30 ఏళ్ళ సంస్కరణల ఫలితంగా భౌతిక పరిస్థితుల్లో వచ్చిన మార్పుల ప్రభావం ప్రజా ఉద్యమాలపై వివిధ రూపాల్లో ఎలా పడిందో గత వారం వ్యాసంలో చర్చించాము. అయితే కమ్యూనిస్టులు ఎప్పుడూ భౌతిక పరిస్థితులపై నెపం నెట్టి తమ బాధ్యతల నుండి తప్పించుకోరు. మారుతున్న పరిస్థితులకనుగుణంగా ఎప్పటికప్పుడు విధానాలను, నినాదాలను సమీక్షించుకుంటూ అవసరమైన మార్పులు, సర్దుబాట్లు చేసుకుంటూ వస్తుంటారు. అనేక ప్రతికూల పరిస్థితుల మధ్య సిపిఐ(యం), కమ్యూనిస్టు ఉద్యమం నిలబడి వుందన్న విషయం మనం మరచిపోకూడదు. "నిర్దిష్ట పరిస్థితులను నిర్దిష్టంగా విశ్లేషించడమే మార్క్సిజం సారం" అని లెనిన్ చెప్పాడు. మార్క్సిస్టు, లెనినిస్టు సూత్రాలను భారతదేశ నిర్దిష్ట పరిస్థితులకు వర్తింపజేసుకొని ఈ దేశంలో దోపిడీ లేని సమ సమాజాన్ని నిర్మించడానికి సిపిఐ(యం) అంకితమైంది. దీనికనుగుణంగా ప్రజా ఉద్యమాల రూపకల్పన జరుగుతుంది. వివిధ ప్రజారంగాల్లో పనిచేసే పార్టీ సభ్యులు ఈ అవగాహనకనుగుణంగా ప్రజలను సమీకరించే ప్రయత్నం చేస్తున్నారు. సమస్యలపై స్పందించడంలోనూ, ప్రజల్ని కదిలించి ఉద్యమాలు నిర్వహించడంలోనూ కమ్యూనిస్టులకు ఎవరూ సాటి రారు. అయినా పార్టీ ఎందుకు అధికారంలోకి రావడం లేదన్న ప్రశ్న అభిమానుల్ని వేధిస్తున్నది.

సంక్షోభంలో పెట్టుబడిదారీ వ్యవస్థ

కార్ల్‌మార్క్స్ అన్నట్లుగా "తత్వవేత్తలు ప్రపంచాన్ని పరిపరివిధాలుగా విశ్లేషించారు. కానీ చేయాల్సింది దానిని మార్చడం". సామాజిక మార్పు వర్గ పోరాటం ద్వారానే జరుగుతుందని చరిత్ర రుజువు చేసింది. గత 30 సంవత్సరాలుగా పెట్టుబడిదారీ విధానం సంస్కరణల ద్వారా తనను తాను కూడగట్టుకొని బలపడినందున అదే శాశ్వతం అని భ్రమించేవారి సంఖ్య భారీగానే ఉంది. అభ్యుదయ వాదులు సైతం దీనికి గురయ్యారు. ఇప్పుడు పెట్టుబడిదారీ వ్యవస్థ 21వ శతాబ్దం ప్రారంభంలో ఉన్నట్లు లేదు. ఆ వ్యవస్థే సంక్షోభంలో పడింది. తాజా ఎకనమిక్ సర్వే 2023-24లో చెప్పినట్లుగా ప్రపంచ ఆర్థిక వ్యవస్థ అసాధారణమైన సవాళ్ళను ఎదుర్కొంటోంది. ఇది ఏదో ఒక రంగానికో, ఒక ప్రాంతానికో పరిమితమైందీ కాదు, తాత్కాలికమైందీ కాదు. ఇది వ్యవస్థీకృత సంక్షోభం. నేడు ప్రపంచాన్ని పీడిస్తున్న ఈ సంక్షోభం రేపు భారతదేశాన్ని కూడా ఆవహిస్తుంది. ఆ ఛాయలు ఇప్పుడే కనిపిస్తున్నాయి. ఈ సంక్షోభ భారాల ఫలితంగానే గత ఎన్నికల్లో బిజెపికి గట్టి ఎదురుదెబ్బలు తగిలాయి. అనేక దేశాల్లో, రాజకీయ రంగాల్లో జరుగుతున్న మార్పులు కూడా దీనినే ప్రతిబింబిస్తున్నాయి. 30 ఏళ్ళ క్రితం కమ్యూనిస్టు పార్టీలు బలహీనపడిన నేపథ్యంలో దానికి భవిష్యత్ లేదని, పాతాళానికి తొక్కేశామని ప్రపంచ పెట్టుబడిదారులు సంబరపడ్డారు. అంతమైందనుకున్న కమ్యూనిస్టు "భూతం" నేడు అమెరికాను ఆవహించింది. తిరిగి కమ్యూనిజమే తమకు ప్రధాన శత్రువు అని ప్రకటించుకోవాల్సిన స్థితి ఈ సామ్రాజ్యవాద దిగ్గజానికి ఏర్పడింది. కమ్యూనిజాన్ని పాతాళానికి తొక్కినా, ఆకాశానికి ఎగరగలిగిన శక్తి దానికుందని ప్రస్తుత ప్రపంచ పరిణామాలు విదితం చేస్తున్నాయి.

కార్యకర్తల బలమే పార్టీకి పునాది

గత 30 ఏళ్ళల్లో కమ్యూనిస్టు ఉద్యమం బలహీనపడిన నేపథ్యంలో కొందరికి మార్క్సిజంపైనే విశ్వాసం తగ్గి రాజకీయ రంగం నుండి వైదొలిగారు. మరికొందరు కొత్త కొత్త పార్టీలపై భ్రమలతో పార్టీని వీడారు. మరికొందరు విశ్వాసం సడలిపోయి ఉద్యమాల్లో కొనసాగుతానే ఉత్సాహంతో పనిచేయలేకున్నారు. అయినా ఆటుపోట్లు తట్టుకొని భవిష్యత్ మీద విశ్వాసంతో, నిబద్ధతతో పనిచేస్తున్న వారి సంఖ్య పార్టీలో ఇప్పటికీ గణనీయంగానే ఉంది. అయితే కొందరికి వయస్సు మీదపడడం, వృద్ధాప్యం, అనారోగ్యం వంటి సమస్యలతో పూర్తి సామర్థ్యంతో పనిచేయలేకున్నారు. పని తగ్గుతున్నవారి స్థానంలో కొత్త శక్తులు వచ్చి చేరడం నెమ్మదిగా జరుగుతోంది. 21వ శతాబ్దంలో అడుగిడిన యువతరం కమ్యూనిస్టు ఉద్యమానికి దూరం కాగా ఆ తరువాత వస్తున్న ప్రస్తుత తరం సంక్షోభం సుడిగుండంలో సైద్ధాంతిక గందరగోళానికి, అయోమయానికి గురవుతున్నారు. విద్యా విధానంలో వచ్చిన మార్పులు, ఈ తరాన్ని ప్రభావితం చేసే వారి ఆలోచనలో వచ్చిన మార్పులు, బయట మార్కెట్, మతోన్మాద, అస్తిత్వవాద ఆలోచనా విధానాలు యువతరాన్నే కాదు కమ్యూనిస్టులను కూడా కొంత వరకు తాకాయి. మార్క్సిస్టేతర సిద్ధాంతాల ప్రభావం పెరిగింది. మార్క్సిజం కన్నా ఇంకేదన్నా గొప్పదుందేమోనన్న భ్రమల్లో కొందరు మునిగిపోతే, మరికొందరు మార్క్సిజాన్ని అర్థం చేసుకొని వర్తింపజేయడంలో కమ్యూనిస్టులు విఫలమయ్యారన్న నిస్పృహతో ఉన్నారు. ఈ పరిస్థితిని అధిగమించేందుకు కార్యకర్తల సైద్ధాంతిక, రాజకీయ, నిర్మాణ నైపుణ్యాన్ని సుసంపన్నం చేసేందుకు సిపిఐ(యం) ఈ కాలంలో అనేక విధాలుగా ప్రయత్నించింది. మోడీ ప్రభావం తగ్గడంతో కొత్త ఆలోచనలకు అవకాశం ఏర్పడింది. ప్రజలు సంక్షోభంలో వుంటే రూ. 5 వేల కోట్లు పెట్టి పెళ్లి చేసిన అంబానీ దానికోసం జియో ఛార్జీలు పెంచడాన్ని యువతరం జీర్ణించుకోలేకపోతున్నది. ఇలాంటి ఘటనలు యువతరం ఆలోచనల్లో మార్పు తెస్తాయి. ప్రజల ఆలోచనలను ప్రభావితం చేయడానికి సాంస్కృతిక, సాహిత్య ఉద్యమాల్ని చేపట్టింది. అయితే ఈ కాలానికి అది సరిపోదు. దీన్ని అధిగమించేందుకు సైద్ధాంతిక నిబద్ధత, కార్యకర్తల నిర్మాణం, నైతిక బలం పునాదిగా సిపిఐ(యం) తన ప్రస్థానాన్ని కొనసాగిస్తున్నది.

బలమైన ప్రజావాణిగా సిపిఐ(యం)

మారుతున్న పరిస్థితులకనుగుణంగా సిపిఐ(యం) తన రాజకీయ, నిర్మాణ విధానాలను, పద్ధతులను ఎప్పటికప్పుడు సమీక్ష చేసుకుంటూ సరిదిద్దుకుంటూ వస్తున్నది. 1964లో పార్టీ ఏర్పడిన తరువాత తీవ్రమైన నిర్బంధాన్ని ఎదుర్కొని ఒంటరి పోరాటాన్ని సాగించింది. చీలికల అనంతరం కొద్ది బలంతో పునఃనిర్మాణం చేసుకొని ఎమర్జెన్సీ అనంతరం అతి పెద్ద వామపక్ష శక్తిగా అవతరించింది. ఎమర్జెన్సీ అనుభవంతో ఐక్య సంఘటనా ఎత్తుగడలను అనుసరించి విస్తరించింది. 1978లో సాల్కియాలో ప్లీనం జరుపుకొని పార్టీని దేశవ్యాపితంగా విస్తరింపజేసేందుకు నడుం కట్టింది. ప్రజా సమస్యలను జాతీయ స్థాయిలో చేపట్టి పెద్ద ఎత్తున ఉద్యమాలు నిర్వహించింది. రైతులకు గిట్టుబాటు ధరల కోసం దేశవ్యాపిత ఆందోళనల్లో సిపిఐ(యం) ముందున్నది. కార్మికులకు పోరాడే హక్కుతో సహా వేతనాల పెంపుదల, పెన్షన్ వంటి అనేక సమస్యలపై గళమెత్తింది. బయట పోరాటాలు చేస్తూ వాటికి మద్దతుగా పార్లమెంటులోనూ బలమైన వాణిని వినిపించింది. సమస్యలపై కలిసొచ్చే శక్తులను కలుపుకొని పోరాడింది. ఈ క్రమంలో జాతీయ స్థాయిలో కార్మిక, రైతు, వ్యవసాయ కార్మికులను, మహిళలను, యువజన, విద్యార్థులను కూడగట్టేందుకు నిర్మాణ చర్యలు చేపట్టింది. 1980లో దేశవ్యాపితంగా దళితులపై పెరిగిన దాడులు, అత్యాచారాలకు వ్యతిరేకంగా ఎక్కడికక్కడ ఎదుర్కొని పోరాడింది. దళిత ఉద్యమాలకు మద్దతుగా కార్మిక, కర్షక సంఘీభావానికి కృషి చేసింది.

అయితే 1991 తరువాత ఉద్యమాల ఊపు తగ్గింది. అయినా 2000 సంవత్సరంలో మన రాష్ట్రంలో విద్యుత్ ఉద్యమం, భూపోరాటాలు కొత్త తరానికి స్ఫూర్తినిచ్చాయి. 2004లో యుపిఎ ప్రభుత్వం ఏర్పడిన నేపథ్యంలో వచ్చిన కొత్త అవకాశాలను ఉపయోగించుకొని అటవీ సంరక్షణ చట్టం, ఉపాధి హామీ పథకం, విద్యా హక్కు చట్టం లాంటి అణగారిన వర్గాల హక్కులకు చట్టబద్ధత కల్పించేందుకు తన పలుకుబడిని ఉపయోగించింది. ఈ చట్టాలు తీసుకురావడానికి ముందు ఆయా తరగతులను కూడగట్టి కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చింది. అయితే అమెరికాతో అణు ఒప్పందాన్ని తీవ్రంగా వ్యతిరేకించిన వామపక్షాలు తరువాత యుపిఎకి మద్దతు ఉపసంహరించుకున్నాయి. ఇది గిట్టని సామ్రాజ్యవాదులు, వారి కనుసన్నల్లో పని చేసే బడా పెట్టుబడిదారీ వర్గం, బడా కార్పొరేట్ మీడియా వామపక్షాలను ప్రత్యేకించి బెంగాల్, త్రిపుర, కేరళలో దెబ్బ తీసేందుకు పెద్ద ఎత్తున కుట్రలు చేసింది. ప్రభుత్వాల నిర్వహణలో జరిగిన లోపాలు, పార్టీ నిర్మాణ బలహీనతల వల్ల ప్రజలకు, పార్టీకి మధ్య దూరం పెరిగింది. బూర్జువా పార్టీలు దీనిని అవకాశంగా తీసుకొని ఎదురుదాడి చేసి ఓడించాయి. బెంగాల్, త్రిపురల్లో నేటికీ తీవ్ర నిర్బంధాన్ని ఎదుర్కొంటూ ప్రజల మధ్య పనిచేస్తున్నారు.

రాష్ట్ర విభజన అనంతర ఉద్యమాలు

తెలుగు ప్రజల ఐక్యత కోసం, రాష్ట్ర విభజనకు వ్యతిరేకంగా నికరంగా నిలబడ్డ ఏకైక పార్టీ సిపిఐ(యం). విభజన అనంతరం పార్టీ ఇతర వామపక్షాలతోనూ, అభ్యుదయవాదులతోనూ కలిసి అనేక ఉద్యమాలు నిర్వహించింది. ప్రత్యేక హోదా, విభజన హామీలపై పట్టు వదలకుండా పోరాడుతున్నది. విశాఖ ఉక్కు ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా కార్మిక పోరాటాలకు మద్దతునివ్వడమేగాకుండా స్వతంత్రంగా ఉద్యమాలు నిర్వహించింది. 42 రోజుల చారిత్రాత్మక అంగన్‌వాడీల సమ్మె, మున్సిపల్ వర్కర్స్ సమ్మె, ఆశాల ఆందోళనలకు వెన్నుదన్నుగా నిలిచింది. మూడు రాజధానులకు వ్యతిరేకంగా గళం విప్పింది. కార్మిక ఉద్యోగుల పోరాటాలకు చురుకైన మద్దతునివ్వడం, విద్యుత్ చార్జీలు, పన్నుల భారాలకు వ్యతిరేకంగా, దళితులు, మహిళలపై దాడులు, అత్యాచారాలకు వ్యతిరేకంగా అనేక పోరాటాలు నిర్వహించింది. ప్రత్యేకించి భూపోరాటాలకు సిపిఐ(యం) అండగా నిలిచింది. బలవంతపు భూసేకరణను వ్యతిరేకించింది. నూతన విద్యా విధానానికి వ్యతిరేకంగా జాబ్ క్యాలెండర్ కోసం పోరాడిన యువతీ యువకులకు అండగా నిలబడింది. ఢిల్లీ కేంద్రంగా సాగిన రైతు ఉద్యమంలో పార్టీ క్రియాశీల పాత్ర పోషించింది.

క్షేత్ర స్థాయి నాయకత్వం - స్థానిక సమస్యలపై కృషి

2024 ఎన్నికల్లో ప్రజలతో పార్టీ సంబంధాలు బలహీన పడటాన్ని గుర్తించింది. క్షేత్ర స్థాయిలో ప్రజల తక్షణ సమస్యలపై నిరంతరాయంగా ఉద్యమాలు నిర్వహిస్తున్న సిపిఐ(యం) ఏజెన్సీలో ఒక రాజకీయ శక్తిగా అవతరించింది. అటవీ హక్కుల సవరణ చట్టానికి వ్యతిరేకంగా, పోడు భూముల పట్టాల కోసం పోరాడింది. తునికాకు కార్మికుల కనీస వేతనాలు, ఆదివాసీ యువతకు ఉద్యోగాలు కల్పించే జి.వో.నెంబర్ 3ని పునరుద్ధరించి స్పెషల్ డిఎస్సీ నిర్వహించాలని, రిజర్వేషన్లు కాపాడాలని, భాషా వలంటీర్లను రెగ్యులరైజ్ చేసి జీతాలు పెంచాలని డిమాండ్ చేయడమేగాకుండా దీనికోసం ఆదివాసీ గిరిజన సంఘాలు పిలుపునిచ్చిన రెండు బంద్‌లకు అండగా నిలబడింది. పోలవరం నిర్వాసితుల పునరావాసం కోసం పాదయాత్రలతో సహా వివిధ రూపాల్లో ఆందోళనలను సాగించడమేగాక సమస్యను ఢిల్లీ వరకు తీసుకెళ్ళింది. ఈ పోరాటాలన్నీ సిపిఐ(యం)ను గిరిజనుల కోసం పోరాడే యోధునిగా నిలబెట్టింది. ఆ విశ్వాసంతోనే ఈ ఎన్నికల్లో సాధారణ ఆదివాసీలతోపాటు విద్యావంతులైన యువతీ యువకులు గణనీయమైన సంఖ్యలో ఓట్లు వేశారు. అయితే మిగతా రాష్ట్రంలో నిరాశాజనకమైన ఫలితాలే వచ్చాయి. సాంప్రదాయకంగా బలంగా ఉన్న కేంద్రాల్లో కూడా బలహీనపడ్డాం. నూతనంగా ఆవిర్భవించిన నయా ధనిక వర్గాలను క్షేత్ర స్థాయిలో ఎదుర్కొని నిలబడగలిగే నాయకత్వ కొరత ఏర్పడింది. పార్టీ శాఖలు స్వంత చొరవతో ప్రజా సమస్యలను చేపట్టి సమరశీల పోరాటాలు నిర్వహించడం ద్వారా ఈ బలహీనతను అధిగమించగలం.

ప్రజా పునాదిపై పార్టీ నిర్మాణం


ఇన్ని సమస్యలపై నిరంతరం పనిచేస్తున్నా ప్రజా పునాది ఎందుకు బలహీన పడుతుందన్న అంశంపై పార్టీ ఆత్మావలోకనం చేసుకుంది. పోరాటాన్ని నిరంతరాయంగా, ఏదో ఒకటి సాధించేదాకా కొనసాగించడంలో లోపాలు జరుగుతున్నాయి. సమస్యలపై పోరాడే క్రమంలో వారిని రాజకీయంగా నిలబెట్టుకునే ప్రయత్నం తక్కువగా జరిగింది. ప్రజా ఉద్యమాలతో రాజకీయ కృషిని జోడించడంలో బలహీనత వుంది. పార్టీలో తలెత్తిన అవకాశవాద పార్లమెంటరీ ధోరణులు ఇందుకు కారణమని ఎన్నికల సమీక్షలో కేంద్ర కమిటీ పేర్కొన్నది. సిపిఐ(యం) సభ్యులు, కార్యకర్తలు వివిధ సంఘాల ద్వారా ప్రజా సమస్యలపై కృషి చేస్తున్నారు. బూర్జువా పార్టీలకు భిన్నంగా సిపిఐ(యం) పని శైలి ఉంటుంది. ప్రజలే చరిత్ర నిర్మాతలన్న సూత్రాన్ని నమ్మి ప్రజా ఉద్యమాల ద్వారా ప్రజలను ఒక సంఘటిత శక్తిగా మార్చడమే సిపిఐ(యం) రాజకీయ కర్తవ్యంగా చేపట్టింది.

పార్టీ నిర్మాణంలో ప్రవేశించిన అనేక తప్పుడు ధోరణులను ఎదుర్కొనడానికి ప్రత్యేకంగా దిద్దుబాటు ఉద్యమాలు చేపట్టింది. తద్వారా పార్టీ నాయకత్వం, కార్యకర్తల, సభ్యుల నాణ్యతలోనూ మార్పు తీసుకొచ్చేందుకు ప్రయత్నించింది. ఇవన్నీ పూర్తిగా సత్ఫలితాలనిచ్చాయని చెప్పలేకపోయినప్పటికీ ఎప్పటికప్పుడు తప్పులు గుర్తించి సరిదిద్దుకునే శక్తి పార్టీకి ఉందని రుజువు చేస్తుంది. తప్పులు జరగకుండా నివారించలేం. కానీ ఆ తప్పులను సరిదిద్దుకొనే శక్తి పార్టీకి ఉందా లేదా అనేది ముఖ్యం. ఇప్పటికీ కమ్యూనిస్టు ఉద్యమానికి ఆ శక్తి ఉంది. పోరాట అనుభవాలతోపాటు సమాజంలో వస్తున్న మార్పుల్ని అధ్యయనం చేస్తూ దానికనుగుణంగా నినాదాలను రూపొందించుకుంటూ ముందుకుపోయే క్రమం కొనసాగుతుంది. 2025 ఏప్రిల్‌లో జరగనున్న 24వ పార్టీ మహాసభ ఆ దిశగా చర్యలు తీసుకుంటుంది.

(వ్యాసకర్త సిపిఎం ఎ.పి రాష్ట్ర కార్యదర్శి)

విమర్శ

ఎవరి కోసం భూ ఆక్రమణల (నిషేధ) చట్టం?



వి. వెంకటేశ్వర్లు



అసైన్డ్ చట్టం ప్రకారం పేదల భూమి పేదలకివ్వాలని ఆందోళన చేసిన ప్రజా సంఘాలు, సామాజిక సంస్థలు, వామపక్ష పార్టీలకు చెందిన నాయకులు, కార్యకర్తలు, పేదలపై క్రిమినల్ కేసులు, రౌడీషీటర్ కేసులు పెట్టి జైళ్ళకు పంపారు. వారు నేటికీ కోర్టులు చుట్టూ తిరుగుతున్నారు. ఒక్క భూ కబ్జాదారుడు కూడా జైలుకు వెళ్ళలేదు. వేలాది ఎకరాలను పెద్దలు, ఉన్నతాధికారులు ఆక్రమించుకున్నారని, వీటిని తిరిగి తీసుకోవాలని కోనేరు రంగారావు భూ కమిటీ, ప్రజా సంఘాలు చెప్పినా...ఏ ఒక్కరి నుండి ఒక్క ఎకరం భూమి కూడా స్వాధీనం చేసుకొని పేదలకు ఇవ్వలేదు. ఏ కోర్టూ శిక్షించలేదు. నేడు తెలుగుదేశం ప్రభుత్వం తెస్తామని చెబుతున్న భూ ఆక్రమణల (నిషేధం) చట్టం 2024 కూడా అలాగే మిగులుతుందా!

భూకబ్జాలను అరికట్టడానికి, కబ్జాదారులకు కఠిన దండన విధించడానికి ఆంధ్రప్రదేశ్ భూ ఆక్రమణల (నిషేధం) చట్టం 2024 తీసుకు వస్తామని రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించింది. జులై 15న జరిగిన క్యాబినేట్ సమావేశం అనంతరం రెవెన్యూ మంత్రి అనగాని సత్యప్రసాద్ మీడియాకు తెలియజేశారు. గుజరాత్ భూ ఆక్రమణల (నిషేధం) చట్టం 2020 ఆధారంగా త్వరలోనే కొత్త చట్టం తెస్తామని ప్రకటించారు. వైసిపి ప్రభుత్వ హయాంలో రాష్ట్ర వ్యాప్తంగా ప్రభుత్వ, దేవదాయ, వక్ఫ్ భూములను ఆ పార్టీ నేతలు, ప్రజా ప్రతినిధులు కబ్జా చేశారు. వారిని గుర్తించి కఠినంగా శిక్షిస్తామని, ఆక్రమణకు గురైన భూములను వెనక్కి తీసుకుంటామని చెప్పారు. భూ కబ్జాదారులను శిక్షిస్తే ప్రజాతంత్ర వాదులందరూ హర్షిస్తారు. కాని ఈ చట్టం మాటున పేదల పోరాటాలను అణచివేయడానికి ప్రయత్నిస్తే ప్రజలు హర్షించరు.

మన రాష్ట్రంలో స్వాతంత్ర్యానంతరం వామపక్షాలు, ప్రజా సంఘాల పోరాటాల ఫలితంగా భూ సీలింగ్ చట్టం, కౌలుదారీ హక్కుల చట్టం, 1/70 చట్టం, 9/77 అసైన్డ్ చట్టాలు వచ్చాయి. పాలకవర్గాలకు ఇష్టం ఉన్నా లేకపోయినా ఉద్యమాలకు తలొగ్గి దళిత, గిరిజన, బలహీన వర్గాలకు చెందిన సుమారు 25 లక్షల పేద కుటుంబాలకు 33 లక్షల ఎకరాల భూమి ప్రభుత్వాలు పంపిణీ చేసినట్లు లెక్కలు తెలియజేస్తున్నాయి. వీటిలో సుమారు 15 లక్షల ఎకరాల భూమిని...పిఓటి 9/77 చట్టాన్ని ఉల్లంఘించి ప్రజా ప్రతినిధులు, రాజకీయంగాను, ధనబలం, కండ బలం కల్గిన నాయకులు అక్రమంగా, దౌర్జన్యంగా ఆక్రమించుకున్నట్లు 2006 నుండి ప్రభుత్వాలు చెబుతూనే ఉన్నాయి. కాని రాష్ట్రంలో పిఓటి యాక్ట్ (భూ నిషేధ చట్టం) ప్రకారం ఆక్రమించుకున్న వారిపై 6 నెలలు జైలు శిక్ష, జరిమానా విధించాలి, ఆక్రమించుకున్న భూములను తిరిగి పేదలకు ఇవ్వాలి. ఈ చట్టం చేసిన నాటి నుండి (1977) నేటి వరకు కాంగ్రెస్, తెలుగుదేశం, వైసిపి ప్రభుత్వాలే రాష్ట్రాన్ని పాలించాయి. కాని ఇప్పటి వరకు ఒక్క భూ కబ్జాదారుని మీద కూడా కేసు పెట్టి జైలుకు పంపలేదు. జరిమానా విధించి వసూలు చేయలేదు. కనీసం ఒక్క పేదవానికైనా తిరిగి భూమిని ఇప్పించారా? అంటే ఎక్కడా అమలు జరిగిన దాఖలాలే లేవు.

అసైన్డ్ చట్టం ప్రకారం పేదల భూమి పేదలకివ్వాలని ఆందోళన చేసిన ప్రజా సంఘాలు, సామాజిక సంస్థలు, వామపక్ష పార్టీలకు చెందిన నాయకులు, కార్యకర్తలు, పేదలపై క్రిమినల్ కేసులు, రౌడీషీటర్ కేసులు పెట్టి జైళ్ళకు పంపారు. వారు నేటికీ కోర్టులు చుట్టూ తిరుగుతున్నారు. ఒక్క భూ కబ్జాదారుడు కూడా జైలుకు వెళ్ళలేదు. వేలాది ఎకరాలను పెద్దలు, ఉన్నతాధికారులు ఆక్రమించుకున్నారని, వీటిని తిరిగి తీసుకోవాలని కోనేరు రంగారావు భూ కమిటి, ప్రజా సంఘాలు చెప్పినా ఏ ఒక్కరి నుండి ఒక్క ఎకరం భూమి కూడా స్వాధీనం చేసుకొని పేదలకు ఇవ్వలేదు. ఏ కోర్టూ శిక్షించలేదు. నేడు తెలుగుదేశం ప్రభుత్వం తెస్తామని చెబుతున్న భూ ఆక్రమణల (నిషేధం) చట్టం 2024 కూడా అలాగే మిగులుతుందా! ఉన్న చట్టాలనే అమలు చేయకపోగా కొత్త చట్టాలను తెచ్చి అమలు చేస్తారంటే ఎలా నమ్మగలం?

గుజరాత్ తరహాలో చట్టం తెస్తామని చెప్పారు. గుజరాత్ భూ ఆక్రమణల (నిషేధం) చట్టం 2020లో ఏముందో ఒకసారి పరిశీలిద్దాం. ఈ చట్టం 2020 అక్టోబర్ 9 నుండి అమల్లోకి వచ్చింది. ఈ చట్టంలోని సెక్షన్ 2(4) ప్రకారం ఎవరైనా భూమిని అక్రమంగా స్వాధీనం చేసుకున్నా లేదా డబ్బు ఆశ చూపి వేరే వారి నుండి ఆక్రమించుకున్నా, చట్ట విరుద్ధంగా నిర్మాణాలు చేపట్టినా, భూమిపై అనధికారికంగా, అక్రమంగా అద్దె (డబ్బు) వసూలు చేసినా లేదా భూ ఆక్రమణలకు సహాయం చేసినా, ప్రోత్సహించినా, వారి పక్షాన నిలబడినా భూ ఆక్రమణదారుల కిందకి వస్తారు. అటువంటి భూములను కౌలుకి తీసుకున్నా, ఆ భూములలో పేదలు పని చేసినా నేరస్తులుగా పరిగణించబడతారు. నేరం రుజువైతే 10 నుండి 14 ఏళ్ళ జైలు శిక్ష, ఆ భూమి విలువను బట్టి జరిమానా విధించబడుతుంది. సెక్షన్ 6(1) ప్రకారం ఈ చట్టాన్ని ఉల్లంఘించి పరిశ్రమ లేదా ఏదైనా కంపెనీ నిర్మించి ఉంటే కూడా శిక్షార్హులు. ఈ ఆక్రమణ తమకు తెలియకుండా జరిగిందని లేదా ఆక్రమణ జరగకుండా ఆపామని పరిశ్రమాధిపతులు రుజువు చేసుకుంటే శిక్ష నుండి మినహాయింపు ఇస్తారు. పై సెక్షన్లను బట్టి ఈ చట్టం ప్రకారం పెట్టుబడిదారులు, పారిశ్రామికవేత్తలకు, పెద్దలకు శిక్ష విధించే కంటే కూడా చారెడు భూమి కోసం పోరాడే ప్రజా ఉద్యమకారులపై ఉక్కుపాదం మోపడానికే గుజరాత్ ప్రభుత్వం ఈ చట్టం తెచ్చినట్లు కన్పిస్తుంది.

సెక్షన్ 7 - న్యాయస్థానాల పాత్ర

రాష్ట్ర ప్రభుత్వం గుజరాత్ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి సమ్మతితో ఒకటి లేదా ఎక్కువ ప్రత్యేక న్యాయస్థానాలను ఏర్పాటు చేస్తుంది. ఈ కోర్టులకు జిల్లా సెషన్స్ న్యాయమూర్తిని నియమిస్తారు. దీనికి ప్రభుత్వం తరపున పబ్లిక్ ప్రాసిక్యూటర్లు ఉంటారు. ఈ కోర్టులు భూ కబ్జాలను అరికట్టడానికి కలెక్టర్ నాయకత్వంలో నియమించిన కమిటీ సభ్యులు ఫిర్యాదు చేసినా లేదా కోర్టే సుమోటాగా చేపట్టినా లేదా ఎవరైనా ఫిర్యాదు చేసినా చర్యలు తీసుకుంటారు. కేసు బనాయించబడ్డ వ్యక్తి పూర్తి ఆధారాలతో, రాత పూర్వకంగా తనే స్వయంగా కోర్టు ముందు ఆధారాలు సమర్పించుకోవచ్చు. నేరం రుజువైతే జైలు శిక్షతో పాటు అతను లేదా వారు ఆక్రమించుకున్న భూమి ఆ రోజు మార్కెట్టు విలువ ఎంత ఉంటే అంత మొత్తం నష్ట పరిహారం చెల్లించాలి. అదే ప్రభుత్వ భూములైతే ఆక్రమించుకున్న నాటి నుండి ఆక్రమణదారులు ఎంత చెల్లించాలో కోర్టు నిర్ణయిస్తుంది. ఈ కేసులన్నిటినీ 6 నెలల లోపు పరిష్కారం చేయాలి. ఒక వేళ కోర్టు పరిష్కరించకపోతే రాష్ట్ర ప్రభుత్వానికి నివేదిస్తుంది. అప్పుడు ప్రభుత్వం తమకు నచ్చిన పద్ధతిలో నిర్ణయం తీసుకుంటుంది. గడిచిన మూడేళ్ళలో గుజరాత్ ప్రభుత్వం ఎంతమంది భూ కబ్జాదారులకు శిక్ష విధించిందనేది పరిశీలిస్తే వాస్తవం విదితమవుతుంది.

మన రాష్ట్రంలో ఇప్పటికే 1973 భూ సీలింగ్ చట్టం, కౌలుదారుల హక్కుల చట్టం అమలులో ఉన్నాయి. 1973 తర్వాత మన రాష్ట్రంలో అనేక సాగునీటి ప్రాజెక్టులు, నూతన వంగడాలు, ఉత్పాదకత పెరగడం వల్ల లక్షలాది ఎకరాల మిగులు భూములు లభ్యమవుతాయని కోనేరు రంగారావు భూ కమిటి నివేదిక సమర్పించింది. ఈ నివేదిక ప్రకారం 2014 నుండి నేటి వరకు వైసిపి, తెలుగుదేశం ప్రభుత్వాలే అధికారంలో ఉన్నాయి. ఎక్కడైనా ఒక్క భూస్వామి దగ్గర మిగులు భూమి బయటికి తీసి ఒక్క పేదవానికి ఎకరం భూమి పంచిన దాఖలు లేవు.

/ వ్యాసకర్త ఎ.పి వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి /

కవిత్వం

ముసురేసింది

పిట్టగోడ కరిగిపోయి
కాలువ వెంట పరుగులెట్టింది
పూరి గుడిసె కదిలిపోతూ
తటాకంలో కలిసిపోయింది
కోతకు వచ్చిన కంకి
ఈదురు గాలికి వాలిపోయింది
చేతికొచ్చిన పంట
వాగు వంకలో విలీనమైపోయింది.

ముసురేసిన కాడి నుంచి
ముంచెత్తే పనిలో చినుకు
ఉరకలేస్తూ ఎగిరి పడుతోంది
ఉరుములన్నీ ఏకమై
పిడుగుల్ని విసిరేస్తూనే
అవనికి తూట్లు పొడుస్తోంది
ప్రకృతి విపత్తుకు చేతులెత్తేస్తూ
యంత్రాంగం మిన్నకుండి పోయింది.

బురదంటిన బతుకులకు
మెరుపుల వెలుగులు లేక
లో లోతుల్లోకి కూరుకుపోయింది
నష్టాల ఊబిలో
ఉబికి వస్తున్న కన్నీరు
వాన నీటిలో కలిసిపోతోంది
ముసురేసినాదంటే
పంట దిగులు పడుతుంది
పునాది చలించిపోతుంది
తీరం తల్లడిల్లి పోయి
కోతల పొరల్లో ఇరుక్కుపోతుంది
అతివృష్టి సుడిగుండంలో
లోతట్టు మునకలేస్తుంది.

- నరెద్దుల రాజారెడ్డి
సెల్ : 9666016636

గుక్కెడు మంచినీరూ కరువే..

- పిల్లలకు అందని పాలు • జ్వరపీడితులనూ పట్టించుకోని వైనం
- పునరావాస కేంద్రాల్లో దయనీయంగా బాధితులు • గోదావరి ముంచేసినా కనికరించని ప్రభుత్వం

ప్రజాశక్తి - విఆర్.పురం, చింతూరు, కూనవరం విలేకరులు (అల్లూరి జిల్లా)

పునరావాస కేంద్రాల్లో గుక్కెడు మంచినీరు కూడా కరువైంది. పిల్లలకు ప్యాకెట్టు పాలు అందడం లేదు. జ్వరపీడితులను కూడా పట్టించుకోవడం లేదు. ఆకలి కేకలు వినిపిస్తున్నాయి. వర్షాలు, వరదలతో పునరావాస కేంద్రాలకు తరలివచ్చిన పోలవరం విలీన మండలాల్లోని ముంపు బాధితుల పరిస్థితి దయనీయంగా ఉంది. కొవ్వొత్తులు, కిరోసిన్ లేక రాత్రులు చీకట్లో మగ్గుతున్నారు. గోదావరి ఉగ్రరూపం దాల్చి గ్రామాలకు గ్రామాలను చుట్టేసిన క్రమంలో బాధితులు ప్రాణాలను అరచేతిలో పెట్టుకుని పునరావాస కేంద్రాలకు తరలి వచ్చారు. వారికి వీటిలో కనీస సౌకర్యాలు మృగ్యమయ్యాయి. బియ్యం, ఉప్పు, పప్పు వంటి నిత్యావసర సరుకులనూ చాలాచోట్ల ప్రభుత్వం అందివ్వలేదు. దీంతో, పునరావాస కేంద్రాల్లోని బాధితులను ఎవరిని కదిపినా కన్నీటిగాథలే వినిపిస్తున్నాయి. 'ప్రజాశక్తి' మంగళవారం పునరావాస కేంద్రాలను పరిశీలించగా పలు విషయాలు వెలుగులోకి వచ్చాయి.

విఆర్.పురం మండలం రేఖపల్లి గ్రామంలోని తహశీల్దార్ కార్యాలయ పరిసరాల్లో ఏర్పాటు చేసిన పునరావాస కేంద్రాల్లో ధర్మతాళగూడెం, ఒడ్డుగూడెం, ఒడ్డుగూడెం కాలనీ వాసులు ఉన్నారు. వారంతా అక్కడకు వచ్చి మూడు రోజులు అవుతున్నా కందిపప్పు, కూరగాయలు, బియ్యం వంటివి ప్రభుత్వం ఇవ్వలేదు. ఆ ప్రాంతంలో కొంతమంది బాధితులు పాకలు వేసుకోగా వాటిపైకి టార్పాలిన్లు అందించలేదు. దీంతో, రూ.2 వేలు ఖర్చు పెట్టి కొంతమంది టార్పాలిన్లు వేసుకోగా, డబ్బులులేని కారణంగా కొంతమంది చిరిగిపోయిన టార్పాలిన్లనే ఆ పాకలపై వేసుకుని రోజులు నెట్టుకొస్తున్నారు. రాత్రి వేళల్లో వారికి కంటిమీద కునుకు ఉండడం లేదు. దోమలు విపరీతంగా కుడుతున్నాయని, ఎప్పుడు ఏ విష పురుగు వచ్చి కరుస్తుందోనని భయపడుతూ బతుకుతున్నామని పలువురు వాపోయారు. జ్వరంతో ఆయాచోట్ల కొంతమంది బాధపడుతుండగా వారికి అధికారులు, నర్సులు టాబ్లెట్లు మాత్రమే ఇచ్చి చేతులు దులుపుకుంటున్నారు. పాలు, రొట్టె వంటివి కూడా అందివ్వలేదని పలువురు తెలిపారు.



చింతూరు మండలం ఎర్రంపేట ఏపిఆర్ పాఠశాలలో ఏర్పాటు చేసిన పునరావాస కేంద్రంలో బాధితులు

చింతూరు మండలంలోని శబరి ఒడ్డు ప్రాంత వాసులను అధికారులు హడావుడిగా ఎర్రంపేటలోని ఏపిఆర్ పాఠశాలలో ఏర్పాటు చేసిన పునరావాస కేంద్రానికి తరలించారు. 'మేమంతా పునరావాస కేంద్రానికి వచ్చి మూడు రోజులు కావొస్తున్నా ఎవ్వరూ పట్టించుకోవడం లేదు. మరుగుదొడ్డు శుభ్రంగా లేకపోవడంతో మహిళలం ఇబ్బందిపడుతున్నాం. ప్రతి సంవత్సరం వరదల సమయంలో మా పరిస్థితి ఇలాగే ఉంటోంది. సోమవారం మా వద్దకు వచ్చిన జిల్లా కలెక్టర్ దినేష్‌కుమార్‌కు మా బాధలు చెప్పుకున్నాం.

సాధ్యమైనంత త్వరగా పోలవరం ప్యాకేజీ, పునరావాసం కల్పించి బాధల నుంచి విముక్తి కల్పించండని ఆయనను వేడుకున్నాం' అని శబరిఒడ్డు ప్రాంతానికి చెందిన నర్రెడ్డి పార్వతి తెలిపారు. దాదాపు అక్కడ ఉంటున్న బాధితులు అందరి పరిస్థితి ఇలాగే ఉంది. కూనవరం మండలంలోని బాధితులకు కోతులగుట్టలో పునరావాస కేంద్రం ఏర్పాటు చేశారు. అక్కడ ఉంటున్నవారికి రెండు నెలలకు సరిపడా బియ్యం అధికారులు అందించారు. బుధవారం నిత్యావసరాలు, టార్పాలిన్లు అందిస్తామని చెబుతున్నారు.

జ్వరంతో బాధపడుతున్నా పట్టించుకోవడం లేదు

కస్తూర్బా విద్యాలయం వద్ద మాకు పునరావాస కేంద్రం ఏర్పాటు చేశారు. ఇక్కడకు వచ్చి రెండు రోజులవుతోంది. జ్వరంతో బాధపడుతున్నాను. ఇంతవరకూ డాక్టర్ వచ్చి చూడలేదు. నర్సులు టాబ్లెట్లు ఇస్తున్నా జ్వరం తగ్గడం లేదు. కనీసం పాలు, రొట్టె వంటివి కూడా ఇవ్వడం లేదు.

-సొంది రమాదేవి, ధర్మతాల గూడెం, విఆర్.పురం మండలం

ఆకలితో అలమటిస్తున్నాం



రేఖపల్లిలోని తహశీల్దార్ కార్యాలయం పక్కనున్న మైదాన ప్రాంతంలో పాకలు వేసుకున్నాం. మూడు రోజులు అవుతున్నా ఎవరూ సాయం అందించలేదు. ఇల్లు వదిలేసి, పిల్లాజెల్లతో కట్టుబట్టలతో ఇక్కడకు వచ్చేశాం. ఆకలితో కడుపు మాడుతోంది. అధికారులకు మా కష్టం పట్టడం లేదు.

-కొట్ల సత్యనారాయణ, ఒడ్డుగూడెం, విఆర్.పురం మండలం

కుళ్లిన కూరగాయలు ఇచ్చారు

ఎపిఆర్‌జెసి కళాశాలలో ఏర్పాటు చేసిన పునరావాస కేంద్రంలో ఉంటున్నాం. కేవలం మనుషులు మాత్రమే సెంటర్‌లో ఉండాలని, ఎటువంటి సామాన్లూ తీసుకురావద్దని అధికారులు చెబుతున్నారు. మంచం, కంచం, బట్టలు వంటివి ఏమీ లేకుండా వచ్చి ఎలా ఉండగలం. ఒక్కో గదిలో ఐదారు కుటుంబాల వారిని ఉంచారు. ఒక నెల బియ్యం, కుళ్లిపోయిన కూరగాయలు ఇచ్చి అధికారులు చేతులు దులుపుకున్నారు.

-అనుమోల మీనా, చింతూరు మెడికల్ కాలనీ



ముంపు ప్రాంతాన్ని పరిశీలిస్తున్న సిపిఎం నేతలు

అధికారుల నిర్లక్ష్యం వల్లే గోస్తనీకి గండి

- నష్టపోయిన రైతాంగాన్ని ఆదుకోవాలి : సిపిఎం

ప్రజాశక్తి - పాలకోడేరు

పశ్చిమగోదావరి జిల్లా పాలకోడేరు మండలం మోగల్లు శివార్లలో గోస్తని నదికి గండిపడడానికి కారణం అధికారుల నిర్లక్ష్యమేనని సిపిఎం పశ్చిమగోదావరి జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు జెఎన్‌వి.గోపాలన్ విమర్శించారు. అధికారుల తప్పిదం వల్ల 300 ఎకరాలు పూర్తిగా నీట మునిగాయని, దీంతో రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారని తెలిపారు. గోస్తనీ గండి పడిన ప్రాంతాన్ని మంగళవారం సిపిఎం మండల కార్యదర్శి శేషపు అశ్రియ్య, మండల కమిటీ సభ్యులు పాలా వెంకటస్వామితో కలిసి ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ముంపు బాధిత రైతులు తమ కష్టాలను బృందం దృష్టికి తీసుకొచ్చారు. గోస్తని గట్టుపై జలీవల మట్టి ట్రాక్టర్లు రాకపోకలు సాగించాయని, దీంతో గట్టు దెబ్బతిందని తెలిపారు. ఇప్పటికే వేలాది రూపాయలు పెట్టుబడులు పెట్టామని, పంట అంతా నీటిపాలైందని రైతులు వాపోయారు. ఈ సందర్భంగా గోపాలన్ మాట్లాడుతూ.. ఎకరాకు రూ.10 వేల నుంచి రూ.15 వేల వరకు రైతులు పెట్టుబడి పెట్టారని, పెట్టుబడి అంతా నీటిపాలైందని అన్నారు. అధికారులు తక్షణం స్పందించి నష్టపోయిన రైతాంగాన్ని ఆదుకోవాలని డిమాండ్ చేశారు.

భీమవరం డ్రెయినేజ్ ఇఇ కిషోర్ సస్పెన్షన్

భీమవరం డివిజన్ డ్రెయినేజ్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ ఎంవిఐ.కిషోర్‌పై సస్పెన్షన్ వేటు పడింది. మోగల్లు శివార్లలో గోస్తని డ్రెయిన్‌కు గండి పడడానికి కిషోర్ పర్యవేక్షణ లోపంతోపాటు వరద సమయంలో ముందస్తు చర్యలు తీసుకోకుండా బాధ్యతారాహిత్యంగా వ్యవహరించినందుకుగాను సస్పెండ్ చేస్తూ కలెక్టర్ చదలవాడ నాగరాణి ఉత్తర్వులు జారీ చేశారు.

ఆన్‌లైన్‌లో అక్టోబర్ శ్రీవారి దర్శన టికెట్లు

ప్రజాశక్తి - తిరుమల

అక్టోబర్ నెలకు సంబంధించిన శ్రీవారి దర్శన టికెట్లు మంగళవారం టిటిడి విడుదల చేసింది. ఉదయం 10 గంటలకు అంగప్రదక్షణ టోకెన్లు, 11 గంటలకు శ్రీవాణి దర్శన టికెట్లను ఆన్‌లైన్‌లో అందుబాటులో ఉంచింది. మధ్యాహ్నం మూడు గంటలకు వయోవృద్ధులు, వికలాంగుల దర్శన టికెట్లు విడుదల చేసింది. బుధవారం ఉదయం పది గంటలకు రూ.300 ప్రత్యేక ప్రవేశ దర్శన టికెట్లు విడుదల చేయనుంది.

లడ్డూ తయారీలో నెయ్యి నాణ్యత పెంచుతాం : టిటిడి ఇఒ

ప్రజాశక్తి - తిరుమల

శ్రీవారి లడ్డూ తయారీలో వాడే నెయ్యి నాణ్యత పెంచాలని నిర్ణయించినట్లు టిటిడి ఇఒ శ్యామలరావు తెలిపారు. సర్టిఫికేషన్ ఉన్న సంస్థల్లో కటాఫ్ క్వాలిటీతో తయారుచేసిన నెయ్యిలో నాణ్యత లేదని, వెజిటబుల్ ఫ్యాట్ కలిసిందని ఎన్ఎబిఎల్ పరీక్షల్లో గుర్తించామన్నారు. త్వరలో అధునాతన ల్యాబ్ ఏర్పాటు చేస్తామని తెలిపారు. నెయ్యి నాణ్యత పరీక్షించేందుకు డెయిరీ ఫీల్డ్ నిపుణులతో కమిటీ ఏర్పాటు చేసినట్లు చెప్పారు. నాణ్యత లేని నెయ్యి పంపిణీ చేసిన దిండిగల్‌కు చెందిన కాంట్రాక్టర్‌ను బ్లాక్‌లిస్ట్‌లో పెట్టామన్నారు. కొత్తగా నెయ్యి సరఫరాకు టెండర్లు పిలవాల్సి ఉందని మీడియాకు వివరించారు.

కంచి బందార్లపల్లి దత్తత

- గుడిపల్లిలో నారా భువనేశ్వరి వెల్లడి

ప్రజాశక్తి - గుడిపల్లి (చిత్తూరు జిల్లా)

కుప్పం నియోజకవర్గం గుడిపల్లి మండలం కంచిబందార్లపల్లిని దత్తత తీసుకుని, ఎన్‌టిఆర్ ట్రస్టు ద్వారా మౌలిక సమస్యలను పరిష్కరిస్తామని సిఎం చంద్రబాబునాయుడు సతీమణి నారా భువనేశ్వరి అన్నారు. చంద్రబాబుకు భారీ మెజార్టీనిచ్చిన గ్రామాలను దత్తత తీసుకుంటామన్ని ఎన్నికల ప్రచారంలో భాగంగా గతంలో నారా భువనేశ్వరి హామీ ఇచ్చారు. ఈ నేపథ్యంలో నాలుగు రోజుల పర్యటనలో భాగంగా కుప్పం నియోజకవర్గానికి విచ్చేసిన ఆమె మంగళవారం సాయంత్రం గుడిపల్లి మండలం, గుండ్లసాగరం పంచాయతీ గుత్తార్లపల్లి, చీకటిపల్లి పంచాయతీ కోటపల్లిల్లో పర్యటించారు. చంద్రబాబు నాయుడు సిఎం అయిన తరువాత తొలిసారిగా కుప్పం నియోజకవర్గానికి విచ్చేసిన ఆమెకు ఘన స్వాగతం లభించింది. గతంలో ఇచ్చిన హామీ ప్రకారం టిడిపి అత్యధిక మెజార్టీ వచ్చిన గ్రామాల్లో ఆమె పర్యటించనున్నారు. ఈ పర్యటనలో రాయలసీమ పట్టభద్రుల ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్, పార్టీ అధ్యక్షులు టిఎం బాబునాయుడు పాల్గొన్నారు.

సిడబ్ల్యుసిపైనా పోలవరం పూర్తి బాధ్యత

- మంత్రి రామానాయుడు

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

పోలవరం ప్రాజెక్టు నిర్మాణం పూర్తి చేయాల్సిన బాధ్యత సిడబ్ల్యుసిపై కూడా ఉందని రాష్ట్ర జలవనరులశాఖ మంత్రి నిమ్మల రామానాయుడు అన్నారు. మంగళవారం నాడిక్కడ సెంట్రల్ వాటర్ కమిషన్ (సిడబ్ల్యుసి) ఛైర్మన్ కుష్వేందర్ వోహ్రాతో రాష్ట్ర మంత్రి నిమ్మల రామానాయుడు సమావేశమయ్యారు. ఈ సందర్భంగా పోలవరం నిర్మాణం, డిజైన్స్ వంటి అంశాలపై చర్చించారు. అనంతరం మంత్రి రామానాయుడు మీడియాతో మాట్లాడుతూ.. ఈ సీజన్ నష్టపోకుండా కనీసం వర్షా కాలం దాటిన తరువాత అయినా పనులు ప్రారంభించుకునేందుకు వెంటనే అనుమతినివ్వాలని కోరారు. పోలవరం పూర్తయితే, 7,20,000 ఎకరాలకు నీటిని అందించవచ్చని అన్నారు. ఏడాది జాప్యం జరిగితే రూ.2 వేల కోట్లు నష్టం వాటిల్లుతోందని అన్నారు. నీరంతా వృథాగా సముద్రంలోకి వెళ్తుందని అన్నారు. ఎక్కడా రాజీ పడకుండా డిజైన్స్ అన్నింటినీ ఇచ్చి సీజన్ నష్టపోకుండా పోలవరం ముందుకు తీసుకెళ్లాలని ప్రయత్నిస్తున్నామని అన్నారు. పోలవరం జాతీయ ప్రాజెక్టు కచ్చితంగా పూర్తి చేయాల్సిన బాధ్యత సిడబ్ల్యుసి మీద కూడా ఉందని చెప్పారు. కేంద్ర బడ్జెట్‌లో అమరావతికి రూ.15 వేల కోట్లు కేటాయించడం సంతోషంగా ఉందని, జగన్‌మోహన్‌రెడ్డి ఢిల్లీకి రావడం తప్ప చేసింది ఏమీ లేదని ఎద్దేవా చేశారు. జగన్ బెయిల్ కోసం, లేకపోతే ఆయన కేసులు నిమిత్తం మాత్రమే ఢిల్లీకి వచ్చేవారని, సిఎంగా చంద్రబాబు బాధ్యతలు తీసుకున్న 30 రోజుల్లోనే రెండుసార్లు ఢిల్లీకి వచ్చి ప్రధాన మంత్రిని కలిశారని తెలిపారు.

రెన్యువల్ చేయాలని సిఆర్‌టిల రిలే నిరాహార దీక్షలు

ప్రజాశక్తి - పార్వతీపురం రూరల్

ఈ విద్యా సంవత్సరం గడిచి నెల రోజులు కావస్తున్నా తమను రెన్యువల్ చేయకపోవడం తగదని తమకు వెంటనే రెన్యువల్ చేయాలని డిమాండ్ చేస్తూ మంగళవారం పార్వతీపురం మన్యం జిల్లా ఐటిడిఎ ఎదుట యుటిఎఫ్ ఆధ్వర్యంలో సిఆర్‌టిలు రిలేనిరాహార దీక్షలను ప్రారంభించారు. ఈ సందర్భంగా యుటిఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్ మురళీ మోహనరావు మాట్లాడుతూ ఈ ఏడాది రెన్యువల్స్‌లో జిపిఎస్ పాఠశాలలో పదిలోపు విద్యార్థులున్న పాఠశాలకు ఒక్క సిఆర్‌టిని కూడా కేటాయించలేదన్నారు. పాఠశాలలు తెరిచి 40 రోజులు కావస్తున్నా ఒక్క టీచర్ లేకపోవడం దారుణమన్నారు. గతేడాది పనిచేసిన సిఆర్‌టి పోస్టులన్నింటికీ ఆర్థిక అనుమతి ఉన్నప్పటికీ ఎస్‌జిటిలకు ఇంకా నియామకాలు జరగలేదన్నారు. డిఎస్‌సి నుంచి మినహాయింపు కోరుతూ కొంతమంది సిఆర్‌టిలు హైకోర్టుకు వెళ్లారని, వీరికి అనుకూలంగా కోర్టు ఉత్తర్వులు ఇచ్చిందని, ఈ కౌన్సెలింగ్‌లో కోర్టుకు వెళ్లని వారికి మాత్రమే నియామకాలు ఇచ్చారని అన్నారు. ఈ సమస్యపై పరిష్కారం కోరుతూ సోమవారం రాత్రి 12 గంటల వరకు నిరసన చేపట్టినా అధికారుల నుండి ఎలాంటి స్పందనా లేదని పేర్కొన్నారు. దీంతో రిలే నిరాహారదీక్షలు చేపట్టినట్టు తెలిపారు. దీక్షలకు సంఘీభావం తెలిపిన సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు రెడ్డి వేణు మాట్లాడుతూ ప్రభుత్వానికి లేని అభ్యంతరాన్ని ఐటిడిఎ అధికారులు చూపడం సిఆర్‌టిల వద్ద ఆర్థికంగా ఏదో ఆశించడమేనని, ఇలాంటి చర్యలను తమ సంఘం పూర్తిగా ఖండిస్తుందని అన్నారు. అధికారులు వెంటనే స్పందించి సిఆర్‌టిలకు న్యాయం చేయాలని కోరారు. లేదంటే ఆందోళనలను తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు.



రహదారిపై నాట్లు వేస్తూ నిరసన తెలుపుతున్న సిపిఎం నాయకులు, కార్యకర్తలు

అంతర్రాష్ట్ర రోడ్డుపై వరి నాట్లు

- సిపిఎం ఆధ్వర్యాన వినూత్న నిరసన

ప్రజాశక్తి -కొమరాడ (విజయనగరం)

అధ్వానంగా ఉన్న రోడ్లను బాగు చేయాలని కోరుతూ సిపిఎం ఆధ్వర్యాన వినూత్న రీతిలో నిరసన తెలిపారు. విజయనగరం కొమరాడ మండలం గుమడ వద్ద మంగళవారం అంతర్రాష్ట్ర రహదారి గోతిలో ఉన్న వర్షపు నీటిలో ట్రాక్టర్‌తో దమ్ముపట్టి, వరి నాట్లు నాటారు. ఈ సందర్భంగా సిపిఎం నాయకులు కొల్లి సాంబమూర్తి మాట్లాడుతూ వెంటనే రోడ్లు, భవనాల శాఖ అధికారులు ప్రతిపాదన పెట్టిన రూ.కోటీ 70 లక్షలు విడుదల చేసి ఈ రోడ్డును బాగు చేయాలని, అటు వానదారుల, ఇటు ప్రయాణికుల ప్రాణాలు కాపాడాలని కోరారు. మూడేళ్లుగా ఈ రోడ్డుపై ఏర్పడిన గొయ్యిలను కప్పడానికి ఆర్అండ్‌బి అధికారుల వద్ద డబ్బుల్లేకపోవడం దారుణమన్నారు. ఇప్పటికైనా రోడ్డు మరమ్మతు పనులు చేపట్టకపోతే భవిష్యత్తులో పెద్ద ఎత్తున ఆందోళన చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో సిఐటియు నాయకులు ఉమామహేశ్వరరావు, యమక గౌరునాయుడు, గుమడకు చెందిన యువకులు పాల్గొన్నారు.

ఫైళ్ల దహనం కేసులో విచారణ ముమ్మరం

- సబ్ కలెక్టరేట్‌కు చేరుతున్న రికార్డులు
- డిఆర్‌ఒ, 5 బృందాలు పరిశీలన
- పెద్దిరెడ్డి అనుచరుల ఇళ్లలో సోదాలు

ప్రజాశక్తి- మదనపల్లె అర్బన్

అన్నమయ్య జిల్లా మదనపల్లె సబ్ కలెక్టరేట్‌లో ఫైల్స్ దహనం కేసును పోలీసులు, రెవెన్యూ అధికారులు వేగవంతం చేశారు. కుట్రకోణంపై పోలీసులు ఇప్పటికే నిర్ధారణకు వచ్చారు. రెవెన్యూ శాఖకు సంబంధించిన కీలక పత్రాలు, వివిధ రకాల భూములకు చెందిన కీలక డాక్యుమెంట్లు ఆదివారం దగ్ధమైన విషయం విదితమే. ఈ సంఘటనను తీవ్రంగా పరిగణించిన రాష్ట్ర ప్రభుత్వం సమగ్ర దర్యాప్తులో భాగంగా రెండో రోజు మంగళవారం విచారణను మరింత వేగవంతం చేసింది. జిల్లా రెవెన్యూ అధికారి (డిఆర్‌ఒ) సత్యనారాయణరావు ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఐదు బృందాలకు చెందిన అధికారులు మదనపల్లె రెవెన్యూ డివిజన్‌లోని 11 మండలాల్లో ఏప్రిల్ 4, 2022 నుంచి భూములకు సంబంధించి ఎలాంటి లావాదేవీలు జరిగాయి? ఏ రికార్డులు ఎక్కడి నుంచి ఎక్కడికి వెళ్లాయి? ఏయే భూములు వాస్తవ పొజిషన్ నుంచి సెటిల్‌మెంట్ ల్యాండ్ కిందకు మారాయి? తదితర వివరాలను క్షుణ్ణంగా పరిశీలిస్తున్నారు. ఏయే రికార్డులు తారుమారయ్యాయి? ఏ రికార్డులు కాలిపోయాయి? తదితర వివరాలతో పూర్తి స్థాయి నివేదికను బుధవారం సాయంత్రానికి డిఆర్‌ఒ సత్యనారాయణరావు కలెక్టర్ నివేదించనున్నారు.

పెద్దిరెడ్డి అనుచరులను విచారిస్తున్న అధికారులు

మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి అనుచరుల ఇళ్లలో అధికారులు సోదాలు నిర్వహించారు. పెద్దిరెడ్డికి మదనపల్లెకు చెందిన రైస్ మిల్లు యజమాని మాధవరెడ్డి, నిమ్మనపల్లె జడ్‌పిటిసి సభ్యులు ప్రమీల భర్త వెంకటరమణారెడ్డి బినామీలుగా ఉన్నారని నిర్ధారణకు వచ్చినట్లు సమాచారం. వీరిరువురూ ఐదేళ్ల వైసిపి పాలనలో రూ.వందల కోట్లు విలువైన భూములు దోచుకోవడమే కాకుండా అధికారాన్ని, అధికారులను అడ్డం పెట్టుకొని ప్రభుత్వం నుంచి భూ నష్టపరిహారం కింద రూ.కోట్లు కొల్లగొట్టినట్లు విచారణలో వెల్లడైనట్లు సమాచారం. ఈ నేపథ్యంలో రెవెన్యూ అధికారులు మదనపల్లెలోని వారి ఇళ్లలో పటిష్ట బందోబస్తు మధ్య రికార్డులను పరిశీలిస్తున్నారు. వారిద్దరినీ సబ్ కలెక్టర్ కార్యాలయానికి తీసుకొచ్చి విచారిస్తున్నారు. రెవెన్యూ అధికారులు మాధవరెడ్డి ఇంట్లో నుంచి కంప్యూటర్లు, హార్డ్ డిస్కులు, కొన్ని కీలక డాక్యుమెంట్లను స్వాధీనం చేసుకొని సబ్ కలెక్టర్ కార్యాలయానికి తరలించారు. ఆయన ఇంట్లో సుమారు 20 మంది రెవెన్యూ సిబ్బంది విస్తృత తనిఖీలు చేస్తున్నారు. సబ్ కలెక్టరేట్ దహనం ఘటనలో మాధవరెడ్డి పాత్ర ఏమైనా ఉందా? అనే కోణంలో కూడా పోలీసులు విచారణ చేస్తున్నారు.



సబ్ కలెక్టర్ కార్యాలయానికి రికార్డులు చేరవేస్తున్న రెవెన్యూ సిబ్బంది



మదనపల్లె రైస్‌మిల్ మాధవరెడ్డి



నిమ్మనపల్లె జడ్‌పిటిసి భర్త వెంకటరమణారెడ్డి

సబ్ కలెక్టరేట్‌ను పరిశీలించిన స్పెషల్ సిఎస్

మదనపల్లె సబ్ కలెక్టరేట్‌ను స్పెషల్ చీఫ్ సెక్రెటరీ (రెవెన్యూ) సిసోడియా మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సబ్ కలెక్టరేట్ తగలబడడంపై పూర్తి స్థాయిలో విచారణ చేపడతామని, బాధ్యులపై చర్యలు తీసుకుంటామని చెప్పారు. కాలిపోయిన ఫైళ్లను పరిశీలించిన అనంతరం సబ్ కలెక్టరేట్ చుట్టు పక్కల, ఆర్‌డిఒ కార్యాలయ వెలుపలి వైపు, చుట్టూ ప్రహరీని పరిశీలించారు. ఆయన వెంట అన్నమయ్య, చిత్తూరు, తిరుపతి జిల్లాల కలెక్టర్లు శ్రీధర్ చామకూరి, సుమిత్ కుమార్, డాక్టర్ వెంకటేశ్వర్లు, ట్రాన్స్‌కో జెఎండి చక్రధర్‌బాబు, ఎస్‌పి విద్యాసాగర్ నాయుడు తదితరులు ఉన్నారు.

**పారదర్శకంగా దర్యాప్తు నిర్వహించాలి
సిపిఎం ఆధ్వర్యాన రాస్తారోకో**

ఫైల్స్ దగ్ధం కేసులో దర్యాప్తు పారదర్శకంగా నిర్వహించాలని కోరుతూ సిపిఎం ఆధ్వర్యాన స్థానిక కదిరి రోడ్డులో రాస్తారోకో నిర్వహించారు. 'నిందితులను వదలొద్దు, అమాయకులను బలి చేయొద్దు' అంటూ నినాదాలు చేశారు. ఈ సందర్భంగా సిపిఎం అన్నమయ్య జిల్లా కార్యదర్శి పి.శ్రీనివాసులు మాట్లాడుతూ సమగ్ర విచారణ జరిపి, వాస్తవాలను ప్రజలకు బహిర్గతం చేయాలని డిమాండ్ చేశారు. 22 'ఎ' విభాగం అధికారిగా ఉన్న గౌతమ్ తేజ ఆదివారమైనా రాత్రి 11 గంటల వరకు కార్యాలయంలోనే ఉండడం, కీలకమైన 22 'ఎ' విభాగం, తపాలా విభాగంలో మాత్రమే ఫైళ్లు, డాక్యుమెంట్లు పూర్తిగా కాలిపోవడంపై పలు అనుమానాలు కలుగుతున్నాయని తెలిపారు. ఈ రాస్తారోకోలో సిపిఎం నాయకులు హరిశర్మ, నాగరాజు, ప్రభాకర్, రమణ, సురేంద్ర తదితరులు పాల్గొన్నారు.



వరద బాధితులను పరామర్శిస్తున్న సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు వి.వెంకటేశ్వర్లు, తదితరులు

వరద బాధితులను ఆదుకోవాలి : సిపిఎం

ప్రజాశక్తి - అల్లూరి జిల్లా

ప్రతిఏటా ముంపునకు గురవుతున్న పోలవరం నిర్వాసితులకు పరిహారం, పునరావాసం కల్పించేంతవరకూ వరదల సమయంలో ఉండేందుకు శాశ్వత షెడ్లు నిర్మించాలని సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు వి వెంకటేశ్వర్లు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బాధితులకు తక్షణం నిత్యావసరాలు, కిరోసిన్, టార్పాలిన్లు ఇవ్వాలని కోరారు. అల్లూరి జిల్లా కూనవరం మండలం పంద్రాజుపల్లి వద్ద మెయిన్ రోడ్డులో పాకలు వేసుకున్న శబరి కొత్తగూడెం వరద బాధితులను మంగళవారం పార్టీ నాయకులతో కలిసి ఆయన పరామర్శించారు. వరద బాధితుల పట్ల ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరించడం దారుణమన్నారు. కార్యక్రమంలో పార్టీ ఎఎస్ఆర్ రంపచోడవరం జిల్లా కార్యదర్శి బొప్పెన కిరణ్, జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు లోతా రామారావు పాల్గొన్నారు. విఆర్ పురం, ఎటపాక, చింతూరు మండలాల్లోని వరద బాధిత ప్రాంతాల్లో సిపిఎం నాయకులు పర్యటించారు.

నరసాపురం ఎంపిడిఒ మృతదేహం లభ్యం

- అదృశ్యం ఘటన విషాదాంతం

ప్రజాశక్తి - విజయవాడ, కంకిపాడు



ఎంపిడిఒ
వెంకట రమణారావు

పశ్చిమగోదావరి జిల్లా నరసాపురం ఎంపిడిఒ మండవ వెంకట రమణారావు అదృశ్యం ఘటన విషాదాంతమైంది. ఆయన మృతదేహం విజయవాడ ఏలూరు కాల్వలో మంగళవారం లభ్యమైంది. ఈ నెల 15న ఆయన అదృశ్యమమైన విషయం తెలిసిందే. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు పోలీసులు విచారణ చేపట్టారు. ఏలూరు కాల్వలో దూకి ఉంటారనే అనుమానంతో ఎనిమిది రోజులుగా ఎన్‌డిఆర్‌ఎఫ్ బృందాలు, పెనమలూరు పోలీసులు గాలింపు చర్యలు చేపట్టాయి. చివరకు ఆయన మొబైల్ లోకేషన్ మిస్సైన ప్రాంతానికి 300 మీటర్ల దూరంలోని ఏలూరు కాల్వలో మృతదేహం లభ్యమైంది. మధురానగర్ ఫ్లై ఓవర్ పిల్లర్ వద్ద తూటి కాడ మధ్య చిక్కుకుని ఉన్న మృతదేహాన్ని ఎన్‌డిఆర్‌ఎఫ్ సిబ్బంది గుర్తించి వెలికితీశారు. పోస్టుమార్టం నిమిత్తం విజయవాడ ప్రభుత్వాస్పత్రికి మృతదేహాన్ని తరలించారు. కానూరులోని శ్మశాన వాటికలో అంత్యక్రియలు నిర్వహించారు.

బకాయిల విషయంతో ఒత్తిడికి గురయ్యారు : కృష్ణాజిల్లా ఎస్‌పి

ప్రాథమిక దర్యాప్తు మేరకు మాధవాయిపాలెం ఫెర్రీ విషయంలో రూ.55 లక్షల బకాయి విషయంలో వెంకట రమణరావు తీవ్ర ఒత్తిడికి గురైనట్లు తెలిసిందని కృష్ణా జిల్లా ఎస్‌పి తెలిపారు. రమణారావుకు కొన్ని నంబర్ల నుంచి కాల్స్ వచ్చాయని, ఆ కాల్స్ విషయంలోనూ తీవ్ర ఒత్తిడికి గురై కొంత డబ్బును కూడా ఆ కాలర్ల బ్యాంక్ అకౌంట్లలో జమ చేసినట్లు తెలిసిందన్నారు. వీటిపై పూర్తి స్థాయి దర్యాప్తు చేస్తున్నామని ఎస్‌పి ఆర్ . గంగాధర్‌రావు తెలిపారు.

తీర ప్రాంతాన్ని ధ్వంసం చేయొద్దు

- సిజెడ్‌ఎంపి నోటిఫికేషన్‌పై ప్రజాభిప్రాయ సేకరణలో పార్టీలు, ప్రజా సంఘాల నాయకులు, మత్స్యకారులు

ప్రజాశక్తి - అనకాపల్లి

'ప్రజాభిప్రాయ సేకరణ అంటే సంబంధిత ప్రజలు, బాధితుల మధ్య జరగాల్సిన ప్రక్రియ. ఆ ప్రాంతంలోనే అభిప్రాయాలను సేకరించాలి. ఆరు మండలాలకు చెందిన 145 మత్స్యకార గ్రామాలకు చెందిన అంశాన్ని నాలుగు గోడల మధ్య బాధితులు లేకుండా చేపట్టారు' అని పలు పార్టీల, ప్రజా సంఘాల నాయకులు, మత్స్యకారులు మండిపడ్డారు. అనకాపల్లి జిల్లా కలెక్టరేట్‌లో సిజెడ్‌ఎంపి నోటిఫికేషన్‌పై ప్రజాభిప్రాయ సేకరణ చేపట్టడంపై వారు భగ్గుమన్నారు. 'తీర ప్రాంత సంబంధిత డ్రాఫ్ట్ కోస్టల్ జోన్ నోటిఫికేషన్ - 2019' ఖరారు నిమిత్తం అనకాపల్లి కలెక్టరేట్‌లో కలెక్టర్ విజయ కృష్ణన్ అధ్యక్షతన ఆంధ్రప్రదేశ్ కోస్టల్ జోన్ మేనేజ్‌మెంట్ అథారిటీ, భారత పర్యావరణ అటవీ వాతావరణ మంత్రిత్వ శాఖ, ఎపి కాలుష్య నియంత్రణ మండలి (విశాఖపట్నం) ఆధ్వర్యంలో పర్యావరణ సంబంధిత ప్రజాభిప్రాయ సేకరణ జరిగింది. 145 గ్రామాల నుంచి వాస్తవ మత్స్యకారులుగానీ, ఆయా గ్రామాలకు చెందిన వారుగానీ కనీసం పది మంది కూడా హాజరు కాకుండానే అధికారులు ఈ కార్యక్రమం ఏర్పాటు చేసేశారు. సిపిఎం జిల్లా కార్యదర్శి కె.లోకనాథం మాట్లాడుతూ... రాజ్యాంగం 73, 74 ఆర్టికల్ ప్రకారం ప్రజాభిప్రాయ సేకరణ ప్రజల మధ్య చేపట్టాలని, పంచాయతీ తీర్మానం తీసుకోవాలని వివరించారు. తీర ప్రాంతంలో నెలకొల్పిన ఫార్మా కంపెనీలు, పరిశ్రమలు వ్యర్థాలను సముద్రంలోకి ఇష్టారీతిన విడిచిపెడుతుండటంతో పర్యావరణ సమతుల్యత దెబ్బతింటోందన్నారు. ఎపి రైతు సంఘం జిల్లా కార్యదర్శి ఎం.అప్పలరాజు మాట్లాడుతూ.. ఉమ్మడి విశాఖ జిల్లాలో 175 కిలోమీటర్ల తీర ప్రాంతం ఉందని, మత్స్యకారుల నుంచి 5500 ఎకరాలు తీసుకొని నేటికీ 2013 భూ సేకరణ చట్టం ప్రకారం నష్టపరిహారం చెల్లించలేదన్నారు. సిపిఐ జిల్లా కార్యదర్శి బాలేపల్లి వెంకటరమణ మాట్లాడుతూ.. ప్రజాభిప్రాయ సేకరణ చేపట్టే ప్రతి గ్రామాన్నీ యూనిట్‌గా తీసుకోవాలన్నారు. మత్స్యకారుడు సిహెచ్.శివాజీ మాట్లాడుతూ.. తీర ప్రాంతంలో పెట్టిన ఫ్యాక్టరీల వల్ల దుర్గంధం వ్యాపించి గ్రామాల్లో జీవించలేని పరిస్థితి నెలకొందన్నారు.

ఎపి రైతు సంఘం జిల్లా కోశాధికారి గండి నాయన బాబు మాట్లాడుతూ.. ప్రభుత్వాలు తీర ప్రాంతాన్ని ధ్వంసం చేయడం తగదన్నారు. వైసిపి నాయకులు వీసం రామకృష్ణ మాట్లాడుతూ.. తీరంలో పరిశ్రమలు పెడుతున్నా స్థానికులకు ఉద్యోగాలు ఇవ్వడం లేదన్నారు. స్వచ్ఛంద సంస్థ నిర్వాహకులు రామారావు, చింతకాయల అమ్మోరు, దొరబాబు, కొప్పిశెట్టి వెంకటేష్, కందాల అమ్మోరు, తదితరులు పాల్గొన్నారు.

15 నాటికి రాష్ట్ర వ్యాప్తంగా అన్న క్యాంటీన్లు

- వచ్చే నెలాఖరుకు రాజధానిలో భవనాల నిర్మాణం పూర్తి
- రాజధానిలో పర్యటించిన మున్సిపల్ మంత్రి నారాయణ

ప్రజాశక్తి - తుళ్లూరు (గుంటూరు జిల్లా)



అధికారులతో మాట్లాడుతున్న మంత్రి నారాయణ

రాజధాని అమరావతిలో నిర్మాణంలో ఉన్న భవనాలను వచ్చే నెలాఖరుకు పూర్తి చేసి సిఎం చంద్రబాబుతో ప్రారంభింపజేస్తామని మున్సిపల్ శాఖ మంత్రి నారాయణ చెప్పారు. వచ్చేనెల 15 నాటికి రాష్ట్ర వ్యాప్తంగా అన్న క్యాంటీన్లను ఏర్పాటు చేస్తామన్నారు. రాజధాని అమరావతిలో సిఆర్‌డిఎ కమిషనర్ కె.భాస్కర్, స్థానిక ఎమ్మెల్యే టి.శ్రావణ్‌కుమార్‌తో కలిసి మంత్రి నారాయణ పర్యటించారు. అమరావతి స్మార్ట్‌సిటీలో భాగంగా నిర్మిస్తున్న భవనాలను, వెంకటపాలెంలో నిర్మాణంలో ఉన్న అంగన్‌వాడీ, ఈ-హెల్త్ సెంటర్, మందడంలో అంగన్‌వాడీ భవనాన్ని పరిశీలించారు. నిర్మాణాల పురోగతిపై అధికారులతో చర్చించారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ.. మున్సిపల్ శాఖ ద్వారా 203 అన్న క్యాంటీన్‌లు మంజూరవ్వగా వాటిల్లో 193 క్యాంటీన్లకు భోజనం సరఫరాకు సంబంధించిన టెండర్ల ప్రక్రియ పూర్తయిందని తెలిపారు. వంద రోజుల్లో కనీసం వంద అన్న క్యాంటీన్లు ప్రారంభించేలా చర్యలు చేపట్టామన్నారు. వీలైనంత త్వరగా అమరావతి ప్రాజెక్ట్‌ను పూర్తి చేస్తామని వివరించారు. రాజధానిలో 17 అంగన్‌వాడీ సెంటర్లు, 16 ఈ-హెల్త్ సెంటర్లు, 14 పాఠశాలలు, అన్ని సదుపాయాలతో కూడిన శ్మశాన వాటిక నిర్మిస్తున్నామని, వచ్చే నెలాఖరులోగా పనులన్నీ పూర్తిచేయాలని కాంట్రాక్టర్లకు ఆదేశాలిచ్చామని తెలిపారు. మంత్రి వెంట సిఆర్‌డిఎ అడిషనల్ కమిషనర్ కె.సింహాచలం, వివిధ శాఖల అధికారులు ఉన్నారు.

విద్యుదాఘాతంతో ముగ్గురు యువకుల మృత్యువాత

ప్రజాశక్తి-కనిగిరి(ప్రకాశం జిల్లా)

రోడ్డుపై పడి ఉన్న విద్యుత్తు వైర్లు తగిలి ముగ్గురు యువకులు మృత్యువాత పడ్డారు. ఈ ఘటన ప్రకాశం జిల్లా కనిగిరి మండలం పునుగోడు ఎస్‌టి కాలనీ సమీపంలో మంగళవారం చోటు చేసుకుంది. స్థానికుల వివరాల మేరకు.. కనిగిరి పట్టణం ఇందిరా కాలనీకి చెందిన కామినేని బాలాజీ (16), షేక్ నజీర్ ఖాన్ (16), దేవాంగనగర్‌కు చెందిన వీరమాచి గౌతమ్ కుమార్ (16) ముగ్గురు కలిసి ఒకే ద్విచక్రవాహనంపై పునుగోడు సమీపంలోని రిజర్వాయర్ చూసేందుకు బయలుదేరారు. పునుగోడు ఎస్‌టి కాలనీ సమీపంలో విద్యుత్తు వైరు తెగి రోడ్డుకు అడ్డంగా పడి ఉంది. ఆ వైరును గమనించకుండా యువకులు వెళ్లడంతో విద్యుత్ షాక్‌కు గురై అక్కడికక్కడే మరణించారు. బాలాజీ చిన్న చిన్న పనులు చేసుకుంటున్నారు. కనిగిరి పట్టణంలోని ఓ ప్రయివేటు కళాశాలలో గౌతమ్ కుమార్, నజీర్ ఖాన్ ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం చదువుతున్నారు.

'స్మైలెక్స్'లో కార్మికుడు మృతి

ప్రజాశక్తి - పరవాడ (అనకాపల్లి)

అనకాపల్లి జిల్లా పరవాడలోని జవహర్‌లాల్ నెహ్రూ ఫార్మాసిటీ స్మైలెక్స్ లేబొరేటరీ పరిశ్రమలో మంగళవారం జరిగిన ప్రమాదంలో కార్మికుడు మృతి చెందారు. తోటి కార్మికులు తెలిపిన వివరాల మేరకు.. మధ్యప్రదేశ్ రాష్ట్రానికి చెందిన కబీ రాజ్ సాహూ (59) స్మైలెక్స్‌లో ఫార్మా కార్మికుడిగా పని చేస్తున్నారు. కంపెనీలో రోజులాగే పనిచేస్తుండగా ప్రమాదవశాత్తు వాక్యూమ్ పంపు మోటారుపై రాజ్ సాహూ పడిపోవడంతో బలమైన గాయమై అక్కడికక్కడే మృతి చెందారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం విశాఖ కెజిహెచ్‌కు తరలించారు. ఫార్మాసిటీ స్టాఫ్ అండ్ వర్కర్స్ యూనియన్ (సిఐటియు) గౌరవాధ్యక్షులు గనిశెట్టి సత్యనారాయణ సంఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పరిశ్రమలో భద్రతా ప్రమాణాలు పాటించకపోవడం వల్ల ఇప్పటివరకు మూడు భారీ ప్రమాదాలు చోటుచేసుకున్నాయని తెలిపారు. ఆయా ప్రమాదాల్లో పెదగంట్యాడ, అనకాపల్లి ప్రాంతాలకు చెందిన కార్మికులు మృతిచెందారని గుర్తుచేశారు. తాజా ప్రమాదం నేపథ్యంలో కంపెనీపై సమగ్ర విచారణ జరిపి క్రిమినల్ చర్యలు తీసుకోవాలని, మృతుని కుటుంబానికి కోటి రూపాయల నష్టపరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు.

ప్రజాశక్తిపై స్పందన ఫోన్ : 9490099006

ప్రజల పత్రికకు ప్రజలే మార్గదర్శకులు. ప్రజాశక్తిలో మీకు నచ్చిన నచ్చని అంశాలను ఎప్పటికప్పుడు మా దృష్టికి తీసుకువస్తే మరింత పదును పెట్టుకోవడానికి వీలవుతుంది.

94900 99006 ఫోన్ నెంబర్‌కు ఆదివారం మినహా ప్రతి రోజూ మధ్యాహ్నం 12 నుంచి సాయింత్రం 6 గంటల మధ్య మీ అభిప్రాయాలు తెలియజేయవచ్చు. మీరు చెప్పేది క్లుప్తంగా సూటిగా పద్ధతిగా వుండాలి. ఇప్పటికే చాలా మంది పంపుతున్న విమర్శలు, సూచనలు మాకు బాగా ఉపయోగపడుతున్నాయి. వారందరికీ కృతజ్ఞతలు.
అభిప్రాయాలు పంపదలిస్తే..
స్పందన, ప్రజాశక్తి తెలుగు డైలీ, ప్రజాశక్తి భవనం-అమరరెడ్డి కాలనీ, అరవింద హైస్కూల్ దగ్గర, తాడేపల్లి, గుంటూరు జిల్లా - 522 501కు కానీ **editorprajasakthi@gmail.com**కు పంపవచ్చు.

సజ్జల, ఆళ్లపై కేసు లేదు

- టిడిపి ఆఫీసుపై దాడి కేసులో ప్రభుత్వం

ప్రజాశక్తి-అమరావతి

టిడిపి ప్రధాన కార్యాలయంపై 2021లో జరిగిన దాడి కేసులో మాజీ ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి, మాజీ సలహాదారు సజ్జల రామకృష్ణారెడ్డి ఇప్పటి వరకు నిందితులుగా లేరని రాష్ట్ర ప్రభుత్వం హైకోర్టుకు తెలియజేసింది. ఈ పరిస్థితుల్లో వారిని అరెస్టు చేసే ఆస్కారమే లేదని రాష్ట్ర ప్రభుత్వం తరపున సీనియర్ న్యాయవాదులు సిద్ధార్థ లూథ్రా, పోసాని వెంకటేశ్వర్లు చెప్పారు. తమకు ముందస్తు బెయిల్ ఇవ్వాలంటూ ఆళ్ల, సజ్జల వేర్వేరుగా వేసిన పిటిషన్లను జస్టిస్ విఆర్ కృపాసాగర్ మంగళవారం విచారణ జరిపారు. ఒకవేళ వారి పేర్లను కూడా కేసులో చేర్చే పరిస్థితి వస్తే న్యాయపరమైన ఉత్తర్వులు పొందేందుకు 3 రోజుల వ్యవధి ఇస్తామని న్యాయవాదులు పేర్కొన్నారు. దీనిపై న్యాయమూర్తి స్పందిస్తూ.. న్యాయ సాయం పొందేందుకు ఆళ్ల, సజ్జలకు ఐదు రోజుల సమయం ఇవ్వాలని ప్రభుత్వానికి ఆదేశాలు జారీ చేశారు. వారిద్దరి పిటిషన్లు పరిష్కారమైనట్లు ప్రకటించారు. ఇదే కేసులో ముందస్తు బెయిల్ కోరుతూ వైసిపి ఎమెల్సీలు లేళ్ల అప్పిరెడ్డి, తలశిల రఘురామ్, మాజీ ఎంపి నందిగం సురేష్, దేవినేని అవినాష్ ఇతరుల విషయంలో కఠిన చర్యలు తీసుకోవద్దన్న గత ఉత్తర్వులను మరోసారి పొడిగించారు. విచారణను ఆగస్టు రెండుకు వాయిదా వేశారు. చంద్రబాబు ఇంటి వద్ద గొడవ చేశారనే కేసులో జోగి రమేష్‌కు కూడా అదే తేదీ వరకు ఊరట లభించింది.

రఘురామిరెడ్డికి ముందస్తు బెయిల్

వైసిపికి చెందిన మైదుకూరు మాజీ ఎమ్మెల్యే శెట్టిపల్లి రఘురామిరెడ్డికి హైకోర్టు ఊరటనిచ్చింది. కడప జిల్లా, చాపాడు పోలీసులు నమోదు చేసిన హత్యాయత్నం, ఎస్‌సి, ఎస్‌టి కేసులో రఘురామిరెడ్డికి హైకోర్టు ముందస్తు బెయిల్ మంజూరు చేసింది. ఇప్పటికే పోలీసులు కోర్టులో చార్జిషీట్ కూడా దాఖలు చేశారని గుర్తు చేసింది.

'పోలవరం' ఆర్‌ఆర్‌పై స్పష్టత ఏదీ?

- గవర్నరు ధన్యవాద తీర్మానంపై పిడిఎఫ్

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో



పోలవరం ప్రాజెక్టులో నిర్వాసితుల ఆర్‌ఆర్ ప్యాకేజీపై గవర్నరు ప్రసంగంలో లేకపోవడం సరైందికాదని పిడిఎఫ్ ఎమ్మెల్సీ కెఎస్ లక్ష్మణరావు విమర్శించారు. మంగళవారం శాసనమండలిలో గవర్నరు ప్రసంగానికి ధన్యవాద తీర్మానంపై కెఎస్ లక్ష్మణరావు మాట్లాడారు. రాష్ట్రంలో గత ప్రభుత్వానికి భిన్నంగా అభివృద్ధిపై ముందుకెళ్తామని గవర్నరు ప్రసంగంలో చెప్పినా.. ఆచరణలో చాలా అంశాల్లో స్పష్టత లేదన్నారు. కూటమి ఎన్నికలకు ముందు చేసిన వాగ్దానాల అమలును పొందుపర్చలేదన్నారు. పోలవరం ప్రాజెక్టు కింద పునరావాసానికి చెందిన నిధులను కేంద్రం నుండి రాబట్టాలని కోరారు. అలాగే రాష్ట్రంలో కౌలురైతులకు సంబంధించి మాజీ సిఎం వైఎస్ జగన్ చేసిన చట్ట సవరణతో కౌలురైతులకు పూర్తిగా అన్యాయం జరుగుతుందన్నారు. రాజధాని అమరావతి రైతులకు న్యాయం చేయాలని కోరారు. అమరావతిలో తక్షణం శాశ్వత భవన నిర్మాణాలు చేపట్టాలన్నారు. గత ప్రభుత్వ హయాంలో సాగునీటి ప్రాజెక్టులన్నింటినీ అటకెక్కించారని, తక్షణం వాటి నిర్మాణాలను పూర్తి చేయాలన్నారు. రాష్ట్రంలో ప్రాథమిక విద్యను ధ్వంసం చేసేలా గత ప్రభుత్వం తెచ్చిన జిఓ నెంబర్ 117ను రద్దు చేయాలన్నారు. అలాగే ఉన్నత విద్యారంగాన్ని గాడిలో పెట్టేందుకు చర్యలు తీసుకోవాలని కోరారు. గత ప్రభుత్వం తరహాలో కాకుండా ఈ ప్రభుత్వమైనా ప్రజలకు జవాబుదారీగా వుండాలన్నారు.

వైసిపిది విధ్వంసకర పాలన : టిడిపి

2019 నుండి 2024 వరకు వైసిపి ప్రభుత్వం విధ్వంసకర పాలన రాష్ట్రానికి అందించిందని టిడిపి ఎమ్మెల్సీ సి రామచంద్రయ్య విమర్శించారు. ఐఎఎస్, ఐపిఎస్ అధికారులను కూడా దోషులను చేసేలా ఒత్తిళ్లకు గురిచేసిందని ఆరోపించారు. చంద్రబాబుపై నమ్మకంతో రైతులు 33 వేల ఎకరాల భూమిని ఇస్తే జగన్‌మోహన్‌రెడ్డి వచ్చి మూడు రాజధానుల పేరుతో విధ్వంసకర పాలన చేశారని విమర్శించారు. గవర్నరు ప్రసంగంలో 2019కు ముందు తర్వాత వున్న ప్రభుత్వాల తీరుపై స్పష్టంగా వివరించారని ఎమ్మెల్సీ పంచుమర్తి అనురాధ అన్నారు. రాష్ట్రాన్ని ఐదేళ్లలో వైఎస్ జగన్ దివాళా తీయించారని అని టిడిపి ఎమ్మెల్సీ బిటి నాయుడు అన్నారు.

విప్లవాత్మక మార్పులను ఎందుకు చెప్పరు : వైసిపి

గవర్నరు ప్రసంగాన్ని అబద్ధాలతో చెప్పించిన టిడిపి ప్రభుత్వం.. తమ ప్రభుత్వం తీసుకొచ్చిన విప్లవాత్మకమైన మార్పులపైనా చర్చించాలని వైసిపి ఎమ్మెల్సీ తూమాటి రామారావు డిమాండ్ చేశారు. గత ప్రభుత్వాన్ని నిందించడమే లక్ష్యంగా పెట్టుకున్నారు తప్ప వాస్తవాలు ప్రతిబింబించేలా లేదన్నారు. దేశంలోనే ఆదర్శంగా నిలిచిన సచివాలయ వ్యవస్థ, వలంటీర్ల వ్యవస్థ గురించి గవర్నరు ప్రసంగంలో ఎందుకు లేదని వైసిపి ఎమ్మెల్సీ వి రవీంద్ర ప్రశ్నించారు.

ధ్వంసమైన విద్యారంగం

- జిఓ 117ను రద్దు చేయాలి
- పిడిఎఫ్ ఎమ్మెల్సీ ఐ వెంకటేశ్వరరావు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

రాష్ట్రంలో గత ప్రభుత్వం విద్యారంగాన్ని ధ్వంసం చేసిందని పిడిఎఫ్ ఎమ్మెల్సీ ఐ వెంకటేశ్వరరావు విమర్శించారు. ఎన్నికలకు ముందు చేసిన వాగ్దానం మేరకు ప్రాథమిక విద్యను నిర్వీర్యం చేసిన జిఓ నెంబరు 117ను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. మంగళవారం శాసనసభా ఆవరణలోని మీడియా పాయింట్‌లో ఎమ్మెల్సీ ఐ వెంకటేశ్వరరావు మాట్లాడారు. గవర్నరు ప్రసంగంలో కేవలం ల్యాండ్ టైట్లింగ్ యాక్టు, పెన్షన్ల పెంపు, ఉచిత ఇసుక, అన్న క్యాంటీన్లు ఇలా కొన్నింటినే ప్రస్తావించారని, ఎన్నికలకు ముందు ప్రకటించిన మేనిఫెస్టోపై స్పష్టత లేదన్నారు. విద్యారంగంలో కీలకమైన ప్రాథమిక విద్యను ముక్కలు చేసేలా జిఓ 117 తీసుకురావడంతో లక్షలాది మంది విద్యార్థులు పాఠశాలలకు దూరమయ్యారని అన్నారు. 4,500 పాఠశాలల్లో 3, 4, 5 తరగతులను రద్దు చేయడంతో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని తెలిపారు. గత ప్రభుత్వ నిర్ణయాలతో రాష్ట్రంలోని 7,200 పాఠశాలల్లో ఒక్క విద్యార్థి కూడా చేరలేదన్నారు. 20 వేల పాఠశాలల్లో ఎన్‌రోల్‌మెంటు 15 కంటే తక్కువకు పడిపోయిందని తెలిపారు. అలాగే హైస్కూల్స్‌లో ఒక్క ఎన్‌రోల్‌మెంట్ లేని పాఠశాలలు 505 వున్నాయన్నారు. ఈ ఏడాది 6 లక్షల మంది విద్యార్థులు పాఠశాలలకు దూరమయ్యారని తెలిపారు. గత ప్రభుత్వం డిఎస్‌సిని నిర్వహించకుండా ఖాళీలను మాయం చేసేపనికి పూనుకుందని అన్నారు. అలాగే ఉన్నత విద్యను కూడా ధ్వంసం చేశారని విమర్శించారు. ఉన్నత విద్యకు ఫీజ్ రీయింబర్స్‌మెంటు ఎత్తివేసిందన్నారు. రాష్ట్రంలో సంక్షేమం, అభివృద్ధి రెండూ సమాంతరంగా ముందుకు సాగాలంటే కేంద్ర ప్రభుత్వం విభజన హామీలను అమలు చేయాలన్నారు. విభజన హామీల అమలుకు రాష్ట్ర ప్రభుత్వం కేంద్రంపై ఒత్తిడి పెంచాలన్నారు. అలాగే రాష్ట్రంలో తక్షణం ప్రభుత్వ భవనాలను నిర్మించి ప్రభుత్వ కార్యాలయాలకు అద్దె చెల్లింపుల నుంచి ఉపశమనం కల్పించాలన్నారు. రాష్ట్రంలో కాంట్రాక్టు, అవుట్‌సోర్సింగ్, ఇతర స్కీమ్ వర్కర్లందరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలు అమలు చేయాలని డిమాండ్ చేశారు.

విద్యా రంగానికి మొండి చెయ్యి

- ఎస్ఎఫ్ఐ

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

కేంద్ర బడ్జెట్ విద్యారంగానికి మొండిచెయ్యి చూపిందని ఎస్ఎఫ్ఐ రాష్ట్ర కమిటీ విమర్శించింది. దేశంలో విద్యాభివృద్ధి కోసం కనీసం కేటాయించాల్సిన నిధులను కేటాయించలేదని ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు కె ప్రసన్నకుమార్, ఎ అశోక్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఓటాన్ అకౌంట్ బడ్జెట్‌లో ప్రతిపాదించిన డిజిటల్ గ్రంథాలయం నిధులు, జాతీయ విద్యామిషన్ నిధులు, ఏకలవ్య పాఠశాలల్లో టీచర్ పోస్టుల భర్తీ, 157 నర్సింగ్ కళాశాలలు, ఐటిఐలకు బడ్జెట్ వంటి అంశాలపై ప్రస్తావనే లేదని పేర్కొన్నారు. ఉన్నత విద్యాసంస్థలు, కేంద్ర విశ్వవిద్యాలయాల అభివృద్ధి కోసం నిధులు ఇచ్చే యుజిసికి భారీగా కోతపెట్టారని తెలిపారు. దేశ విద్యారంగాన్ని అభివృద్ధి చేయాలంటే జిడిపిలో 6 శాతం, కేంద్ర బడ్జెట్‌లో 10 శాతం నిధులు కేటాయించాల్సి ఉన్నా మోడీ ప్రభుత్వం మాత్రం క్రమంగా తగ్గిస్తూ వస్తుందని విమర్శించారు. రాష్ట్ర విభజన చట్టంలో పేర్కొన్న 11 కేంద్రీయ సంస్థల గురించి ప్రస్తావన లేదన్నారు. ఈ బడ్జెట్‌ను సవరించి విద్యాభివృద్ధికి, ప్రభుత్వ రంగంలో ఉన్నత విద్యాభివృద్ధి కోసం నిధులు కేటాయించాలని కోరారు.

వైసిపి పక్షం నాయకులుగా జగన్

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

అసెంబ్లీలో వైసిపి పక్షం నాయకులుగా వైఎస్ జగన్‌ను ఆ పార్టీ సభ్యులు ఎన్నుకున్నారని, ఈ మేరకు ఆ పార్టీ నుంచి లేఖ అందిందని స్పీకరు చింతకాయల అయ్యన్నపాత్రుడు మంగళవారం శాసనసభలో ప్రకటించారు. అలాగే జనసేన పార్టీ శాసనసభ ఉప నాయకులుగా మంత్రి నాదెండ్ల మనోహర్‌ను ఆ పార్టీ ఎన్నుకుందని, చీఫ్ విప్‌గా లోకం మాధవి, కోశాధికారిగా రామాంజనేయులు, కార్యదర్శులుగా వంశీకృష్ణ, దేవర వరప్రసాద్ ఎన్నికైనట్లు ఆ పార్టీ నుంచి లేఖ అందినట్లు స్పీకరు తెలిపారు.

అచ్చ తెలుగుకు నవ్వుల పువ్వులు

శాసనసభలో తొలిసారిగా స్పీకరు అయ్యన్నపాత్రుడు అచ్చ తెలుగులో సభ నిర్వహణకు ప్రయత్నించారు. బిల్లులు ఆమోదానికి అనుకూలంగా ఉండే వారు అవును అనండి... వ్యతిరేకించే వారు కాదు అని అనాలని తెలిపారు. ల్యాండ్ టైట్లింగ్ యాక్టు రద్దుకు ప్రతిపాదన బిల్లు, వైఎస్సార్ ఆరోగ్య విశ్వవిద్యాలయం చట్టసవరణ బిల్లును ప్రవేశపెట్టినప్పుడు ఈ ప్రకటన చేయగానే సభ్యులంతా అవునూ అంటూ కోరస్ అందుకున్నారు. దీంతో నవ్వులు విరిసాయి. వ్యతిరేకించే వారు కాదు అని అనాలని పేర్కొనగా కాదనే వారు బయట ఉన్నారని టిడిపి సభ్యులు అనండంతో మళ్లీ పలువురు నవ్వులు చిందించారు. తెలుగును యథాతథంగా అమలుకు ప్రయత్నించడాన్ని అభినందిస్తున్నట్టు ఆర్థికశాఖ మంత్రి పయ్యావుల కేశవ్ పేర్కొన్నారు.



లక్ష్మీ సెహగల్ జీవితం స్ఫూర్తిదాయకం

- ఎస్ పుణ్యవతి

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

దేశ స్వాతంత్య్రం కోసం నేతాజీ సుభాష్ చంద్రబోస్ స్థాపించిన అజాద్ హింద్ ఫౌజ్‌లో మహిళావింగ్ కెప్టెన్‌గా పనిచేసిన లక్ష్మీ సెహగల్ జీవితం ప్రతి మహిళకూ స్ఫూర్తిదాయకం కావాలని ఐద్వా జాతీయ నాయకులు ఎస్ పుణ్యవతి పేర్కొన్నారు. కెప్టెన్ లక్ష్మీ సెహగల్ 12వ వర్ధంతి కార్యక్రమాన్ని విజయవాడలోని బాలోత్సవ్ భవన్‌లో ఐద్వా మంగళవారం ఘనంగా నిర్వహించింది. ఈ సందర్భంగా కెప్టెన్ లక్ష్మీసెహగల్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఐద్వా ఘనంగా నివాళులర్పించింది. ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి పుణ్యవతి మాట్లాడుతూ.. వీరవనిత కెప్టెన్ లక్ష్మీ సెహగల్ మహిళలందరికీ ఆదర్శనీయురాలని అన్నారు. దేశానికి స్వాతంత్య్రం సాధించేందుకు ఆమె ఏకంగా అజాద్ హింద్ ఫౌజ్‌లో కెప్టెన్ స్థాయిలో పనిచేశారని తెలిపారు. ప్రజలకు సేవ చేసే అంశంలో ఎప్పుడూ ముందుండే వారని కొనియాడారు. యువతను కూడా బాగా ప్రోత్సహించేవారని తెలిపారు. ఆమె కుటుంబం కూడా ఆమె బాటలోనే ప్రజాసేవ చేసిందన్నారు. లక్ష్మీ సెహగల్ కుమార్తె సుభాషిణీ అలీ వైద్యురాలిగా చివర వరకు ప్రజల కోసం, మహిళల కోసం సేవ చేశారన్నారు. ఐద్వా నిర్మాణంలో సుభాషిణీ అలీ కీలకపాత్ర పోషించారని తెలిపారు. రాష్ట్రంలో మహిళలపై అఘాయిత్యాలు, అత్యాచారాలను అరికట్టేందుకు లక్ష్మీ సెహగల్ జీవితాన్ని స్ఫూర్తిగా తీసుకుని బలమైన పోరాటాలను ఐద్వా కార్యకర్తలు నిర్మించాలని కోరారు. లక్ష్మీ సెహగల్ మరణించాక కూడా తన భౌతికకాయాన్ని సమాజానికి అందించిన గొప్ప నాయకురాలని ఈ సందర్భంగా ఐద్వా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డి రమాదేవి అన్నారు. ఆగస్టు 9 క్విట్ ఇండియా సందర్భంగా క్విట్ లిక్కర్.. క్విట్ డ్రగ్స్ నినాదాన్ని పెద్దయెత్తున ప్రచారంలోకి తీసుకెళ్లాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం మహిళలకిచ్చిన వాగ్దానాలను అమలు చేయాలని, డ్వాక్రా మహిళలకు జీరో వడ్డీ కింద రూ.10 లక్షలు ఇచ్చేలా ఉత్తర్వులు ఇవ్వాలని డిమాండ్ చేశారు. లక్ష్మీ సెహగల్ వర్ధంతి సందర్భంగా 18 మంది తమ దేహదానాన్ని చేస్తూ ప్రకటించారు. ఈ కార్యక్రమంలో ఐద్వా నాయకులు వై సత్యవతి, డి శ్రీనివాసకుమారి, శ్రీదేవి, మస్తాన్ బి, పూర్ణ తదితరులు పాల్గొన్నారు.

మాటలు తప్ప... చేతలు లేవు

బడ్జెట్‌పై సిఐటియు

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

కేంద్ర ప్రభుత్వం బడ్జెట్లో రాష్ట్రానికి తీవ్ర అన్యాయం చేసిందని సిఐటియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సిహెచ్ నర్సింగరావు పేర్కొన్నారు. రాష్ట్రానికి చెందిన అంశాలేమీ లేవన్నారు. కేంద్ర ప్రభుత్వ రంగానికి చెందిన రూ.50 వేల కోట్ల వాటాలు అమ్మడం అనేది ప్రభుత్వరంగ పరిశ్రమలను నాశనం చేయడమేనన్నారు. విశాఖ స్టీల్ ప్లాంట్ గురించి బయట మాటలు చెప్పారు తప్ప, ఆదుకునేందుకు ఎటువంటి చర్యలూ చేపట్టలేదన్నారు. ఇది ఉత్తరాంధ్ర ప్రజానీకానికి తీరని ద్రోహం చేయడమేనని ఆవేదన వ్యక్తం చేశారు. మన రాష్ట్రానికి విభజన చట్టం అమలు చేసేందుకు రైల్వే బడ్జెట్, కడప స్టీల్ ప్లాంట్, మెట్రో రైలు వంటి వాటిపై ప్రస్తావన లేదన్నారు. ప్రజలకు అవసరమైన విద్య, వైద్య అంశాలను పూర్తిగా నిర్లక్ష్యం చేశారన్నారు. కనీసం 2.5 శాతం వైద్య రంగానికి కేటాయించాల్సి ఉందనే అంశాన్ని పట్టించుకోలేదన్నారు. ఐసిడిఎస్‌కు, ఉపాధి హామీకి నిధులు తగ్గించారని పేర్కొన్నారు. కార్పొరేట్లకు అనుకూల, పేదలకు వ్యతిరేక బడ్జెట్‌గా పేర్కొన్నారు.

ప్రభుత్వ ఉద్యోగులకు ఊరట

- ఎపి జెఎసి అమరావతి

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

కేంద్ర బడ్జెట్‌లో ప్రభుత్వ ఉద్యోగులకు ఊరట లభించిందని ఎపి జెఎసి అమరావతి ఛైర్మన్ బొప్పరాజు వెంకటేశ్వర్లు, పలిశెట్టి పేర్కొన్నారు. ఇన్‌కమ్ ట్యాక్స్‌కు సంబంధించి కొత్త పన్నుల విధానంలో స్లాబుల పెంపుదల, స్టాండర్డ్ డిడక్షన్ పెంచడంతో రూ.10 లక్షల లోపు ఆదాయం పొందే ఉద్యోగులతోపాటు రూ.15 లక్షల లోపు ఆదాయం పొందే వారికి కూడా ఊరట కలిగిందన్నారు. రాజధాని అమరావతి నిర్మాణానికి రూ.15 వేలకోట్లు, వెనుకబడిన జిల్లాల అభివృద్ధికి సహకారం అందిస్తూ బడ్జెట్ కేటాయింపుతో నూతన విశ్వాసం, ఉత్సాహం కల్పించిందన్నారు. బడ్జెట్ కేటాయింపుల్లో రాష్ట్రానికి ప్రాధాన్యతనిచ్చినందుకు ప్రధాని మోడీ, ఆర్థికశాఖ మంత్రి నిర్మలా సీతారామన్, సిఎం చంద్రబాబుకు వారు కృతజ్ఞతలు తెలిపారు.

ప్రత్యేక హోదాతోనే రాష్ట్రం అభివృద్ధి

- సిపిఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ

ప్రజాశక్తి-కర్నూలు కార్పొరేషన్

రాష్ట్రాభివృద్ధి ప్రత్యేక హోదాతోనే సాధ్యమని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ అన్నారు. ఉద్యోగ అవకాశాలు కల్పించాలని, ధరలు తగ్గించాలని కోరారు. కర్నూలు సిఆర్ భవన్‌లో విలేకరులతో ఆయన మాట్లాడుతూ.. అమరావతి రాజధానికి రూ.15వేల కోట్లు కేంద్ర బడ్జెట్‌లో కేటాయించడాన్ని స్వాగతిస్తున్నామన్నారు. పోలవరం ప్రాజెక్టు పూర్తిచేస్తామంటే సరిపోదని, నిర్వాసితులకు పరిహారం ఇచ్చి ఆదుకోవాలని, వెనుకబడిన రాయలసీమ - ఉత్తరాంధ్రలకు గతంలో ఇచ్చినట్లుగా రూ.50కోట్లు కాకుండా బుందేల్ ఖండ్ తరహాలో నిధులు కేటాయించాలని కోరారు. గత ప్రభుత్వం చేసిన అవినీతి అక్రమాలు, అప్పులపైనే గవర్నర్ ప్రసంగం సాగిందన్నారు. రాష్ట్రంలో అనేక సమస్యలు ఉన్నాయని పూర్తిస్థాయి బడ్జెట్ ఏర్పాటు చేస్తే బాగుండేదని పేర్కొన్నారు. రాష్ట్రంలో శాంతి భద్రతలు క్షీణించాయని రాష్ట్రపతి పాలన పెట్టాలని మాజీ ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి కోరడం సరైంది కాదన్నారు. ముచ్చుమర్రిలో బాలికపై అఘాయిత్యం చేసి హత్య చేయడం దారుణమన్నారు. మదనపల్లెలో అగ్నిప్రమాదం కుట్రపూరితమైందని వెంటనే నిందితులను గుర్తించి కఠినంగా శిక్షించాలని కోరారు. సిపిఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు పి.రామచంద్రయ్య, ఆవుల శేఖర్, జిల్లా కార్యదర్శి బి.గిడ్డయ్య తదితరులు పాల్గొన్నారు.

'నాడు-నేడు' పనుల్లోని అవినీతిపై విచారణ

- మంత్రి నారా లోకేష్

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

నాడు-నేడు పనుల్లో జరిగిన అవినీతిపై సమగ్ర విచారణ చేయిస్తామని విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ శాసనసభలో ప్రకటించారు. శాసనసభలో మంగళవారం క్వశ్చన్ అవర్‌లో పాఠశాలల ఆధునీకరణ, నాడు-నేడు పథకంపై చర్చ జరిగింది. గత వైసిపి ప్రభుత్వం చేపట్టిన నాడు-నేడు పథకంలో పెద్దయెత్తున అవినీతి జరిగిందని, విచారణ జరిపించాలని టిడిపి శాసనసభ్యులు తెనాలి శ్రావణ్‌కుమార్, ఏలూరి సాంబశివరావు, ధూళిపాళ్ల నరేంద్ర ప్రభుత్వాన్ని కోరారు. సభ్యులు అడిగిన ప్రశ్నలకు మంత్రి లోకేష్ స్పందిస్తూ.. 2019-24 మధ్య కాలంలో పాఠశాలల ఆధునీకరణ కింద పనులు చేపట్టినప్పటికీ ప్రభుత్వ పాఠశాలల్లో నమోదు 72,117 మంది విద్యార్థులు తగ్గారన్నారు. నమోదు పెంచడంతోపాటు పాఠశాలల మౌలిక సదుపాయాలు మెరుగుదల కోసం కెజి నుంచి పిజి వ్యవస్థను ప్రక్షాళన చేయనున్నామన్నారు. ఇందుకోసం ఢిల్లీ, యుపిల్లో అమలవుతున్న విధానాన్ని అధ్యయనం చేస్తామన్నారు. జిఓ ఎంఎస్ నెంబరు 117పై త్వరలో ఓ నిర్ణయం తీసుకుంటామన్నారు. సెంట్రల్ ప్రొక్యూర్‌మెంట్ మెటీరియల్ టెండర్ ప్రక్రియలో అవకతవకలకు సంబంధించి న్యాయవాది వి వెంకటరామిరెడ్డి 27.11.2023న పిటిషన్ దాఖలు చేశారని, ఎపిఇడబ్ల్యుఐడిసి ఎమ్‌డి నుంచి ప్రాథమిక నివేదిక అందిందని, తుది నివేదిక అందిన తర్వాత అమల్లో ఉన్న నియమావళి ప్రకారం చర్యలు ఉంటాయని లోకేష్ వెల్లడించారు. కొత్త పాలిటెక్నిక్ కళాశాలలు, ఐటిఐలపై జరిగిన చర్చలో లోకేష్ మాట్లాడుతూ.. ఎన్‌ఎసిని బలోపేతం చేస్తామన్నారు. 2022 గ్రూప్-12 పోస్టుల ఇంటర్వ్యూలపై జరిగిన చర్చలో శాసనసభ వ్యవహారాలశాఖ మంత్రి పయ్యావుల కేశవ్ మాట్లాడుతూ.. ఎపిపిఎస్‌సి మూల్యాంకనంలో జరిగిన అవకతవకలపై ఆగస్టు 31లోపు నివేదిక ఇవ్వాలని కమిటీని ఆదేశించామన్నారు. నివేదిక వచ్చిన తర్వాత బాధ్యులపై చర్యలుంటాయన్నారు.

పోలీస్ శాఖలో 19,999 ఖాళీలు

- హోంమంత్రి అనిత

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

రాష్ట్ర పోలీస్ శాఖలో సిబ్బంది కొరత ఉన్నమాట వాస్తవమేనని, 19,999 ఖాళీలున్నట్లు హోంశాఖ మంత్రి వంగలపూడి అనిత వెల్లడించారు. పోలీస్ శాఖ కోసం కొనుగోలు చేసిన వాహనాలకు సంబంధించిన బిల్లులను గత వైసిపి ప్రభుత్వం మహీంద్ర కంపెనీకి చెల్లించకపోవడంతో పోలీస్‌శాఖను ఆ కంపెనీ బ్లాక్ లిస్టులో పెట్టిందని శాసనసభలో పేర్కొన్నారు. తమ ప్రభుత్వం ఆయా బిల్లులను క్లియర్ చేసే పనిలో ఉందన్నారు. మంగళవారం ప్రశ్నోత్తరాల సమయంలో బిజెపి సభ్యులు పెన్మత్స విష్ణుకుమార్‌రాజు వేకెన్సీ రిజర్వ్ ఇన్‌స్పెక్టర్ల విధుల నిర్వహణ, పోలీసు వాహనాలకు సంబంధించి అడిగిన ప్రశ్నపై మంత్రి సమాధానమిస్తూ.. ఈ విషయాలను వెల్లడించారు. తీవ్రవాద, ఉగ్రవాద సంబంధిత శాఖల్లో విశిష్ట సేవలందించిన పోలీస్ సిబ్బందికి తర్వాత ఉన్నత హోదాకు ఆగ్జిలరీ ఉద్యోగోన్నతులు ఇవ్వడానికి ఒక కార్యాచరణ ప్రణాళిక రూపొందించామన్నారు. శాంతి భద్రతలు, బందోబస్తు డ్యూటీల్లో రేంజ్ విఆర్ (వేకెన్సీ రిజర్వు) పోలీస్ ఇన్‌స్పెక్టర్లకు నెలవారీ వేతనాలు, భత్యాలు చెల్లించకుండా వినియోగించారన్నారు. నూతన వాహనాల కోసం 2014లో రూ.100 కోట్లు, 2018లో రూ.50 కోట్లు, 2021లో రూ.17 కోట్లు బడ్జెట్‌లో కేటాయించారన్నారు. నూతన వాహనాల కొనుగోలు, ప్రస్తుత వాహనాల మరమ్మతుల కోసం బడ్జెట్ కేటాయింపుల నిమిత్తం ప్రభుత్వం దృష్టికి సమస్యలను తీసుకెళ్లినట్లు ఆమె తెలిపారు. పోలీస్‌శాఖకు సంబంధించిన ఉద్యోగుల జిపిఎఫ్ నిధులను కూడా గత ప్రభుత్వం దారి మళ్లించిందన్నారు.

ప్రతిపక్ష హోదా ఇచ్చేలా ఆదేశించండి

- హైకోర్టులో జగన్ పిటిషన్

ప్రజాశక్తి-అమరావతి

శాసనసభలో తనకు ప్రతిపక్ష హోదా ఇచ్చేలా ఉత్తర్వులు జారీ చేయాలంటూ మాజీ సిఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. స్పీకరు మౌనంగా ఉన్నారని, శాసనసభా మంత్రి ప్రతిపక్ష హోదా ఇవ్వబోమని ముందుగానే చెబుతున్నారని తెలిపారు. విపక్షంలో ఉండాలని ప్రజలు తీర్పు ఇచ్చారని, తనకు ప్రతిపక్ష హోదా ఇవ్వడం వల్ల ప్రజల సమస్యలను సభలో చెప్పేందుకు మరింత సులభం అవుతుందని పేర్కొన్నారు. ప్రతిపక్ష హోదా ఇవ్వరాదనే విషయం రాజ్యాంగంలో లేదన్నారు. స్పీకరు చింతకాయల అయ్యన్నపాత్రుడు తనపై ఆది నుంచీ వ్యతిరేకతతో ఉన్నారని, స్పీకరుగా ఎన్నిక అవ్వడానికి ముందు అయ్యన్నపాత్రుడు తనను ఉద్దేశించి.. జగన్ ఓడిపోయాడేగానీ చచ్చిపోలేదు.. అని వ్యాఖ్యానించడాన్ని పరిగణనలోకి తీసుకోవాలన్నారు. తనకు ప్రతిపక్ష నేత హోదా ఇవ్వకూడదని అధికార పార్టీ నిర్ణయించిందని, అందుకు అనుగుణంగా స్పీకరు తీరు ఉన్నందున మరోమార్గం లేని పరిస్థితుల్లో హైకోర్టుకు వచ్చినట్లు పిటిషన్‌లో వివరించారు. అసెంబ్లీలో తనకు ప్రతిపక్షనేత హోదా ఇచ్చేలా శాసనసభ కార్యదర్శి, స్పీకరు కార్యదర్శికి ఉత్తర్వులు ఇవ్వాలని కోరారు. ఇందులో ప్రతివాదులుగా స్పీకరు అయ్యన్నపాత్రుడు, శాసన వ్యవహారాల మంత్రి పయ్యావుల కేశవ్‌ను చేర్చారు. ఈ వ్యాజ్యాన్ని హైకోర్టు విచారణ చేయనుంది.

పంచాయతీ నిధులు దారి మళ్లింపు వాస్తవమే

- మండలిలో ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

పంచాయతీలకు విడుదల చేసిన 14, 15వ ఆర్థిక సంఘం నిధుల్లో దాదాపు రూ.9 వేలకోట్లను గత ప్రభుత్వం దారి మళ్లించిన విషయం వాస్తవమేనని ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ అన్నారు. శాసనమండలిలో మంగళవారం జరిగిన ప్రశ్నోత్తరాలలో ఆయన మాట్లాడారు. టిడిపి ఎమ్మెల్సీలు దువ్వారపు రామారావు, బి తిరుమలనాయుడు, పంచుమర్తి అనురాధ, కంచర్ల శ్రీకాంత్ అడిగిన ప్రశ్నకు పవన్ సమాధానం చెప్పారు. కేంద్ర ప్రభుత్వం ఆర్థిక కమిషన్ గ్రాంటును విడుదల చేసినప్పటికీ పంచాయతీరాజ్ సంస్థలకు రూ.998 కోట్లు ఇంకా విడుదల కావాల్సి ఉందన్నారు. సర్పంచుల అనుమతులు లేకుండా రూ.2,165 కోట్లు విద్యుత్ డిస్కమ్‌లకు ప్రభుత్వం చెల్లించిందని తెలిపారు. దీనిపై కేంద్ర పంచాయతీ కమిషన్ రాష్ట్రానికి వచ్చి విచారణ జరిపిందని, ఇందులో అవకతవకలు జరిగినట్లు గుర్తించారని పేర్కొన్నారు. గ్రామ సచివాలయాల్లో సర్పంచులకు సముచిత స్థానం కల్పిస్తామని చెప్పారు. నిధులు దారి మళ్లించకుండా రాష్ట్రస్థాయిలో చట్టం చేయాలని పిడిఎఫ్ ఎమ్మెల్సీ కెఎస్ లక్ష్మణరావు కోరారు.

50 ఏళ్లకే పింఛనుపై మార్గదర్శకాలు రూపొందిస్తున్నాం మంత్రి కొండపల్లి

ఎన్నికల మేనిఫెస్టోలో హామీ ఇచ్చిన ప్రకారం 50 ఏళ్లు పైబడిన వారికి వృద్ధాప్య పింఛను మంజూరుపై రాష్ట్ర ప్రభుత్వం మార్గదర్శకాలను రూపొందిస్తున్నట్లు ఎంఎస్ఎంఇ, సెర్ప్, ఎన్‌ఆర్‌ఐశాఖల మంత్రి కొండపల్లి శ్రీనివాస్ వెల్లడించారు. వైసిపి సభ్యులు రమేష్ యాదవ్, కె శ్రీనివాస్, ఇసాక్ బాషా, బొమ్మి ఇజ్రాయిల్ అడిగిన ప్రశ్నకు సమాధానంగా మంత్రి చెప్పారు. రాష్ట్రంలో ప్రస్తుతం 65,18,496 మందికి పింఛన్లు అందిస్తున్నట్లు పేర్కొన్నారు. కొత్త పింఛన్ల కోసం గ్రామీణ ప్రాంతాల్లో అనేక మంది దరఖాస్తు చేసుకున్నారని, వీరికి పింఛన్ సౌకర్యం అందేలా చర్యలు తీసుకోవాలని పిడిఎఫ్ ఎమ్మెల్సీ కెఎస్ లక్ష్మణరావు ఈ సందర్భంగా కోరారు. ప్రభుత్వ ఉద్యోగం ఉందని, ఇతర కారణాలతో గత ప్రభుత్వం ఇంటికి ఒక పింఛన్ మాత్రమే అందించిందని టిడిపి ఎమ్మెల్సీ పి అశోక్ బాబు అన్నారు. వివిధ కారణాలతో లక్షల పింఛన్లను తొలగించిందని, వీటిని పునరుద్ధరించాలని కోరారు. పింఛన్‌కు దరఖాస్తు చేసుకునేందుకు ఉన్న వెబ్‌సైట్‌ను త్వరలో పునరుద్ధరిస్తామని మంత్రి కొండపల్లి చెప్పారు. రాష్ట్రంలో రాష్ట్ర, జాతీయ రహదారుల పనుల్లో అనేక అవకతవకలు జరిగిన విషయం వాస్తవమేనని రోడ్లు, భవనాలశాఖ మంత్రి బిసి జనార్ధన్ రెడ్డి.. సభ్యులు అడిగిన ప్రశ్నకు సమాధానంగా చెప్పారు. రాష్ట్రంలో ఇటీవల డయేరియాతో ఏడుగురు మరణించారని వైద్యారోగ్యశాఖ మంత్రి సత్యకుమార్.. వైసిపి సభ్యులు మొండితోక అరుణ్ కుమార్ ప్రశ్నకు సమాధానంగా చెప్పారు.

ఉచిత గ్యాస్‌పై త్వరలో విధి విధానాలు : మంత్రి నాదెండ్ల

మహిళలకు ఉచిత గ్యాస్ సిలిండర్లను త్వరగా అందజేసేందుకు విధివిధానాలు రూపొందిస్తామని వినియోగదారుల వ్యవహారాలు, ఆహార, పౌరసరఫరాలశాఖ మంత్రి నాదెండ్ల మనోహర్.. వైసిపి సభ్యులు వరుదు కళ్యాణి, ఎస్ మంగమ్మ, పోతుల సునీత అడిగిన ప్రశ్నకు సమాధానంగా చెప్పారు. వివిధ శాఖలతో లోతుగా చర్చించి ఈ పథకాన్ని త్వరలో ప్రవేశపెడతామని తెలిపారు. పౌరసరఫరాల సంస్థ బ్యాంకులు, ఇతర వనరుల నుంచి రూ.37,550 కోట్లు అప్పు తీసుకుందని మనోహర్ మరో ప్రశ్నకు సమాధానంగా చెప్పారు. టిటిడిలో గత ఐదేళ్లలో అక్రమాలు జరిగిన విషయం వాస్తవమేనని దేవాదాయశాఖ మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి అన్నారు. కొన్ని ఆరోపణలు ప్రభుత్వ దృష్టికి వచ్చాయని, వీటిపై సమగ్ర నివేదికను సమర్పించాలని విజిలెన్స్, ఎన్‌ఫోర్స్‌మెంటు శాఖను ఆదేశించామని తెలిపారు. గత ఐదేళ్లలో గనుల అక్రమ కార్యకలాపాలకు సంబంధించి మొత్తం 1,766 కేసులు నమోదు చేసి రూ.4,037 కోట్లు జరిమానా విధించారని గనులు, భూగర్భశాఖ మంత్రి కొల్లు రవీంద్ర అన్నారు. రాష్ట్రంలో మైనింగ్‌లో అనేక దోపిడీలు, అక్రమాలు జరిగాయని విమర్శించారు. సుమారు రూ.19 వేల కోట్ల దోపిడీ జరిగినట్లు తమకు ప్రాథమిక సమాచారం వచ్చిందని, ఇది రూ.లక్ష కోట్ల వరకు వెళ్లే అవకాశం ఉందన్నారు.

వ్యవ'సాయం' దారుణం

(మొదటి పేజీ తరువాయి)

ప్రతిపాదించారు. మార్కెట్ ఇంటర్వెన్షన్‌కు కేటాయింపులు సున్నాగా చూపించారు. 'పిఎం-ఆశా'కు 6,437 కోట్లు ప్రతిపాదించారు. జౌళి శాఖ పద్దులో రైతుల నుంచి ఎంఎస్‌పిపై పత్తి కొనుగోలు కోసం సిసిఐకి రెండేళ్ల నుంచి ప్రతిపాదనలు లేవు. ఈసారి 600 కోట్లు ప్రతిపాదించారు. ముఖ్యంగా ఎరువుల సబ్సిడీని బాగా తగ్గించారు. యూరియా సబ్సిడీకి ప్రభుత్వం 2022-23లో 1,65,217 కోట్లు ఖర్చు చేయగా, నిరుడు బడ్జెట్‌లో 1,31,099 కోట్లు ప్రతిపాదించి, 1,28,596 కోట్లకు సవరించారు. ఇప్పుడు 1,19,000 కోట్లు కేటాయించారు. పోషక ఆధారిత ఎరువుల సబ్సిడీకి 2022-23లో 86,122 కోట్లు ఖర్చు చేయగా, నిరుడు 44,000 కోట్లు ప్రతిపాదించి 60,300 కోట్లకు సవరించారు. ఇప్పుడు 45,000 కోట్లు ప్రతిపాదించారు. సబ్సిడీ తగ్గిన పక్షంలో డిఎపి, కాంప్లెక్స్ ఎరువుల ధరలు పెరుగుతాయి. ప్రభుత్వం మాత్రం ప్రకృతి, సేంద్రీయ వ్యవసాయానికి, నానో వైపు రైతులను మళ్లించి ఎరువుల సబ్సిడీని తగ్గించుకోవాలని చూస్తోంది.

'సంస్కరణ'ల వేగం

వ్యవసాయ పరిశోధనల్లో, నూతన వంగడాల అభివృద్ధిలో ప్రైవేటు భాగస్వామ్యం కల్పిస్తారు. త్వరలో 109 కొత్త వంగడాలను విడుదల చేస్తారు. రెండేళ్లల్లో ప్రకృతి వ్యవసాయంలోకి కోటి మంది రైతులను మళ్లిస్తారు. సేంద్రీయ ఉత్పత్తులకు బ్రాండింగ్ సర్టిఫికెట్లు జారీ చేస్తారు. పంచాయతీలు, శాస్త్ర సాంకేతిక సెంటర్ల ద్వారా అమలు చేస్తారు. రైతులు, సహకార సంఘాలతో పాటు ప్రైవేటు స్టార్టప్‌లతో కూరగాయల క్లస్టర్లు నెలకొల్పుతారు. ఇంకా పప్పులు, నూనెగింజలల్లో స్వయం సమృద్ధి సాధిస్తారు. నాబార్డు ద్వారా రొయ్యల సాగు నెట్‌వర్క్‌ను అభివృద్ధి పరుస్తారు. పది వేల ఫార్మర్స్ ప్రొడ్యూసర్ ఆర్గనైజేషన్స్ (ఎఫ్‌పిఒ)లను నెలకొల్పుతారు. 'నమో డ్రోన్ల' పథకం కింద సాగులో డ్రోన్లను ప్రవేశపెడతారు. గ్రామీణ ఆర్థిక, ఉపాధి కల్పన కోసం జాతీయ సహకార విధానం తీసుకొస్తారు. సహకారం పూర్తిగా రాష్ట్రాల పరిధిలోనిది కాగా ఎన్‌డిఎ సర్కారు జాతీయ విధానం తెచ్చి తన చెప్పుచేతల్లో పెట్టుకోవాలని చూస్తోంది. సహకార శాఖ మంత్రిగా అమిత్‌షా వ్యవహరిస్తున్నారు.

ఈశాన్య రాష్ట్రాలపై నిర్లక్ష్యపు మేఘాలు

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

ఎప్పటి మాదిరిగానే ఈసారి కేంద్ర బడ్జెట్‌లో కూడా ఈశాన్య రాష్ట్రాలు నిరాదరణకు గురయ్యాయి. మణిపూర్ మండిపోతున్నా కేంద్రం కనికరించలేదు. మౌలిక సదుపాయాలు లేకపోవడం, భారీవర్షాలు, వరదలు వంటి విపత్తులతో నష్టాలను ఎదుర్కొంటున్నా ఈ ప్రాంతానికి కేంద్రం తక్కువగా నిధులను కేటాయిస్తోంది. ఈశాన్య రాష్ట్రాల అభివృద్ధికి బడ్జెట్‌లో ఎనిమిది కోట్లు మాత్రమే పెంచారు. ఈశాన్య భారతం గొప్ప సాంస్కృతిక వారసత్వం, ప్రకృతి సౌందర్యం, ప్రత్యేకమైన జీవవైవిధ్యానికి ప్రసిద్ధి. ఇలాంటి లక్షణాలతో ఈ ప్రాంతం పర్యాటకానికి ప్రధాన గమ్యస్థానంగా మారింది. అయినా పర్యాటక రంగ మౌలిక సదుపాయాల అభివృద్ధికి బడ్జెట్‌లో తగిన కేటాయింపులు లేవు. ఈ ప్రాంతంలో టూరిజం కార్యక్రమాలపై బడ్జెట్ దృష్టి పెట్టలేదు. ఈ ప్రాంతంలో వరదల సమస్యను పరిష్కరించే కార్యక్రమాలపైనా శ్రద్ధ చూపలేదు. ఈశాన్య ప్రాంతాలపై నిర్లక్ష్యం ప్రభుత్వం నిర్లక్ష్యాన్ని సూచిస్తోంది. భారతదేశం పురోగమించాలంటే దేశంలో అన్ని ప్రాంతాల అభివృద్ధి చాలా కీలకం.

రాజ్యసభ నుంచి బిజెడి వాకౌట్

ఒడిశాకు ప్రత్యేక కేటగిరీ రాష్ట్ర హోదా తిరస్కరణపై రాజ్యసభ నుంచి బిజెడి వాకౌట్ చేసింది. ఏపీ, బీహార్, కొన్ని ఇతర రాష్ట్రాలతో పాటు ఒడిశా సైతం ప్రత్యేక హక్షదా గురించి డిమాండ్ చేస్తున్నది.

కార్పొరేట్లకు నజరానా

- పన్ను రాయితీలతో సర్కారు ఖజానాకు భారీ గండి
- ఏటా రూ.1.45 లక్షల కోట్లు నష్టపోతున్న ప్రభుత్వం
- వ్యక్తిగత, కార్పొరేట్ పన్ను వసూళ్ల మధ్య పెరుగుతున్న అంతరం
- ఈ బడ్జెట్‌లోనూ తగ్గిన కార్పొరేట్ పన్ను రేట్లు



న్యూఢిల్లీ : వ్యక్తులు చెల్లించే ఆదాయపు పన్ను నుంచి ప్రభుత్వానికి వచ్చే రాబడి కార్పొరేట్ సంస్థలు చెల్లించే పన్నుల కంటే అధికంగా ఉంటోంది. ఆదాయపు పన్ను ద్వారా ప్రభుత్వానికి 19 శాతం ఆదాయం సమకూరుతుండగా కార్పొరేట్ సంస్థల నుండి వస్తున్నది కేవలం 17 శాతం మాత్రమే. ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ మంగళవారం పార్లమెంటుకు సమర్పించిన బడ్జెట్ పత్రాలను విశ్లేషిస్తే ఈ విషయం అర్థమవుతోంది. ఐదు సంవత్సరాల క్రితం 2019లో మోడీ ప్రభుత్వం కార్పొరేట్ సంస్థల పన్నులను తగ్గించిన విషయం తెలిసిందే. దీనివల్ల ప్రభుత్వం ఏటా రూ.1.45 లక్షల కోట్ల ఆదాయాన్ని కోల్పోతోంది. దీనికి ప్రభుత్వం చెబుతున్న కారణం ఏమిటో తెలుసా? కార్పొరేట్ సంస్థలకు పన్ను రాయితీలు కల్పిస్తే ప్రయివేటు పెట్టుబడులు పెరుగుతాయని, తద్వారా యువతకు మరిన్ని ఉద్యోగాలు వస్తాయని.

గత ఐదేళ్ల కాలంలో ఈ పన్ను రాయితీల కారణంగా ప్రభుత్వం రూ.8.7 లక్షల కోట్ల ఆదాయాన్ని కోల్పోయిందని బడ్జెట్‌కు ముందు ఆర్థిక మంత్రికి రాసిన లేఖలో సంజయ్ ఝా తెలియజేశారు. సంజయ్ గతంలో కాంగ్రెస్ పార్టీకి జాతీయ ప్రతినిధిగా పనిచేశారు. 'ఉద్యోగాలు ఎక్కడ వచ్చాయో చెప్పగలరా? మూలధనపు పెట్టుబడులు ఎక్కడ? మీరు పన్ను రాయితీలు ఇచ్చిన కంపెనీలు ఆదా చేసిన ఆ సొమ్మును డివిడెండ్లు, లాభాలుగా పంపిణీ చేశాయా లేక జేబుల్లో వేసుకున్నాయా? కార్పొరేట్ సంస్థలు ఇబ్బడిముబ్బడిగా లాభాలు దండుకుంటుంటే స్టాక్ మార్కెట్లు పరుగులు తీస్తున్నాయి. వాస్తవ పరిస్థితులకు ఇది పూర్తి భిన్నంగా ఉంది' అని ఆయన తెలిపారు.

కార్పొరేట్ల పైనే ప్రేమ

2014-2024 మధ్యకాలంలో కార్పొరేట్ పన్నుల రాబడిలో పెరుగుదల చాలా స్వల్పంగా ఉంది. 2014-15లో రూ.4.28 లక్షల కోట్ల మేర కార్పొరేట్ పన్నులు వసూలు కాగా 2024-25 బడ్జెటరీ అంచనాల్లో అది కేవలం రూ.10.2 లక్షల కోట్లకు మాత్రమే పెరిగింది. దీనికి భిన్నంగా అదే కాలంలో ఆదాయపన్ను రాబడులు రూ.2.5 లక్షల కోట్ల నుంచి రూ.11.8 లక్షల కోట్లకు అంటే 4.5 శాతం మేర పెరిగాయి. ప్రతి ఏటా పెరుగుతున్న ఈ ఆదాయం... పన్ను చెల్లింపుదారుల కంటే కార్పొరేట్ సంస్థలకే ప్రభుత్వం అనుకూలంగా వ్యవహరిస్తోందన్న చేదునిజాన్ని చాటిచెబుతోంది.

స్థూల పన్ను రాబడిలో...

స్థూల పన్ను రాబడి (జీటీఆర్)లో పన్ను చెల్లింపుదారులు, కార్పొరేట్ సంస్థల చెల్లింపుల వాటాను పరిశీలిద్దాం. ప్రభుత్వం ఇటీవల కార్పొరేట్ పన్ను దామాషాను తగ్గించే ప్రయత్నం చేసింది. జీటీఆర్‌లో కార్పొరేట్ పన్ను వాటా 2014-15లో 34.5 శాతం ఉండగా 2024-25 బడ్జెట్ అంచనాల్లో 26.6 శాతానికి తగ్గిపోయింది. మరోవైపు అదే కాలంలో ఆదాయపన్ను వాటా 20.8 శాతం నుంచి 30.9 శాతానికి పెరిగిపోయింది. అంటే గత పది సంవత్సరాల కాలంలో జీడీపీలో కార్పొరేట్ పన్నుల వాటా 3.4 శాతం నుంచి 3.1 శాతానికి పడిపోయింది. దీనికి భిన్నంగా ఆదాయపన్ను వాటా 2.1 శాతం నుంచి 3.5 శాతానికి పెరిగింది.

పెరుగుతున్న అంతరం

2018-19, 2022-23 మధ్యకాలంలో దేశంలో వ్యక్తిగత పన్ను వసూళ్లు 76 శాతం పెరిగాయి. కానీ పన్ను వసూళ్లలో కార్పొరేట్ వాటా కేవలం 24.45 శాతం మాత్రమే పెరిగింది. 2018-19లో సెక్యూరిటీల లావాదేవీల పన్ను సహా వ్యక్తిగత ఆదాయపన్ను వసూళ్లు రూ.4,73,179 కోట్లు. 2022-23 నాటికి అది రూ.8,33,307 కోట్లకు పెరిగింది. అదే సమయంలో కార్పొరేట్ పన్ను వసూళ్లు రూ.6,63,572 కోట్ల నుంచి రూ.8,25,834 కోట్లకు మాత్రమే పెరిగాయి. ప్రభుత్వం కార్పొరేట్ సంస్థలకు ఉదారంగా పన్ను రాయితీలు, మినహాయింపులు ఇస్తుండడంతో అవి చెల్లించే పన్నులు తగ్గిపోతున్నాయి. వ్యక్తిగత ఆదాయపన్ను చెల్లించే వారికి మాత్రం బడ్జెట్‌లో ప్రభుత్వం పెద్దగా ఊరట కల్పించడం లేదు. 2019లో కార్పొరేట్ సంస్థలకు కల్పించిన రాయితీల కారణంగా మొత్తం పన్నుల రాబడిలో వ్యక్తిగత ఆదాయపన్ను, కార్పొరేట్ పన్నుల మధ్య అంతరం బాగా పెరిగిపోతోంది. ప్రస్తుత బడ్జెట్‌లో కూడా మోడీ ప్రభుత్వం అసాధారణ రీతిలో కార్పొరేట్ పన్ను రేట్లను 30 శాతం నుంచి 22 శాతానికి తగ్గించింది. ఇప్పటికే ప్రకటించిన ఇతర రాయితీలకు ఇది అదనం.

బడ్జెట్ ముఖ్యాంశాలు

- అన్ని తరగతులు ఇన్వెస్టర్లకు ఏంజెల్ టాక్స్ రద్దు
- విదేశీ కంపెనీల కేపిటల్ గెయిన్ టాక్స్ 40 శాతం నుంచి 35 శాతానికి తగ్గింపు
- రక్షణ రంగానికి రూ. 4,54,773 కోట్లు
- మౌలిక సదుపాయ రంగానికి 11,11,111 కోట్లు
- వారణాసి, రాజ్‌గిర్, నలందా, ఒడిషా ల్లో ఆధ్యాత్మిక టూరిజం అభివృద్ధికి ప్రత్యేక శ్రద్ధ
- పట్టణ ప్రాంతాల్లో భూముల నమోదు డిజిటలీకరణ, ల్యాండ్ రిజిస్ట్రీ ఏర్పాటు
- తదుపరి తరం సంస్కరణలకు ఊపు
- మరో మూడు రకాల కేన్సర్ మందులపై కస్టమ్స్ సుంకం మినహాయింపు
- బంగారం, వెండిపై సుంకం తగ్గింపు
- మొబైల్స్ పై సంఉకం 15శాతానికి కుదింపు

రంగాలవారీ కేటాయింపులు

రక్షణ	రూ. 4,54,773 కోట్లు
గ్రామీణాభివృద్ధి	రూ. 2,65,808 కోట్లు
వ్యవసాయం, అనుబంధ కార్యకలాపాలు	రూ.1,51,851 కోట్లు
హోం వ్యవహారాలు	రూ. 1,50,983 కోట్లు
విద్య	రూ. 1,25,638 కోట్లు
ఐటీ అండ్ టెలికాం	రూ. 1,16,342 కోట్లు
ఆరోగ్యం	రూ. 89,287 కోట్లు
శక్తి	రూ. 68,769 కోట్లు
సాంఘిక సంక్షేమం	రూ. 56,501 కోట్లు
వాణిజ్యం, పరిశ్రమ	రూ. 47,559 కోట్లు



పెరిగిన రక్షణ వ్యయం

- రూ.6,21,940 కోట్ల కేటాయింపు

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

కేంద్ర బడ్జెట్ 2024-25లో రక్షణ వ్యయం కోసం రూ.6,21,940 కోట్లు కేటాయించారు. గత ఏడాది బడ్జెట్ రూ.5.94 లక్షల కోట్లతో పోలిస్తే ఈసారి 4.72 శాతం కేటాయింపులు పెరిగాయి. ప్రస్తుతం మొత్తం బడ్జెట్‌లో 12.9 శాతం రక్షణ వ్యయానికి కేటాయించడంపై కేంద్ర రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్‌కు కృతజ్ఞతలు తెలిపారు. ఈ మేరకు ఎక్స్‌లో రాజ్‌నాథ్ సింగ్ పోస్టు చేశారు. 'రూ.1,72,000 కోట్ల మూలధన వ్యయం సాయుధ బలగాల సామర్థ్యాలను మరింత బలోపేతం చేస్తుంది. సరిహద్దు రహదారులకు 30 శాతం కేటాయింపులు పెంచడం నాకు సంతోషం కలిగిస్తుంది' అని పోస్ట్‌లో తెలిపారు. రక్షణ పరిశ్రమల కోసం రూ. 518 కోట్లను కేటాయించినట్లు పేర్కొన్నారు.

12 పారిశ్రామిక పార్కులు

- వంద నగరాల్లో ప్లగ్ అండ్ ప్లే ఇండస్ట్రియల్ పార్కులు

న్యూఢిల్లీ: పారిశ్రామిక రంగంలో నెలకొన్న స్తబ్ధత ను తొలగించేందుకు నేషనల్ ఇండస్రియల్ కారిదార్ డెవలప్‌మెంట్ ప్రోగ్రామ్ (ఎన్ఐసిడిపి) కింద పెన్నండు పారాశ్రామిక పార్కులను మంజూరు చేస్తున్నట్లు మంగళవారం నాటి కేంద్ర బడ్జెట్‌లో ప్రకటించారు. గుర్తించబడిన 100 నగరాల్లో ప్లగ్ అండ్ ప్లే ఇండస్ట్రియల్ పార్కులను మంజూరు చేయనున్నట్లు ఆమె తెలిపారు. మేక్ ఇన్ ఇండియా పేరుతో ఇంతకుముందు ఆర్భాటంగా ప్రకటించిన విధానం ఎందుకు విఫలమైందో చెప్పకుండా పారిశ్రామిక నగరాల గురించి బడ్జెట్‌లో అతిశయంగా చెప్పారు. నేషనల్ ఇండస్ట్రియల్ కారిడార్ అభివృద్ధి పథకం 2016లో ప్రారంభించబడింది. ఇది భారత దేశంలోని భవిష్యత్ పారిశ్రామిక నగరాలను అభివృద్ధి చేయాలనే లక్ష్యంతో మౌలిక సదుపాయాలను కల్పిస్తుంది. ఈ కార్యక్రమం లక్ష్యం ఉపాధి అవకాశాలను సృష్టించడం ద్వారా సామాజిక, ఆర్థిక అభివృద్ధికి బాటలు వేయడం. ప్రభుత్వ, ప్రైవేట్ భాగస్వామ్యంతో చేపట్టే ఈ పారిశ్రామిక పార్కుల్లో కార్మికులకు డార్మిటరీ తరహా వసతితో కూడిన అద్దె గృహాలను సమకూర్చనున్నట్లు మంత్రి తెలిపారు. మ్యానుఫాచ్చరింగ్ రంగంలో చిన్న మధ్యతరహా పరిశ్రమలకు రుణ సదుపాయం కల్పిస్తామ . కష్టకాలంలో ఉన్న ఎంఎస్ఎంఇలకు రుణ సదుపాయం కల్పిస్తామన్నారు.. ముద్ర లోన్ కింద ఇప్పుడిస్తున్న పది లక్ష రూపాయల పరిమితిని 20 లక్షలకు పెంచుతున్నామని చెప్పారు. దేశీయంగా ఖనిజ ఉత్పత్తి, రిసైక్లింగ్, విదేశాల నుంచి సేకరణ కోసం క్రిటికల్ మినరల్స్ మిషన్‌ను ఏర్పాటు చేస్తున్నటు తెలిపారు. పరిశ్రమలు అభివృద్ధి చెందాలంటే, ప్రజల కొనుగోలు శక్తి పెరగాలి. అందుకు కార్మికుల వేతనాలు పెంచాలి. కీలకమైన ఈ అంశాన్ని ఈ బడ్జెట్‌లో విస్మరించారని నిపుణులు విమర్శించారు.

'నీట్' రద్దు అవసరం లేదు : సుప్రీం తీర్పు

న్యూఢిల్లీ : వివాదాలకు కేంద్ర బిందువుగా మారిన నీట్ యూజి పరీక్షను రద్దు చేయనవసరం లేదని సుప్రీంకోర్టు మంగళవారం స్పష్టం చేసింది. ప్రశ్నాపత్రం లీకేజిలో వ్యవస్థాగతమైన ఉల్లంఘనలేవీ జరగలేదని, అందువల్ల పరీక్ష పవిత్రత దెబ్బతినలేదని వ్యాఖ్యానించింది. పరీక్షను రద్దు చేయాలని కోరుతున్న పిటిషన్లను తోసిపుచ్చింది. ఈ పరీక్షను తిరిగి నిర్వహించడం వల్ల దాదాపు 23లక్షల మంది విద్యార్థులు ఇబ్బందులు పడతారని ప్రధాన న్యాయమూర్తి చంద్రచూడ్ నేతృత్వంలోని త్రిసభ్య ధర్మాసనం వ్యాఖ్యానించింది. పైగా భవిష్యత్తులో అర్హులైన వైద్య నిపుణులు అందుబాటులో వుండేందుకు ఆటంకం కలుగుతుందని పేర్కొంది. పరీక్షలో ఇచ్చిన ఫిజిక్స్ ప్రశ్నకు సరైన సమాధానం ఏదో చెప్పాలంటూ నిపుణుల కమిటీని కోరిన నేపథ్యంలో నాలుగవ ఆప్షన్ సరైన సమాధానమని కమిటీ చెప్పింది. దీనివల్ల దాదాపు నాలుగు లక్షల మంది విద్యార్థుల మార్కులు ప్రభావితమవనున్నాయి. నాలుగవ ఆప్షన్ కాకుండా ఇతర ఆప్షన్లు పెట్టిన వారికి మార్కుల్లో కోత విధించాల్సిందిగా కోర్టు ఎన్‌టిఎను ఆదేశించింది. మార్కుల్లో కోత పడిన వారిలో పూర్తి స్థాయిలో వందశాతమూ మార్కులు సాధించిన వారు 44మంది వున్నారు. వీరందరికీ నాలుగు మార్కులు చొప్పున తగ్గాయి. సవరించిన మార్కుల జాబితాను వెంటనే అప్‌డేట్ చేయాల్సిందిగా కోర్టు ఎన్‌టిఎను ఆదేశించింది. ఎనిమిది కేంద్రాల్లో తప్పుడు ప్రశ్నాపత్రాలను పంపిణీ చేయడంపై ఎన్‌టిఎకు కోర్టు పలు కఠినమైన ప్రశ్నలు సంధించింది. అందువల్లే ఆ ప్రశ్నా పత్రాలు రాసిన విద్యార్థులందరికీ గ్రేస్ మార్కులు కలపాలని నిర్ణయించింది. ప్రశ్నాపత్రాల లీక్స్ విస్తృతంగా జరిగాయా? జరిగితే సరైన సాక్ష్యాధారాలను చూపించాలంటూ మరోవైపు పిటిషనర్లను కోరింది.

ఆర్థిక ఇబ్బందుల వల్లే ఓట్ ఆన్ ఎకౌంట్

(మొదటిపేజీ తరువాయి)

కేసు పెట్టిందన్నారు. విచారణ అధికారిపై కేసు పెడితే హైకోర్టుకు వెళ్లి బెయిల్ తీసుకోవడం విడ్డూరంగా ఉందన్నారు. నేరస్తుడే సిఎం అయితే పోలీసులు కూడా వారికే వంతపాడే పరిస్థితి వస్తుందన్నారు.

కేంద్రం అండతోనే రాష్ట్రం అభివృద్ధి : పవన్ కల్యాణ్

40 ఏళ్ల అనుభవం కలిగిన ముఖ్యమంత్రి చంద్రబాబుకు రాష్ట్రం అభివృద్ధి కోసం తాపత్రాయ పడుతున్నారని ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ పేర్కొన్నారు. కేంద్రం సహకారంతో రాష్ట్రం అభివృద్ధి చెందుతుందన్నారు. పరిధి దాటి సోషల్ మీడియాలో ప్రవర్తిస్తున్న నేతలపై చర్యలకు సభలో చర్చ జరగాలన్నారు. వ్యక్తులు చేసే తప్పులను పార్టీకి, ప్రభుత్వానికి ఆపాదించవద్దని కోరారు. మాజీ మంత్రి కాల్వ శ్రీనివాసులు మాట్లాడుతూ 2014 నుంచి 2019 మధ్య రాష్ట్రానికి ఉజ్వల భవిష్యత్తు కల్పించగా వైసిపి పాలనలో రాష్ట్రం అథోగతి పాలైందన్నారు. అమరావతిని, పోలవరం ను సర్వనాశనం చేశారని అన్నారు. శాంతిభద్రతల సమస్యలతో రాష్ట్రం నేర ఆంధ్ర ప్రదేశ్‌గా మారిందన్నారు. నియంత పోకడలు, ఎవ్వరు చెప్పినా వినకుండా రాష్ట్రం అభివృద్ధి గురించి పట్టించుకోకుండా కక్షసాధింపు, జె టాక్సులతో పారిశ్రామిక వేత్తలను తరమివేశారని అన్నారు. ఎమ్మెల్యేలు గౌతు శిరీష, విష్ణుకుమార్ రాజు, వై.శ్రీనివాసరావు, సుజనా చౌదరి,ఆర్.మాధవి తదితరులు మాట్లాడారు. సుదీర్ఘ చర్చ అనంతరం సభలో గవర్నర్ ప్రసంగానికి ధన్యవాదాలు తెలిపే తీర్మానంకు ఆమోదం తెలిపినట్టు స్పీకర్ అయ్యన్నపాత్రుడు తెలిపారు.

మాటల్లోనే ఆర్భాటం.. చేతలేవి?

- బడ్జెట్‌పై సిఐటియు విమర్శ

న్యూఢిల్లీ : కేంద్ర బడ్జెట్ ప్రజా వ్యతిరేక, బడా వ్యాపార వర్గాల అనుకూల బడ్జెట్ అని సిఐటియు విమర్శించింది. అభివృద్ధి, ఉపాధి, ప్రజా సంక్షేమం అంటూ గొప్పగా, ఆర్భాటంగా మాటలు చెబుతూ ఆచరణలో ప్రజలను మోసం చేశారంటూ సిఐటియు అధ్యక్షురాలు కె.హేమలత, ప్రధాన కార్యదర్శి తపన్‌సేన్ విమర్శించారు. బడ్జెట్‌ను ఒకసారి అవలోకిస్తే, రెవిన్యూ దాదాపు 15శాతం మేర పెరిగిన ఖర్చు ఆరు శాతం కూడా లేదని విమర్శించింది. పైగా కనీవిని రీతిలో నిరుద్యోగం, ఆహార ద్రవ్యోల్బణం రేటు పెరగడంతో సామాన్యులు ఇబ్బందులు పడుతుంటే ఈ బడ్జెట్ వల్ల లబ్ధి పొందింది కేవలం బడా వ్యాపార వర్గాలేనని విమర్శించింది. దుర్భర దారిద్ర్యంలో కొట్టుమిట్టాడుతున్న పేదలు ఎదుర్కొంటున్న సమస్యలు వేటినీ ఈ బడ్జెట్‌లో పరిష్కరించలేదని తపన్‌సేన్ పేర్కొన్నారు. వివిధ రకాల రాయితీల పేర్లతో ప్రభుత్వ నిధులు ప్రైవేటు కార్పొరేట్ సంస్థల జేబుల్లోకి వెళ్లేలా చేశారని నిరసన వ్యక్తం చేశారు. మహిళా, శిశు సంక్షేమాభివృద్ధికి కేవలం 2.5 శాతం కేటాయింపులు పెరిగాయని, గ్రామీణ ఉపాధి హామీ పథకానికి అసలు కేటాయింపులే పెరగలేదని అన్నారు. వ్యవసాయ రంగంలో సంక్షోభం తీవ్రంగా వున్న సమయంలో, గ్రామీణ నిరుద్యోగిత పెరిగిపోయిన తరుణంలో ఆధార్ ఆధారిత చెల్లింపుల వ్యవస్థ ప్రవేశపెట్టడంతో పరిస్థితి మరింత దిగజారిందని వారు పేర్కొన్నారు. కార్మిక సంక్షేమ నిధిలో కోత విధించారన్నారు. గ్రామీణాభివృద్ధి నిధుల్లో కూడా ఏకంగా 20శాతం కోత పెట్టారన్నారు. పంటల బీమా పథకంలోకూడా రూ.1500కోట్ల మేర కోత విధించారన్నారు. ఆహార, ఎరువుల సబ్సిడీలను దారుణంగా తగ్గించారని విమర్శించారు. ఏ రంగం చూసినా నిధుల కేటాయింపులు అరకొరగానే వున్నాయన్నారు. ఇంధన పరివర్తన ద్వారా ఇంధన భద్రతకు చర్యలు తీసుకోవడమంటే వ్యూహాత్మక ఇంధన రంగాన్ని ప్రైవేటీకరించేందుకు ఉద్దేశించిన చర్యే అని విమర్శించారు. కార్మిక వర్గ తిరోగమన చర్యలతో కూడిన ఈ బడ్జెట్‌ను నిరసిస్తూ ఆందోళనలు, నిరసనలు చేపట్టాల్సిందిగా సిఐటియు కార్మిక లోకానికి పిలుపునిచ్చింది.

ఎన్‌పిఆర్‌డి ఆందోళన

బడ్జెట్‌లో వికలాంగులను అసలు పట్టించుకోలేదని జాతీయ వికలాంగుల హక్కుల వేదిక విమర్శించింది. ప్రభుత్వ ప్రాధాన్యతలేవీ సరిగా లేవని, బడ్జెట్ తీరు చూస్తుంటే అర్థమవుతోందని పేర్కొంది. వికలాంగుల సాధికారతా విభాగానికి కేటాయింపులు పెరగలేదని తెలిపింది. బలహీన వర్గాలను, వికలాంగులను పట్టించుకోని ఈ ప్రభుత్వ విధానాలను నిరసిస్తూ రాష్ట్రాల్లో నిరసనలు చేపట్టాల్సిందిగా పిలుపునిచ్చింది.

విద్యారంగ అవసరాలు తీర్చడంలో విఫలం : ఎస్ఎఫ్ఐ విమర్శ

భారతదేశ విద్యా రంగం ఎదుర్కొంటున్న కీలక అవసరాలను నెరవేర్చడంలో ఈ బడ్జెట్ విఫలమైందని ఎస్ఎఫ్ఐ అధ్యక్షుడు వి.పి. సాను, ప్రధాన కార్యదర్శి మయూఖ్ బిశ్వాస్ ఒక ప్రకటనలో విమర్శించారు. స్కూలు విద్యకు బడ్జెట్ కేటాయింపులు చాలా తక్కువగా పెరిగాయని, అంటే ప్రాథమిక విద్యను ప్రభుత్వం పట్టించుకోలేదని అర్థమవుతోందని వారన్నారు. భావి భారత పౌరుల ఆరోగ్యాన్ని, విద్యను ప్రభుత్వం నిర్లక్ష్యం చేసిందన్నారు. బాలల పోషకాహారం పెంపులో కీలక పాత్ర పోషిస్తు అంగన్‌వాడీలకు అసలు ప్రాధాన్యతే లేకుండా పోయిందని ఎస్ఎఫ్ఐ విమర్శించింది.

పేదలు, మహిళలు, అన్నదాతలకు ద్రోహం: ఎఐకెఎస్

పేదలకు, మహిళలకు, అన్నదాతలకు కేంద్ర బడ్జెట్ ద్రోహం చేసిందని ఎఐకెఎస్ విమర్శించింది. మరింత కేంద్రీకరణకు, రాష్ట్రాల సమాఖ్య హక్కుల ఉల్లంఘనకు మార్గం సుగమం చేసే విధంగానూ, వ్యవసాయ రంగాన్ని కార్పొరేట్లకు దోచిపెట్టి, వారి లాభాలను పెంచేవిధంగా బడ్జెట్ ఉందని పేర్కొంది. 2019 నుంచి కేంద్ర బడ్జెట్‌లో వ్యవసాయం, అనుబంధ రంగాలకు కేటాయింపులు 5.44 శాతం నుంచి 3.15 శాతానికి నిరంతరం తగ్గుతూ వస్తున్నాయని తెలిపింది. ఉపాధి హామీ పథకానికి, పిఎం-కిసాన్, ఫసల్ బీమా యోజన వంటి పథకాలకు ఒక్క రూపాయి కూడా కేటాయింపులు పెరగలేదని విమర్శించింది. వ్యవసాయానికి మొదటి ప్రాధాన్యత ఇచ్చామని చెప్పిన మంత్రి నిజానికి కార్పొరేట్లకు తొలి ప్రాధాన్యత ఇచ్చారని పేర్కొంది. ఉపాధి హామీ పథకానికి కేటాయింపులు పెంచకపోవడం గ్రామీణ ప్రాంతాల నుంచి వలసలను పెంచుతుందని తెలిపింది. ఆర్థిక మంత్రి ప్రకటించిన జాతీయ సహకార విధానం రాష్ట్రాల సమాఖ్య హక్కులపై స్పష్టమైన దాడి అని, సహకార సంఘాలను కేంద్ర ప్రభుత్వ నియంత్రణలోకి తీసుకురావడానికి మార్గమని విమర్శించింది. సహకార సంఘాలకు కేటాయింపులు 30.5 శాతం క్షీణించడం గమనిస్తే ప్రభుత్వ వంచనను అర్థం చేసుకోవచ్చునని తెలిపింది.

మోడీ ప్రభుత్వ ప్రయోజనాలను కాపాడే 'రాజకీయ కసరత్తు'

- కేరళ ఆర్థిక మంత్రి

తిరువనంతపురం : కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన వార్షిక బడ్జెట్‌పై కేరళ ఆర్థిక మంత్రి కె.ఎన్. బాలగోపాల్ తీవ్రంగా విమర్శించారు. ఇది ఓ "జిమ్మిక్కు" అని, బిజెపి నేతృత్వంలోని ఎన్‌డిఎ ప్రభుత్వ ప్రయోజనాలను కాపాడేందుకు ఉద్దేశించిన 'రాజకీయ కసరత్తు'గా అభివర్ణించారు. కేంద్ర బడ్జెట్ దేశప్రజలందరినీ తీవ్రంగా నిరాశపరిచిందని మండిపడ్డారు. కేరళతో పాటు బడ్జెట్‌లో న్యాయమైన డిమాండ్ల పరిష్కరణలో విఫలమైందని అన్నారు.

రూ.24వేలకోట్ల ప్రత్యేక ఆర్థిక ప్యాకేజీ కేరళ డిమాండ్‌ను బడ్జెట్ పట్టించుకోలేదని అన్నారు. విజింజం అంతర్జాతీయ ఓడరేవు ప్రాజెక్టుకు రూ.5వేల కోట్ల ప్రత్యేక సహాయం, మరియు ఆల్ ఇండియా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ (ఎయిమ్స్) కోసం చాలాకాలంగా ఉన్న డిమాండ్లను పక్కనపెట్టిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆర్థికమంత్రి నిర్మలా సీతారామన్ బడ్జెట్‌లో కీలక రంగాల కేటాయింపులను కుదించారని ధ్వజమెత్తారు. ఆహార సబ్సిడీ 2022-23లో రూ.2,72,000 కోట్ల నుండి రూ.2,05,250 కోట్లకు తగ్గించారు. ఎరువుల సబ్సిడీని రూ.2,51,000 నుండి రూ.1,64,000 కోట్లకు తగ్గించారని, ఎంజిఎన్ఆర్ఇజి పథకానికి కూడా 2022-23లో రూ.90,806 కోట్ల నుండి రూ.86,000 కోట్లకు పడిపోయిందని అన్నారు.

బడ్జెట్‌లో ఉపాధి కల్పన గురించి ప్రత్యేకంగా వ్యాఖ్యానించినప్పటికీ.. ప్రధానమంత్రి ఉపాధి కల్పన పథకానికి కేటాయింపులు రూ.2,733 కోట్ల నుండి రూ.2,300 కోట్లకు తగ్గాయి. రాష్ట్రానికి చెందిన బిజెపి కేంద్ర మంత్రులు, ప్రతిపక్ష యుడిఎఫ్ ఎంపిలతో సహా అందరూ రాష్ట్ర హక్కుల కోసం పోరాడేందుకు ఐక్యంగా నిలబడాలని అన్నారు.

అమరావతికి రూ.15 వేల కోట్ల అప్పు

(మొదటిపేజీ తరువాయి)

విశాఖపట్నం-చెన్నై ఇండస్ట్రియల్ కారిడారలో కొప్పర్తి వద్ద, హైదరాబాద్-బెంగళూరు ఇండస్ట్రియల్ కారిడార్‌లో ఓర్వకల్లు వద్ద మౌలికవసతులు ఏర్పాటు చేస్తామని బడ్జెట్‌లో పేర్కొన్నారు. వెనుకబడిన రాయలసీమ, ప్రకాశం. ఉత్తరాంధ్ర జిల్లాలకు గ్రాంట్లు విడుదల చేస్తామని పేర్కొన్నప్పటికీ ఎంత మొత్తం అన్న విషయంలో స్పష్టత లేదు. రాష్ట్ర ప్రజానీకం డిమాండ్ చేస్తున్న ప్రత్యేకహోదా, విశాఖ ఉక్కు పరిరక్షణ తదితర అంశాలను బడ్జెట్‌లో విస్మరించారు.

కోతలు ఇలా...

గతంతో పోలిస్తే వివిధ రంగాలకు పెద్ద ఎత్తున నిధుల కోతలు కూడా ఉన్నాయి,.

వైజాగ్ స్టీల్ ప్లాంట్‌కు 2023-24 బడ్జెట్‌లో రూ.683 కోట్లు కేటాయిస్తే, 2024-25 బడ్జెట్‌లో రూ.620 కోట్లు కేటాయించారు. అంటేరూ.63 కోట్లు కోత విధించారు. అలాగే విశాఖ పోర్టు ట్రస్ట్‌కు 2023-24 బడ్జెట్‌లో రూ.276 కోట్లు కేటాయిస్తే, 2024-25 బడ్జెట్‌లో రూ.150 కోట్లు కేటాయించారు. అంటే విశాఖ పోర్టు ట్రస్ట్‌కు రూ.126 కోట్లు కోత విధించారు. వైజాగ్ పెట్రోలియం యూనివర్సిటీకి రూ.168 కోట్లు కేటాయించారు. గత బడ్జెట్‌లో కూడా రూ.168 కోట్లు కేటాయించి, సవరించిన అంచనాల్లో దాన్ని కాస్తా రూ.90 కోట్లకు కుదించారు. సెంట్రల్ యూనివర్సిటీ, గిరిజన యూనివర్సిటీకి కేటాయింపులు ఏమీలేవు. సెంట్రల్ యూనివర్సిటీకి గత బడ్జెట్‌లో రూ.112.08 కోట్లు కేటాయించగా, ఈసారి కేటాయింపులేమీ లేవు. అలాగే గిరిజన యూనివర్సిటీకి కూడా గత బడ్జెట్‌లో రూ.40.67 కోట్లు కేటాయించగా, ఈసారి ఏమీ కేటాయించలేదు. కేంద్ర విద్యా సంస్థలు ఐఐటి, ఐఐఎం, ఎన్ఐటి, ఐఐఎస్ఇఆర్, ట్రిపుల్ ఐటి, ఎయిమ్స్ వంటి వాటికి కేటాయింపులు చేయలేదు. విశాఖ రైల్వేజోన్, కడప ఉక్కు పరిశ్రమ, దుగ్గిరాజపట్నం పోర్టు, వైజాగ్, విజయవాడ మెట్రోలకు సంబంధించి బడ్జెట్‌లో ఊసేలేదు. తిరుపతి జిల్లాలోని మన్నవరం అంశం కూడా బడ్జెట్‌లో చోటుచేసుకోలేదు.

కుర్చీ బచావో బడ్జెట్

- ప్రతిపక్ష పాలిత రాష్ట్రాల విస్మరణ
- మిత్రపక్షాలను ప్రసన్నం చేసుకునే చర్య
- కేంద్రంపై ప్రతిపక్షాల విమర్శ

న్యూఢిల్లీ : కేంద్రం ప్రవేశపెట్టిన బడ్జెట్‌పై ప్రతిపక్షాలు విమర్శలు గుప్పించాయి. ఏపీ, బీహార్‌ల నుంచి బిజెపి నేతృత్వంలోని ఎన్‌డిఎలో కీలక భాగస్వాములుగా ఉన్న మిత్రపక్షాలను ప్రసన్నం చేసుకునే యత్నం అని, కుర్చీని రక్షించుకునే చర్య అని పేర్కొన్నాయి. ధరల పెరుగుదల, నిరుద్యోగం, రైతుల సమస్యలను పరిష్కరించటానికి ఎటువంటి నిర్దిష్ట ప్రతిపాదనలను అందించలేదని తెలిపాయి. బడ్జెట్‌లో ప్రతిపక్ష పాలిత రాష్ట్రాలను విస్మరించారనీ, మిత్రపక్షాలను బుజ్జగించే చర్యలే కనబడ్డాయని వివరించాయి.

బడ్జెట్ విషయంలో కేంద్రంపైప కాంగ్రెస్ తీవ్రంగా విమర్శలు గుప్పించింది. ఎంప్లాయ్‌మెంట్ లింక్డ్ ఇన్సెంటివ్ (ఇఎల్ఐ) పథకం, అప్రెంటీస్‌షిప్ పథకం, ఏంజెల్ టాక్స్ రద్దు వంటి కొన్ని ప్రకటనల క్రెడిట్ తమదేనని చెప్పింది. కేంద్రం యువత, రైతుల ప్రయోజనాలను విస్మరించిందని సమాజ్‌వాదీ పార్టీ (ఎస్పీ) ఆరోపించింది. బీజేపీ పదేండ్ల వైఫల్యాలను దాచిపెట్టే మోసపూరిత చర్యగా బడ్జెట్‌ను సిపిఐ అభివర్ణించింది. ద్రవ్యోల్బణం, అసమానత, నిరుద్యోగం వంటి అంశాలను పరిష్కరించటంలో ప్రభుత్వ వైఫల్యంపై సిపిఎం నిరసనను ప్రకటించింది. మోడీ సర్కారు ప్రవేశపెట్టిన బడ్జెట్ జీరో గ్యారెంటీ, జీరో వారంటీతో పనికి రాని బడ్జెట్ అని తృణమూల్ కాంగ్రెస్ అభివర్ణించింది. "ఇది కుర్చీ బచావో బడ్జెట్. కాపీ అండ్ పేస్ట్" అని కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే, లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ అన్నారు.

కాంగ్రెస్ న్యాయ అజెండానూ కాపీ చేయలేకపోయింది



"ఎన్‌డిఎ మనుగడ కోసం తన సంకీర్ణ భాగస్వాములకు అర్థహృదయంతో ఉచితాలు పంపిణీ చేస్తున్నందున కాపీక్యాట్ బడ్జెట్ కనీసం కాంగ్రెస్ న్యాయ అజెండాను సరిగ్గా కాపీ కూడా చేయలేకపోయింది. ఇది దేశ ప్రగతికి బడ్జెట్ కాదు.. 'సేవ్ మోడీ గవర్నమెంట్' బడ్జెట్'. దళితులకు, ఆదివాసీలకు, వెనుకబడిన తరగతులకు, మైనారిటీలకు, మధ్యతరగతి, గ్రామీణ పేదలకు విప్లవాత్మక పథకం లేదు. ప్రజలు కాంగ్రెస్ - యుపిఎ అమలు చేసిన విధానాన్ని ఇష్టపడుతున్నారు. మహిళల కోసం ఈ బడ్జెట్‌లో వారి ఆర్థిక సామర్థ్యాన్ని పెంపొందించే, శ్రామికశక్తిలో మరింత ఎక్కువగా పాల్గొనేలా చేసేది ఏమీ లేదు"

- కాంగ్రెస్ అధ్యక్షులు మల్లికార్జున ఖర్గే

'నిరుద్యోగాన్ని పరిష్కరించటంలో ప్రభుత్వ ప్రతిస్పందన చాలా తక్కువగా ఉన్నది. ఇది తక్కువ ప్రభావాన్ని మాత్రమే చూపుతుంది. అయితే బడ్జెట్‌లో ఏదీ కూడా ప్రజలకు ద్రవ్యోల్బణాన్ని 'తీవ్రంగా పరిష్కరిస్తుంది' అనే విశ్వాసాన్ని ఇవ్వలేదు"

- కేంద్ర మాజీ ఆర్థిక మంత్రి పి. చిదంబరం

"ఒడిశా, ఏపీ, బీహార్ ప్రత్యేక కేటగిరీ కోసం అడుగుతుండగా.. రెండు రాష్ట్రాలు ప్రత్యేక నిధులు పొందాయి. అయితే ఒడిశా డిమాండ్ పరిగణించబడలేదు. ఇది.. రాష్ట్రంలో 21 మంది లోక్‌సభ ఎంపీలలో 20 మంది బీజేపీ ఎంపీలను ఎన్నుకున్నందుకు ఒడిశాకు పడిన శిక్ష. ఏపీ, బీహార్‌లలోని బీజేపీ మిత్రపక్షాలకు బహుమానం"

- బిజెడి రాజ్యసభ సభ్యులు సస్మిత్ పాత్ర

రైతుల ప్రయోజనాలను విస్మరించారు



"యువత, రైతుల ప్రయోజనాలను బడ్జెట్ విస్మరించింది. బీహార్, ఏపీలకు ప్రకటనలు బిజెపి తన ప్రభుత్వాన్ని రక్షించుకోవటానికే కారణంగా ఉన్నాయి. బడ్జెట్‌లో యూపీకి ఏదైనా ఉందా?"

- ఎస్పి అధినేత అఖిలేశ్ యాదవ్

ఇథియోపియోలో విరిగిపడ్డ కొండచరియలు

- 157కు పెరిగిన మృతుల సంఖ్య

అడిస్ అబాబా : ఇథియోపియోలో ఆదివారం రాత్రి మారుమూల ప్రాంతంలో కొండచరియలు విరిగిపడటంతో మరణించిన వారి సంఖ్య మంగళవారానికి 157కు చేరుకుంది. మృతుల్లో చిన్నపిల్లలు, గర్భిణులు కూడా ఉన్నారని స్థానిక అధికారులు తెలిపారు. దక్షిణ ఇథియోపియాలోని కెంచో షాచా గోజ్డి జిల్లాలో ఆదివారం రాత్రి కొండచరియలలు విరిగిపడ్డాయి. ఈ ప్రమాదం నుంచి ఐదుగుర్ని సహాయక బృందం రక్షించింది. గల్లంతైన వారికోసం మంగళవారం కూడా గాలింపు చర్యలు కొనసాగాయి. వర్షాకాలం నేపథ్యంలో ఇథియోపియాలో జులై నుంచి సెప్టెంబర్ వరకూ కొండచరియలు విరిగిపడటం సాధారణ విషయం.


కాశ్మీర్ వార్తాపత్రిక యజమానికి సుప్రీం బెయిల్

న్యూఢిల్లీ : అధికార రహస్యాల చట్టం కింద ఈ నెల ప్రారంభంలో అరెస్టయిన జమ్మూకు చెందిన వ్యాపారవేత్త, వార్తాపత్రిక యజమాని తరుణ్ బెహ్లోకు సుప్రీంకోర్టు మంగళవారం మధ్యంతర బెయిల్ మంజూరు చేసింది. భద్రత ఉపసంహరించుకున్న వ్యక్తుల జాబితాను ప్రచురించినందుకు ఈ నెల 10న జమ్ము నగరంలోని అతని నివాసం నుంచి తరుణ్ బెహ్లోను పోలీసులు అరెస్టు చేశారు. ఆయన నివాసాల్లోనూ సోదాలు నిర్వహించారు. తనపై కేసు గురించి ఎలాంటి ఇంటర్వ్యూ కానీ, వార్తను కానీ తరుణ్ ప్రచురించకూడదని, అనుమతి లేకుండా జమ్ముకాశ్మీర్ విడిచి వెళ్లకూడదని సుప్రీంకోర్టు షరతు విధించింది. తరుణ్ బెహ రెగ్యులర్ బెయిల్ పిటీషన్‌ను ఆగస్టు 9కి వాయిదా వేసింది. అలాగే, 'కేసు దర్యాప్తును ప్రారంభించిన దగ్గర నుంచే నిందితుడిని దోషిగా చిత్రీకరించకూడదు. కేసు విచారణలో ఉన్న సమయంలోనే కేసుకు సంబంధించిన సాక్ష్యాధారాలను పోలీసులు వెల్లడించాలి. నిందితుడిని లేదా అను మానితున్ని నిర్బంధించకూడదు. దీనివల్ల నిందితుడు జైలు శిక్షను అనుభవిస్తుంటాడు, కానీ దర్యాప్తు నిజమైన ప్రయోజనం నెరవేరదు' అని జస్టిస్ రాహుల్ భర్తి నేతృత్వంలోని ధర్మాసనం తన బెయిల్ తీర్పులో పేర్కొంది.

ప్రజల నుండే వసూళ్లు

రాజధాని అప్పు తీర్చే మార్గాలపై 2016లోనే సిఆర్‌డిఏ ప్రతిపాదన

అప్పట్లో ప్రపంచబ్యాంకు, ఎడిబి రుణం కోసం ప్రయత్నాలు



ప్రజాశక్తి - విజయవాడ ప్రతినిధి

రాజధాని అమరావతి నిర్మాణం కోసం రుణాలు తీసుకుంటే తిరిగి ఎలా చెల్లించాలనే అంశంపై 2016లో సిఆర్‌డిఏ ఒక ప్రతిపాదన రూపొందించింది. అమరావతి సస్టెయినబుల్ క్యాపిటల్ సిటీ డెవలప్‌మెంట్ ప్రాజెక్టు(ఎఎస్‌సిసిడిపి)కాన్సెప్ట్ నోటు(పిసిఎన్) పేరుతో దీనిని తయారు చేసింది. తాజాగా రాజధాని నిర్మాణానికి ప్రపంచబ్యాంకు నుండి అప్పు ఇప్పిస్తామని కేంద్ర ఆర్థికశాఖ మంత్రి చేసిన ప్రకటనతో దీనికి ప్రాధాన్యత వచ్చింది. నిజానికి అప్పట్లోనే ఆ ప్రతిపాదనను రాష్ట్ర పర్యటనకు వచ్చిన ప్రపంచబ్యాంకు ప్రతినిధి రఘు కేశవన్‌కూ ఈ వివరాలను అధికారులు అందచేశారు. దీన్ని పరిశీలించిన కేశవన్ నేతృత్వంలో బృందం రోడ్లు, మురుగునీరు, వర్షపునీటి పారుదల, చెత్త నిర్వహణ వంటి సదుపాయాలకు నిధులు ఇవ్వాలని నిర్ణయించింది. వాటి వినియోగం ద్వారా వచ్చే అదాయం ద్వారానే తిరిగి చెల్లింపులు చేసే విధంగా ప్రణాళికలు రూపొందించింది. అప్పట్లో ఈ ప్రతిపాదనలపై పెద్దఎత్తున విమర్శలు వ్యక్తమయ్యాయి. ఫిర్యాదులూ వెళ్లడంతో నిధులు రాక ఆగిపోయింది. తాజాగా కేంద్రం నిర్ణయంతో ఈ ప్రతిపాదనలే మళ్లీ తెరపైకి వస్తాయన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది.

అప్పట్లోనే 47 వేల కోట్ల రూపాయలు

మొత్తంగా రాజధాని అభివృద్ధికి రూ.47 వేల కోట్లు ఖర్చవుతుందని, రాష్ట్రం రూ.20 వేల కోట్లు ఖర్చు చేస్తే కేంద్రం రూ.5 వేల కోట్లు ఇస్తుందని, మిగిలింది అప్పు తెచ్చుకోవాలని 2015 డిసెంబర్లో అంచనాలు వేశారు. ప్రపంచబ్యాంకు, ఆసియా డెవలప్‌మెంట్‌బ్యాంకు, జైకా వంటి సంస్థలనుండి సేకరించాలని, సిఆర్‌డిఏ ద్వారా ఈ మొత్తాన్ని తీసుకోవాలనీ నిర్ణయించారు. దీనికోసం ప్రపంచబ్యాంకుకు దరఖాస్తు చేశారు. తీసుకున్న అప్పును పదేళ్ల తరువాత నుండి తిరిగి చెల్లించాల్సి ఉంటుందని, అదెలా చేస్తారో వివరణ ఇవ్వాలని అప్పట్లో ప్రపంచబ్యాంకు ప్రతినిధి బృందం సిఆర్‌డిఏ అధికారులను అడిగింది. దీనిపై రెండుసార్లు సమావేశాలూ జరిగాయి. ఈ సమావేశాలకు అప్పటి సిఆర్‌డిఏ కమిషనర్ సిహెచ్. శ్రీధర్ నాయకత్వం వహించారు. ఖర్చు పెట్టిన చోట స్పష్టమైన ఆదాయా మార్గాల వివరాలను లిఖిత పూర్వకంగా ప్రపంచబ్యాంకుకు సమర్పిస్తేనే నిధులు విడుదల చేస్తామనీ తెలిపారు. దీంతో ఏయే పద్ధతుల్లో నిధులు వస్తాయని అనుకుంటున్నారో. అలాగే ఆదాయ మార్గాలను ఎలా పెంచాలనుకుంటున్నారన్న అంశాలపై ఒక నివేదిక ఇచ్చారు. దీనిలో చేపట్టిన నుండి నుండి యూజర్ ఛార్జీల నుండి డబ్బులు వసూలు చేయనున్నట్లు, రోడ్ల వినియోగానికి కిలోమీటరుకు ఇంత చొప్పున వసూలు చేస్తామనీ నివేదికలో పేర్కొన్నారు.

ఆ నివేదికలో కొన్ని అంశాలు

- ప్రస్తుతం అమరావతి నగర పరిధి ఉన్న గ్రామీణ ప్రాంతాన్ని సిటీగా మార్చడం వల్ల పన్నుల రూపంలో ఆదాయం పెరుగుతుంది.
- మంచినీరు, విద్యుత్, ఆహ్లాదం, మురుగునీటి పారుదలకు విధించే పన్నుల రూపంలో మరికొంత ఆదాయం.
- ఆదాయ స్పష్టత కోసం రాజధాని ప్రాంతం మొత్తాన్ని పట్టణాభివృద్ధిశాఖ పరిధిలోకి
- సిఆర్‌డిఏ రీజియన్ పరిధిలో అభివృద్ధి కోసం ఇస్తున్న పర్మిషన్ల ఫీజులు పెంపు
- సిఆర్‌డిఏ విస్తీర్ణాన్నీ 8600 చదరపు కిలోమీటర్లకు పెంపు. (తర్వాత అమలు చేశారు.)
- వీలైన అన్ని చోట్ల యూజర్ ఛార్జీల వసూలు
- రాజధాని పరిధిలో వేసే రోడ్డుకు కిలోమీటరుకు రూపాయి నుండి ఆరు రూపాయల వరకూ టోల్‌ఛార్జీ. .
- నగరం అభివృద్ధి చెందిన అనంతరం అనేక కంపెనీలు వస్తాయని, వాటి నుండి చట్టపరంగా వచ్చే పన్నులు



కష్ణమ్మ పరవళ్లు..

- శ్రీశైలం జలాశయానికి భారీగా వరద ప్రవాహం

ప్రజాశక్తి - అమరావతి

ఎగువ పరివాహక ప్రాంతాల నుంచి శ్రీశైలం జలాశయానికి వరద నీరు భారీగా వచ్చి చేరుతోంది. జూరాల జలాశయం నుంచి లక్షా 75 వేల క్యూసెక్కులకు పైగా వరద నీటిని దిగువకు విడుదల చేశారు. మంగళవారం మధ్యాహ్నం నాటికి 1,50,900 క్యూసెక్కుల వరద ప్రవాహం శ్రీశైలం జలాశయానికి వచ్చి చేరుతోంది. ఔట్ ఫ్లో నిల్‌గా ఉంది. పూర్తి స్థాయి నీటిమట్టం 885 అడుగులు కాగా.. ప్రస్తుతం 840.10 అడుగులుగా ఉంది. పూర్తిస్థాయి నీటి నిల్వ 215.8070 టీఎంసీలు కాగా.. ప్రస్తుతం 62.0510 టీఎంసీలుగా ఉంది. కుడి, ఎడమ జలవిద్యుత్ కేంద్రాలలో ఎలాంటి విద్యుత్ ఉత్పత్తి జరగడం లేదు. ఇంకా రెండు రోజుల్లో శ్రీశైలం జలాశయానికి భారీగా వరద వచ్చే అవకాశం ఉంది.

నడిరోడ్డుపై విషాదం

- కరెంట్ షాక్‌తో యువకుడి మృతి

న్యూఢిల్లీ: దేశ రాజధానిలె విషాదం చోటుచేసుకుంది. యుపిఎస్‌సి పరీక్షలకు సన్నధమవుతున్న ఓ విద్యార్థి విద్యుత్ షాక్‌కు గురై ప్రాణాలు విడిచాడు. మృతుడిని నీలేష్ రాజ్‌గా గుర్తించారు. పటేల్ నగర్ మెట్రో స్టేషన్ సమీపంలో ఈ దుర్ఘటన జరిగింది. పోలీసుల వివరాలు ప్రకారం నీలేష్ రాజ్ అనే యువకుడు పటేల్ నగర్ హాస్టల్‌లో ఉంటూ సివిల్స్ సర్వీసెస్‌కు ప్రిపేర్ అవుతున్నాడు. అయితే వర్షం కారణంగా రోడ్డుపై నీరు నిలవడంతో అటువైపు వెళ్తున్న నీలేష్ విద్యుత్ షాక్ తగిలి అక్కడికక్కడే కుప్పకూలాడు. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని పరిశీలించగా.. రోడ్డు పక్కనున్న ఇనుప గేటు గుండా కరెంట్ పాస్ అవ్వడంతో విద్యుదాఘాతానికి గురైనట్లు తెలిపారు. నీలేష్‌ను వెంటనే ఆర్‌ఎంఎల్ ఆస్పత్రికి తరలించగా, అప్పటికే మరణించినట్లు వైద్యులు నిర్ధారించారు.

ఈ ఘటనపై కేసు నమోదు చేసుకున్న పోలీసులు.. గేట్‌కు కరెంట్ ఎలా పాస్ అయ్యిందో తెలుసుకునేందనే విషయంపై దర్యాప్తు చేపట్టారు. విద్యుత్ అధికారుల నిర్లక్ష్యం కారణంగా ఓ అమాయక వ్యక్తి ప్రాణాలు కోల్పోయాడని స్థానికులు మండిపడుతున్నారు.

అంబటికి ప్రాణహాని లేదు

ప్రజాశక్తి-అమరావతి

మాజీ మంత్రి అంబటి రాంబాబుకు ఎలాంటి ప్రాణహానీ లేదని జిల్లా ఎస్‌పి నివేదిక ఇచ్చారని హైకోర్టుకు రాష్ట్ర ప్రభుత్వం చెప్పింది. ఈ మేరకు ప్రభుత్వ న్యాయవాది కెఎం కృష్ణారెడ్డి తెలియజేశారు. ఆ నివేదికపై ఏం చేయబోయేదీ తదుపరి విచారణ నాటికి తెలియజేయాలని అంబటిని హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ బొప్పన వరహా లక్ష్మీనరసింహ చక్రవర్తి ఆదేశించారు. తనకు గతంలో ఉన్న భద్రత కొనసాగించాలంటూ అంబటి పిటిషన్‌పై విచారణను ఈ నెల 30కు వాయిదా వేశారు.



ఆగని ఏనుగుల దాడులు

- బాక్సుల్లో నింపిన టమాటాలు ధ్వంసం
- టమాట పంటపై దాడి

ప్రజాశక్తి-సోమల

చిత్తూరు జిల్లా సోమల మండలం ఇరికిపెంట పంచాయతీ పరిధిలోని పంట పొలాలపై ఏనుగుల దాడి కొనసాగుతోంది. బాక్సుల్లో నింపి మార్కెట్‌కు తరలించడానికి సిద్ధంగా ఉంచిన టమోటాలను ఏనుగులు ధ్వంసం చేశాయి. భాను ప్రకాష్ నాయుడు, కష్ణమ్మ నాయుడు, నాగేశ్వరరావు, మణి, గొల్లపల్లి మునీశ్వర, శేషమ్మ, వెంకటరత్నం, తదితర రైతులకు చెందిన టమోటా పంటలపై ఐదు ఏనుగుల గుంపు దాడి చేసి తీవ్రంగా నష్టపరిచాయి. దాదాపు 160 టమోటా బాక్సులను ధ్వంసం చేశాయని వారు తెలిపారు. ఇరికిపెంట చెన్నపట్నం చెరువు కట్ట కింద శంకరాపురం వెళ్లే మార్గంలో పలువురి రైతుల టమోటా పంటలపై దాడి చేశాయి. అటవీ శాఖ సిబ్బంది సహాయ సహకారాలు లేకపోవడం కారణంగా తామే టపాసులు కొనుక్కుని వచ్చి ఏనుగుల కదలికలను గుర్తించి వాటిని ఇతర ప్రాంతాలకు తరిమే ప్రయత్నాలు చేస్తున్నామని రైతులు ఆవేదనతో తెలిపారు. కనీసం పంట నష్టం జరిగిన రైతులను కూడా అటు రెవెన్యూ ఇటు ఉద్యానవన శాఖ అటవీ శాఖ వారు వచ్చి పరిశీలించిన పాపాన పోలేదని రైతులంటే వీరికి ఎంత చిన్న చూపు వుందో అర్థమవుతుందని ఆగ్రహంతో రైతులు 'ప్రజాశక్తి'కి తెలిపారు. మండలంలో ఎన్నో సంవత్సరాలుగా ఏనుగుల సమస్య ఉన్న కనీసం వాటిని అరికట్టి రైతులను, పంట పొలాలను కాపాడాలని ప్రజాప్రతినిధులకు, అధికారులకు కానీ లేదని ఇది ఇలాగే కొనసాగితే తాము అప్పులు చేసి పండించిన పంటలు ఏనుగుల ధ్వంసంలో పోగొట్టు కోవాల్సిందేనా? అని ప్రశ్నిస్తున్నారు. ఇకనైనా అధికారులు ఏనుగుల బారి నుండి రైతులను, రైతుల పంట పొలాలను కాపాడి రైతుకు రక్షణ కల్పించాలని రైతులు డిమాండ్ చేస్తున్నారు.

ఆంధ్రకు తుంగభద్ర జలాలు

ప్రజాశక్తి-రాయదుర్గం

తుంగభద్ర జలాలు ఆంధ్ర సరిహద్దుకు మంగళవారం సాయంత్రం చేరుకున్నాయి. బొమ్మనహాళ్ మండలం తుంగభద్ర ఎగువ కాలువ 105వ కిలోమీటర్ వద్ద ఆంధ్ర రాష్ట్ర సరిహద్దులోకి ప్రవేశించాయి. నీటి రాకతో స్థానికులు, రైతులు తుంగభద్ర జలాలకు పూజలు జరిపారు. అనుకున్న సమయానికి కాలువలకు నీరు రావడంపై హర్షం వ్యక్తం చేస్తున్నారు.

అనర్హులకు తహశీల్దారు ఉద్యోగాలు!

- మానసిక వేదనలో సీనియర్లు
- అర్హులు డిటిలుగానే కొనసాగింపు

ప్రజాశక్తి - వెదురు కుప్పం

ఉమ్మడి చిత్తూరు జిల్లాలో 87 మంది తహశీల్దారులు ఉన్నారు. ఇందులో 69 మంది తహశీల్దారులు పార్లమెంటు, అసెంబ్లీ ఎన్నికల సమయంలో వివిధ ప్రాంతాలకు ఉద్యోగ నిమిత్తం బదిలీపై వెళ్లారు. మిగిలిన ఐదుగురు యథాస్థానంలో తహశీల్దారులుగా గానే కొనసాగుతున్నారు.11 మంది తహశీల్దార్‌లు జనవరి జూన్ మధ్యలో ఉద్యోగ విరమణ పొందారు. జిల్లాలో ఇద్దరూ అవినీతి నిరోధక శాఖ దాడుల్లో పట్టుబడి విధులకు దూరంగా ఉన్నారు. ఉద్యోగ విరమణ పొందిన 11మంది తహశీల్దారుల ఉద్యోగ స్థానాలు జిల్లాలో ఖాళీగా ఉన్నాయి. ఈ నియామకాలు డిప్యూటీ తహశీల్దారుగా ఉన్న వారితో ఆ పోస్టులను భర్తీ చేయాలని సీనియర్లు కోరుతున్నారు. ఇదే నియమ నిబంధనలు అని చెబుతున్నారు. గత కాంగ్రెస్ ప్రభుత్వంలో శ్యాం ప్రసాద్ రెడ్డి సీనియర్ అసిస్టెంట్ నుండి డిప్యూటీ తహశీల్దారుగా ఉద్యోగోన్నతి వచ్చింది. ఇతను గత కాంగ్రెస్, వైసిపి ప్రభుత్వాల హయాం నుండి పుంగనూరు నియోజకవర్గ సదుం, సోమల మండలాలలో తహశీల్దారు కార్యాలయంలో విధులు నిర్వహించారు. ఇతను చాలా జూనియర్. అయితే గత ప్రభుత్వం రైతు భూముల రీ సర్వే కోసం తహశీల్దారు కార్యాలయంలో ఉన్న ఆర్ఐ, సీనియర్ అసిస్టెంట్లను డిప్యూటీ తహశీల్దారుగా ఉద్యోగోన్నతిపై నియమించింది. వారిలో కొంత మందిని ప్రస్తుతం తహశీల్దారులుగా కొనసాగుతున్నారు. దీంతో సీనియర్లుగా ఉన్న డిప్యూటీ తహశీల్దారులు, జూనియర్ల కింద విధులు నిర్వహించలేక మనో వేదనకు గురవుతున్నారు. జిల్లా యంత్రాంగం స్పందించి ఈ ఉద్యోగ నియామకాలను క్రమబద్ధీకరణ చేయాలని పలువురు ఉద్యోగ సంఘ నాయకులు, ఉద్యోగస్తులు కోరుతున్నారు. జిల్లా యంత్రాంగం ఎలా స్పందించి ప్రక్షాళన చేస్తుందో వేచి చూడాలని స్థానికులు అభిప్రాయ పడుతున్నారు.

పోర్టుల ప్రైవేటీకరణ ఆపాలి

25, 26 తేదీల్లో రిలే నిరాహార దీక్షలను జయప్రదం చేయండి

ప్రజాశక్తి- విశాఖ కలెక్టరేట్



గేటు మీటింగ్‌లో మాట్లాడుతున్న సిఐటియు నేత జగన్

పోర్టుల ప్రైవేటీకరణ ఆపాలని వాటర్ ట్రాన్స్‌పోర్టు వర్కర్స్ ఫెడరేషన్ (సిఐటియు) జాతీయ కార్యదర్శి బి.జగన్ డిమాండ్ చేశారు. మేజర్ పోర్టులను, ప్రభుత్వ రంగ పరిశ్రమలను ప్రైవేటీకరణ చేయరాదని డిమాండ్ చేస్తూ మంగళవారం విశాఖపట్నం పోర్టులో సెక్షన్ క్వారీగా గేట్ మీటింగులు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయనమాతూ మేజర్ పోర్టులను ల్యాండ్ లార్డ్ పోర్టుగా మార్చడానికి, మరింత దేశ, దేశీ ప్రైవేట్ కంపెనీలను ఆకర్పించడానికి షిప్పింగ్ మినిస్ట్రీ మోడల్ కన్సెషన్ అగ్రిమెంట్ ఎంసిఎ)లో చాలా మార్పులు చేసిందన్నారు. 2030 నాటికి 80 శాతం మేజర్ పోర్టులను ల్యాండ్ లార్డ్ పోర్టులుగా మార్చే లక్ష్యాన్ని పెట్టుకున్నారని, అందులో విశాఖపట్నం పోర్టు కూడా ఉందని తెలిపారు. ఇప్పటికే కేంద్ర మంత్రి ప్రకటించినట్లు మేజర్ పోర్టుల్లో అధునాతన పోర్టు జెఎన్‌పిటిని వంద శాతం ల్యాండ్‌లార్డ్ పోర్టుగా మార్చేశారన్నారు. దీంతో జెఎన్‌పిటిలో ఉన్న అన్ని బెర్తులు, అన్ని విభాగాలు పిపిపి మోడల్ ప్రైవేట్ ఆపరేటర్లకు అప్పజెప్పారన్నారు. మేజర్ పోర్టులను, ప్రభుత్వ రంగ పరిశ్రమలను ప్రైవేటీకరణ చేయరాదని డిమాండ్ చేశారు .సుప్రీంకోర్టు తీర్పు-2017 ప్రకారం పోర్టు పూల్ కళాసీలను పర్మినెంట్ చేయాలని, పోర్టు పూల్ కళాసీలను ఖాళీ పోస్టుల్లో భర్తీ చేయాలని, సిహెచ్‌డి క్యాజువల్ కార్మికులను పర్మినెంట్ చేసి, అగ్రిమెంట్ ప్రకారం తక్షణం వేతనం పెంచాలని డిమాండ్ చేశారు. ఎపి హైకోర్టు తీర్పును గౌరవించి సిహెచ్‌డి ఆఫీస్ సైడ్ క్యాజువల్స్‌ను పోర్టు యాజమాన్యం తక్షణం రెగ్యులర్ చేయాలని కోరారు. సిహెచ్‌డి షోర్‌లేబర్, లైన్ పికర్స్‌కు, అన్ని రకాల స్టీవ్ డోర్ కార్మికులకు చట్టప్రకారం అన్ని హక్కులూ కల్పించా లని డిమాండ్ చేశారు. విశాఖ పోర్టులో కాంట్రాక్ట్ కార్మికులకు కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని, కార్మికులకు నష్టదాయికమైన 4-లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని కోరారు. దీనిపై ఈ నెల 25, 26 తేదీల్లో పోర్టు వద్ద నిరాహార దీక్షలను జయప్రదం చేయాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో యూనియన్ అధ్యక్షులు సాంబమూర్తి,ప్రధాన కార్యదర్శి సత్యనారాయణ, విడిఎల్‌బి యూనియన్ అధ్యక్ష, కార్యదర్శులు జక్కన సత్యనారాయణ, బి.లక్ష్మణరావు, నాయకులు రామ లింగేశ్వరరావు, త్రినాథరావు పాల్గొన్నారు.



ఆ ట్రోలింగ్ ఆపండి ...

'అల్లు అర్జున్.. నేషనల్ అవార్డ్ విన్నర్. ఆయన్ని అందరూ గౌరవించాలి. మెగా ఫ్యామిలీ అంతా ఒక్కటే. కొందరు అల్లు అర్జున్‌ను ఉద్దేశ్యపూర్వకంగానే ట్రోల్ చేస్తున్నారు. థంబ్ నెయిల్స్ పెడుతున్నారు. దయచేసి అలా చేయొద్దు. ఇక నుంచైనా ఇలాంటివి ఆపేయాలని మనస్ఫూర్తిగా కోరుతున్నా' అని నటుడు హైపర్ ఆది కోరారు. సామాజిక మాధ్యమాల్లో కొందరు మెగా ఫ్యాన్స్ అర్జున్‌ని ట్రోల్ చేస్తున్నారు. 'శివం భజే' మూవీ ట్రైలర్ లాంఛ్ సందర్భంగా ఆది పై వ్యాఖ్యలు చేశారు.

'శివం భజే' ట్రైలర్ విడుదల



అశ్విన్ బాబు హీరోగా 'శివం భజే' అనే చిత్రం తెరకెక్కుతోంది. అప్సర్ దర్శకత్వంలో రూపొందిన ఈ క్రైమ్ ఫాంటసీ థ్రిల్లర్ ట్రైలర్‌ని హీరో విశ్వక్‌సేన్ మంగళవారం విడుదల చేశారు. మర్డర్ మిస్టరీ చుట్టూ అల్లిన కథా నేపథ్యంలో ఈ సినిమా కథ ఉండబోతున్నట్లు తెలుస్తోంది. సల్మాన్ ఖాన్ తమ్ముడు అర్బాజ్ ఖాన్ 'జై చిరంజీవ' చిత్రం తరువాత మరోసారి ఈ సినిమాతో టాలీవుడ్‌కు రీ ఎంట్రీ ఇచ్చారు. మురళీ శర్మ, బ్రహ్మాజీ, తులసి, హైపర్ ఆది ముఖ్య పాత్రలు పోషిస్తున్నారు. వికాస్ బడిస ఈ చిత్రానికి సంగీతం అందించనున్నారు. మహేశ్వర రెడ్డి మూలి నిర్మాతగా వ్యవహరించిన ఈ చిత్రం ఆగస్టు



'సూర్య 44' గ్లింప్స్ రెడీ

ప్రేమ, యుద్ధం నేపథ్యంతో రూపొందుతున్న 'సూర్య 44' సినిమా నుంచి మంగళవారం సూర్య పుట్టినరోజు సందర్భంగా గ్లింప్స్‌ను రిలీజ్ చేశారు. ఈ చిత్రానికి సంబంధించిన టైటిల్ టీజర్ త్వరలో రిలీజ్ కానుంది. ప్రస్తుతం ఈ మూవీ షూటింగ్ అండమాన్ ఐలాండ్‌లో జరుగుతుంది. జోజు జార్జ్, జయరామ్ తదితరులు కీలక పాత్రలు పోషిస్తున్నారు. 2డీ ఎంటర్‌టైన్‌మెంట్స్ పతాకంపై ఈ సినిమాను దర్శకుడు కార్తీక్ సుబ్బరాజు తెరకెక్కిస్తున్నారు. వచ్చే ఏడాది సంక్రాంతికి విడుదల చేసేందుకు సన్నాహాలు చేస్తున్నారు.

రీ రిలీజ్‌కు సమంత సినిమా




టాలీవుడ్‌లో రీ రిలీజ్‌ల జోరు కొనసాగుతోంది. హీరోహీరోయిన్లు గతంలో నటించి హిట్ అయిన సినిమాలను మళ్లీ విడుదల చేస్తున్నారు. గౌతమ్‌మీనన్ దర్శకత్వంలో సమంత, నాని జంటగా నటించిన చిత్రం 'ఏటో వెళ్లిపోయింది మనసు'. 12 ఏళ్ల క్రితం వచ్చిన ఈ ఫీల్ గుడ్ లవ్ స్టోరీ మూవీని మళ్లీ ఆడియెన్స్ ముందుకు తీసుకొస్తున్నారు.

విజయ్ చిత్రంలో కమల్‌హాసన్?



కోలీవుడ్ హీరోలు కమల్‌హాసన్, విజయ్ ఇద్దరూ కలిసి ఓ సినిమాలో నటించబోతున్నారు. వీరిద్దరూ కలిసి నటిస్తున్నారనే సమాచారం ఇప్పుడు సోషల్‌మీడియాలో వైరల్ అవుతోంది. విజయ్ కథానాయకుడిగా వెంకట్ ప్రభు దర్శకత్వంలో నటించిన తాజా చిత్రం 'గోట్'. నిర్మాణాన్ని పూర్తిచేసుకున్న ఈ సినిమా త్వరలోనే విడుదల కాబోతోంది. దీంతో విజయ్ తన 69వ చిత్రానికి సిద్ధమవుతున్నారు. ఇదే ఆయన చివరి చిత్రం అనే ప్రచారం చాలా రోజుల నుంచే జోరుగా సాగుతోంది. ఈ సినిమా కథ పూర్తిగా రాజకీయ నేపథ్యంలో సాగుతుందనే ప్రచారం కూడా ఉంది.

'రానా నాయుడు 2' షూటింగ్ ప్రారంభం



రానా, వెంకటేశ్ ప్రధాన పాత్రల్లో నటించిన వెబ్ సిరీస్ 'రానా నాయుడు'. నెట్‌ఫ్లిక్స్ వేదిగా గతేడాది విడుదలైన ఈ సిరీస్ అత్యధిక వ్యూస్‌ను అందుకుంది. దీనికి సీక్వెల్‌ను తీయబోతున్నామని నెట్‌ఫ్లిక్స్ గతంలోనే ప్రకటించింది. తాజాగా దీనికి సంబంధించిన అప్‌డేట్‌ను ఆ సంస్థ షేర్ చేసింది. సీజన్ 2 షూటింగ్ ప్రారంభమైందని పేర్కొంటూ చిత్రీకరణ జరుగుతున్న చిన్న వీడియోను ఉంచింది. ఈ వీడియోలో రానా, వెంకటేశ్‌ల మధ్య యాక్షన్ సన్నివేశాలు జరుగుతున్నట్లుగా చూపించారు. దీంతో త్వరలోనే సీజన్ 2 ప్రేక్షకుల ముందుకు రానున్నట్లుగా తెలుస్తోంది.


రైల్వేకు రూ.2.62 లక్షల కోట్లు..

- 'కవచ్'పై దృష్టి : అశ్వనీ వైష్ణవ్



న్యూఢిల్లీ : కేంద్ర బడ్జెట్‌లో రైల్వేకు రూ.2.62 లక్షల కోట్లు కేటాయించినట్లు కేంద్ర మంత్రి అశ్వనీ వైష్ణవ్ తెలిపారు. ఈ మొత్తంలో రైల్వేలో భద్రతా వ్యవస్థల మెరుగు, కవచ్ ఇన్‌స్టలేషన్ కోసం పెద్ద మొత్తంలో ఖర్చు చేయనున్నట్లు చెప్పారు. బడ్జెట్‌లో రైల్వేకు సంబంధించిన కేటాయింపులపై విలేకరులతో మంత్రి మాట్లాడారు. బడ్జెట్‌లో రైల్వేకు ఎప్పుడూ లేని విధంగా రూ.2,62,200 కోట్లు కేటాయించినట్లు అశ్వనీ వైష్ణవ్ చెప్పారు. ఇందులో రూ.1.08 లక్షల కోట్లు రైల్వేల భద్రతకు వినియోగించనున్నట్లు తెలిపారు. పాత ట్రాకుల స్థానే కొత్తవి ఏర్పాటు, సిగ్నలింగ్ వ్యవస్థ మెరుగు, ఫ్లై ఓవర్లు, అండర్‌పాస్‌ల నిర్మాణం, కవచ్ వ్యవస్థ ఇన్‌స్టలేషన్ ఇందులో ఉన్నాయన్నారు. ముఖ్యంగా కవచ్‌కు అధిక ప్రాధాన్యం ఇస్తామన్నారు. ఇటీవలే కవచ్ 4.0కు ఆమోదం లభించిందని, ఇన్‌స్టాలేషన్ త్వరితగతిన చేపడతామని వెల్లడించారు. మధ్య తరగతి ప్రయాణికులను దృష్టిలో పెట్టుకుని ఒక్కో రైలులో మూడింట రెండొంతులు సాధారణ కోచ్‌లు, ఒక వంతు ఏసీ కోచ్‌లు ఉండేలా చూస్తున్నట్లు వైష్ణవ్ చెప్పారు. జనరల్ కోచ్‌లకు ఉన్న డిమాండ్ దృష్ట్యా ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలోనే 2,500 అదనపు జనరల్ కోచ్‌లను అందుబాటులోకి తీసుకురానున్నామని, మరో 10వేల సాధారణ కోచ్‌ల తయారీ చేపట్టనున్నామని చెప్పారు. ఈ రెండింటికీ బడ్జెట్‌లో కేటాయింపులు జరిపినట్లు తెలిపారు. గత యుపిఎ ప్రభుత్వ హయాంలో రైల్వే పరిధిలో 4.11 లక్షల కోట్ల ఉద్యోగాలు కల్పించగా.. గత పదేళ్లలో 20 శాతం అధికంగా ఉద్యోగ కల్పన జరిగిందని అశ్వనీ వైష్ణవ్ చెప్పారు.

2033కల్లా రష్యా సొంత స్పేస్ స్టేషన్



మాస్కో: ఇంటర్నేషనల్ స్పేస్‌స్టేషన్(ఐఎస్ఎస్) నుంచి బయటికి వచ్చేందుకు సిద్ధమైన రష్యా 2033నాటికి సొంత స్పేస్ స్టేషన్ ఏర్పాటు చేసుకోనుంది. ఈ విషయాన్ని రష్యాస్టేట్‌స్పేస్‌కార్పొరేషన్ (రోస్‌కోస్మోస్) మంగళవారం ప్రకటించింది. రష్యా ఆర్బిటల్ స్టేషన్(రోస్) ఏర్పాటు షెడ్యూల్‌ను సంస్థ చీఫ్ యూరి బోరిసోవ్ ఆమోదించినట్లు తెలిపింది. అలాగే, రోస్‌ను నిర్మించాలని 2021లోనే నిర్ణయించినట్లు వెల్లడించింది. 2027లో తొలి రీసెర్చ్ ఇంధన మాడ్యూల్‌ను లాంచ్ చేస్తామని వెల్లడించింది. దీని తర్వాత 2030లో యూనివర్సల్ నోడల్, గేట్‌వే, బేస్‌లైన్ మాడ్యూల్స్‌ను నింగిలోకి పంపుతామని తెలిపింది. అనంతరం కీలకమైన స్పెషల్ పర్పస్ మాడ్యూళ్లు టీఎస్ఎమ్1, టీఎస్ఎమ్2లను 2033కల్లా స్టేషన్‌కు అనుసంధానిస్తామని రోస్‌కోస్మోస్ వెల్లడించింది. స్పేస్ స్టేషన్ ప్రాజెక్ట్ కోసం సుమారు 7 బిలియన్ డాలర్ల వ్యయం చేస్తామని రోస్‌కోస్మోస్ తెలిపింది. కాగా, ఉక్రెయిన్‌తో సంక్షోభం నేపథ్యంలో రష్యాను ఒంటరిని చేసేందుకు అమెరికా, యూరప్‌లు రష్యాపై పలు ఆంక్షలు విధించాయి. ఈ ఆంక్షలను వెనక్కి తీసుకోకపోతే ఐఎస్-ఎస్ నుంచి బయటకు వచ్చేస్తామని రష్యా హెచ్చరించింది. ఈ హెచ్చరికకు అమెరికా స్పందించకపోవడంతో ఐఎస్ఎస్ నుంచి బయటికి రావాలని రష్యా నిర్ణయించుకుంది. స్పేస్‌స్టేషన్‌లు వ్యోమగాములకు నింగిలో ఆశ్రయమిస్తూ అంతరిక్ష పరిశోధనలకు దోహదపడతాయి.

బడా కార్పొరేట్ల కోసమే ఈ బడ్జెట్

- సిపిఐ(ఎంఎల్) న్యూ డెమోక్రసీ

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

కేంద్ర బడ్జెట్ ప్రజల కోసం కాకుండా.. బడా కార్పొరేట్ల ప్రయోజనాల కోసమే పెట్టినట్లుగా వుందని సిపిఐ(ఎంఎల్) న్యూ డెమొక్రసీ విమర్శించింది. ఈ మేరకు సిపిఐ(ఎంఎల్) న్యూ డెమొక్రసీ అధికార ప్రతినిధి వై సాంబశివరావు ఒక ప్రకటన విడుదల చేశారు. దేశంలో ధరల పెరుగుదల, నిరుద్యోగం, రైతులకు గిట్టుబాటు ధరలు, రుణమాఫీ వంటి చర్యలు బడ్జెట్‌లో లేవన్నారు. దేశంలో సమాఖ్య స్ఫూర్తిగా తూట్లు పొడిచేలా రాష్ట్రాల పన్నుల వాటాలకు అనుగుణంగా కేటాయింపులు లేవని తెలిపారు.


సభ్యత్వానికి మరో అవకాశం

ప్రజాశక్తి-అమరావతి

న్యాయవాదుల సంక్షేమ నిధిలో సభ్యత్వం లేని వాళ్లకు మరో అవకాశం కల్పిస్తూ బార్ కౌన్సిల్ నిర్ణయం తీసుకుంది. ఈ నెల 21న బార్ కౌన్సిల్ ఛైర్మన్ ఎన్ ద్వారకనాథరెడ్డి అధ్యక్షతన జరిగిన కౌన్సిల్ సర్వసభ్య సమావేశం నిర్ణయం తీసుకుంది. 35 నుంచి 60 ఏళ్ల వయసు న్యాయవాదులు సంక్షేమ నిధిలో సభ్యులుగా చేరవచ్చునన్న నిర్ణయాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఛైర్మన్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

నీతి ఆయోగ్‌కు సిఎంలు బాయ్‌కాట్

- 'వివక్షాపూరిత' బడ్జెట్ అంటూ నలుగురు సిఎంల ఆగ్రహం



న్యూఢిల్లీ : కేంద్రబడ్జెట్ వివక్షపూరితమైనదంటూ.. ఈ నెల 27న జరగాల్సిన నీతి ఆయోగ్ సమావేశాన్ని బాయ్‌కాట్ చేస్తామని నలుగురు ముఖ్యమంత్రులు ప్రకటించారు. వీరిలో తమిళనాడు సిఎం ఎంకె స్టాలిన్, తెలంగాణ ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డి, కర్ణాటక, హిమాచల్‌ప్రదేశ్ సిఎంలు సిద్ధరామయ్య, సుఖ్వీందర్ సింగ్ సుఖు ఉన్నారు. "ఈ బడ్జెట్ వివక్షాపూరితమైనది. ప్రమాదకరమైనది. ఇది పూర్తిగా సమాఖ్యస్ఫూర్తికి విరుద్ధంగా ఉంది. కేంద్ర ప్రభుత్వం తప్పనిసరిగా అనుసరించాల్సిన ఫెడరలిజం , న్యాయమైన సూత్రాలకు భిన్నంగా ఉన్నది" అని నలుగురు సీఎంలు ప్రకటించారు.

మహారాష్ట్ర, హర్యానాలకూ మొండిచేయి!

- ఎన్నికలు జరిగే మిగిలిన రాష్ట్రాల పరిస్థితి ఏంటి?

న్యూఢిల్లీ : అసెంబ్లీ ఎన్నికలు జరిగే రాష్ట్రాలపై కేంద్రంలోని ఎన్‌డిఎ సంకీర్ణ ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ పెడుతుందని, బడ్జెట్‌లో అధిక నిధులు కేటాయిస్తుందని భావించారు. ఈ ఏడాది మహారాష్ట్ర, హర్యానా, జార్ఖండ్, జమ్ముకాశ్మీర్ రాష్ట్రాలకు అసెంబ్లీ ఎన్నికలు జరగనున్నాయి. మహారాష్ట్రలో ఎన్‌డిఎ, హర్యానాలో బిజెపి అధికారంలో ఉన్నాయి. మహారాష్ట్రలో శివసేన (ఏక్‌నాథ్ షిండే), బిజెపి, ఎన్‌సిపి (అజిత్ పవార్ గ్రూపు) అధికారంలో ఉన్నా.. వచ్చే ఎన్నికల్లో ప్రతిపక్ష మహా వికాస్ అఘాడి (ఎంవిఎ) కూటమికి అవకాశాలు పెరుగుతాయని భావిస్తున్నారు. 'మహారాష్ట్రను విస్మరించడాన్ని కేంద్రం కొనసాగిస్తోంది. రాష్ట్రం నుంచి డబ్బు తీసుకునే రాష్ట్రంగా మహారాష్ట్రను మార్చివేశారు' అని శివసేన (ఉద్ధవ్ బాల్ థాకరే (గ్రూపు) ఎంపి ప్రియాంక చతుర్వేది విమర్శించారు.

జార్ఖండ్..

తూర్పు భారతదేశంలో సమగ్ర అభివృద్ధి ప్రాజెక్టు గురించి మంత్రి నిర్మలా సీతారామన్ తన బడ్జెట్ ప్రసంగంలో ప్రస్తావించారు. ఈ ప్రాంతంలో ఉన్న జార్ఖండ్‌కు పెద్దగా నిధులను కేటాయించలేదు. ఈ రాష్ట్రంలో ఇండియా వేదికలోని జార్ఖండ్ ముక్తి మోర్చా (జెఎంఎం) అధికారంలో ఉంది.

జమ్ముకాశ్మీర్

జమ్ముకాశ్మీర్‌కు బడ్జెట్‌లో రూ.42,777 కోట్లు కేటాయించారు. రాష్ట్రంలో మౌలిక వసతుల ప్రాజెక్టులు, సంక్షేమ పథకాలు, ఆర్థిక కార్యక్రమాలకు ఈ నిధులను ఖర్చు చేయనున్నారు. సుదీర్ఘ కాలం తరువాత అసెంబ్లీ ఎన్నికల నిర్వహణకు సిద్ధపడుతుండటంతో ఈ రాష్ట్రానికి కేంద్రం ఈ మేరకు నిధులు కేటాయించిందని భావిస్తున్నారు.

కుటుంబాలతో రాక్ కార్మికుల నిరసన

ప్రజాశక్తి - సామర్లకోట

అక్రమంగా తొలగించిన కార్మికులను విధుల్లోకి తీసుకోవాలని కోరుతూ సిఐటియు ఆధ్వర్యంలో రాక్ సిరామిక్ గేటు ముందు కార్మికులు వారి కుటుంబ సభ్యులతో కలిసి మంగళవారం ఆందోళన నిర్వహించారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి సిహెచ్.రాజ్‌కుమార్ మాట్లా డుతూ కార్మికులను విధుల నుంచి తొలగించి నేటికి 99 రోజులు అయిందన్నారు. కానీ నేటికి కార్మికులను విధుల్లోకి తీసుకోవడం లేదని అన్నారు. కార్మికులను వీధులపాలు చేసి మూడు నెలల కావడంతో ఆయా కార్మికుల కుటుంబాలు ఇంటి అద్దెలు కూడా చెల్లించు కోలేని పరిస్థితికి నెట్టబడ్డారని అన్నారు. కుటుంబాల పోషణ కష్టంగా మారిందని అన్నారు. అందుకే కుటుం బ సభ్యులతో కలిసి నేడు రోడ్డెక్కాల్సిన పరిస్థితిని యాజమాన్యమే తీసుకొచ్చిం దన్నారు. పలువురు కుటుంబ సభ్యులు మాట్లాడుతూ పాఠశాలల్లో ఫీజులు కూడా కట్టలేని పరిస్థితి ఏర్పడిందన్నారు. 18 నుంచి 20 సంవత్సరాల వరకూ కార్మికులు కంపెనీలో పని చేశారని, వారిని అర్థాంతరంగా విధుల నుంచి తొలగిస్తే వారు ఎలా జీవించగల్గుతారని ప్రశ్నించారు. తక్షణం విధుల్లోకి తీసుకోవాలని లేనిపక్షంలో కుటుంబాలతో గేటు ముందు నిరాహారదీక్షకు దిగుతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా కార్యదర్శి డి.క్రాంతికుమార్, ప్రయివేట్ ఎలక్ట్రికల్ వర్కర్స్ యూనియన్ అధ్యక్షులు చింతల సత్యనారాయణ, పెయింటింగ్ వర్కర్స్ యూనియన్ నాయకులు గూనూరు రమణ, వడ్డి సత్యనారాయణ, సిఐటియు అధ్యక్షులు గడిగట్ల సత్తిబాబు, కార్మికులు పాల్గొన్నారు.



ఆందోళన చేస్తున్న కార్మికులు

కన్వర్ యాత్రపై ఎలాంటి ఉత్తర్వులూ జారీ చేయలేదు : మధ్యప్రదేశ్

భోపాల్ : కన్వర్ యాత్రా మార్గంలో దుకాణాలపై తప్పనిసరిగా యజమానుల పేర్లను ప్రదర్శించాలని ఎలాంటి ఉత్తర్వులు జారీ చేయలేదని మధ్యప్రదేశ్ ప్రభుత్వం స్పష్టం చేసింది. ఈ విషయంలో ఎలాంటి గందరగోళానికి గురికావద్దని మున్సిపాల్టీలను ఆ రాష్ట్ర పట్టణాభివృద్ధి మంత్రిత్వ శాఖ ఆదేశించింది. కన్వర్ యాత్రా మార్గంలో ఆహారపదార్థాల దుకాణదారులు, యజమానులు తమ పేర్లు, ఇతర గుర్తింపు వివరాలు తప్పనిసరిగా ప్రదర్శించాలని ఇటీవల ఉత్తరప్రదేశ్, ఉత్తరాఖండ్‌లోని బిజెపి ప్రభుత్వాలు జారీ చేసిన ఉత్తర్వులను సుప్రీంకోర్టు సోమవారం కొట్టివేసిన సంగతి తెలిసిందే. యాత్ర సాగే ఢిల్లీ, మధ్యప్రదేశ్ వంటి రాష్ట్రాలకు సుప్రీంకోర్టు నోటీసులు జారీ చేసింది. మధ్యప్రదేశ్‌లోని కొన్ని మున్సిపాలిటీలు ఇలాంటి విద్వేష ఉత్తర్వులు ఇచ్చాయని కొన్ని మీడియా సంస్థల్లో వార్తలు వచ్చిన నేపథ్యంలో మధ్యప్రదేశ్ రాష్ట్రం స్పష్టతనిచ్చింది.

జెఎన్‌టియు రిజిస్ట్రార్‌పై ఎఫ్‌ఐఆర్ నమోదుకు హైకోర్టు ఆదేశం

ప్రజాశక్తి-అమరావతి

కోర్టు జారీ చేసిన నోటీసులపై స్పందించని కాకినాడ జెఎన్‌టియు రిజిస్ట్రార్‌పై హైకోర్టు ఆగ్రహం వ్యక్తం చేసింది. కావాలనే కోర్టుకు హాజరుకాలేదని తప్పుపట్టింది. అర్హత లేని 48 కాలేజీలు యూనివర్సిటీ గ్రాంట్స్ కమిషన్ (యుజిసి) నుంచి అటానమస్ హోదా పొందే విషయంలో ఆ కాలేజీలతో కుమ్మక్కై, ఎన్‌ఒసి ఇచ్చారన్న ఆరోపణలు ఎదుర్కొంటున్న రిజిస్ట్రార్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేయాలని సిఐడిని ఆదేశించింది. ఎఫ్‌ఐఆర్ నెంబరు శుక్రవారానికి అందజేయాలని జస్టిస్ తర్లాడ రాజశేఖరరావు మంగళవారం తీర్పు వెలువరించారు. అర్హత లేని 48 కాలేజీలు యుజిసి నుంచి అటానమస్ హోదా పొందే విషయంలో ఆ కాలేజీలతో చేతులు కలిపారంటూ జోసెఫ్ శ్రీహర్ష, ఇంద్రజా ఎడ్యుకేషనల్ సొసైటీ ఛైర్మన్ కెవికె రావు వేసిన కేసులో వ్యక్తిగత విచారణకు హాజరుకాకపోవడంతో పైవిధంగా తీర్పు చెప్పారు.

హితబోధ



ఒక్కడివేనని భయపడకు
ఒక్కడితోనే మొదలౌతుంది మంచి తలంపు
ఒద్దికగా ఉంటే మేలు
ఒనగూడును అనుకున్నది
ఒకరిద్దరితో కలివిడిగా ఉండు

ఒజ్జల బోధనలు ఆచరించు
ఒంటె అంత ఎత్తుకు ఎదుగు
ఒత్తిడి లేని చదువులు చదువు
ఒప్పుకున్న మాటకు కట్టుబడు
ఒట్టు పెట్టుకుంటే తప్పరాదు
ఒరే ఒరే అనుకుంటూ చెలిమితో మెలుగు
ఒంటరితనాన్ని ఆదిలోనే వదులు

ఒక చేత్తో త్రివర్ణ పతాకాన్ని పట్టు
ఒక చేత్తో శాంతి కపోతాన్ని వదులు
ఒప్పులనే ఎప్పుడూ చేయి
ఒజ్జల నెప్పుడూ ఎదురించకోయి!

- ఆళ్ల నాగేశ్వరరావు,
74166 38823.

మొదటి అక్షరం

పిల్లలూ, ఇక్కడ ఇచ్చిన బొమ్మల పక్కన వాటిని ఆంగ్లంలో ఏమంటారో ఇచ్చాం. అయితే ఆ పదాల మొదటి అక్షరం మాత్రం మీరే రాయాలి. ట్రై చేయండి చూద్దాం.


Ladybug	_ueen
_uail	_obot
_ut	_rum
_ocket	_ocks
_oker	_abbit

పిల్లలూ, మీ కథలు, బొమ్మలూ పంపండి. ఇదిగో మెయిల్ ఐడీ: chin-naarips@gmail.com

నేను గీసిన బొమ్మ



జి.అరుణ,
9వ తరగతి,
జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల,
నిజాంపేట,
మెదక్ జిల్లా.



బ్యాటింగ్‌లో షెఫాలీ, బౌలింగ్‌లో దీప్తి

గ్రూప్-ఎ టాపర్ భారత్

దంబుల్లా(శ్రీలంక): ఆసియాకప్ మహిళల క్రికెట్ టోర్నమెంట్ సెమీఫైనల్లోకి భారత్ దూసుకెళ్లింది. నేపాల్‌తో మంగళవారం జరిగిన గ్రూప్-ఎ చివరి లీగ్ మ్యాచ్‌లో భారతజట్టు 82 పరుగుల తేడాతో ఘన విజయం సాధించింది. తొలుత ఓపెనర్ షెఫాలీ వర్మ మెరుపు బ్యాటింగ్‌కి తోడు మరో ఓపెనర్ హేమలత బ్యాటింగ్‌లో రాణించడంతో నిర్ణీత 20 ఓవర్లలో 3వికెట్ల నష్టానికి 178పరుగులు చేసింది. షెఫాలీ వర్మ(81) అర్ధసెంచరీకి తోడు హేమలత(47) తృటిలో అర్ధసెంచరీ మిస్ చేసుకుంది. వీరిద్దరూ బ్యాట్ ఝుళిపించడంతో టీమిండియా జట్టు 14 ఓవర్లలోనే 122 పరుగుల గట్టి పునాది వేసింది. ఆ తర్వాత సజీవన్ సాజన(10) నిరాశపరిచినా.. జెమీమా రోడ్రిగ్స్(28), రీచా ఘోష్(6) మరో వికెట్ పడకుండా జాగ్రత్తగా ఆడారు. దీంతో భారీస్కోర్ నమోదు చేసింది. ఛేదనలో నేపాల్‌కు అరుంధతి రెడ్డి ఆదిలోనే షాకిచ్చింది. మొదటి ఓవర్లోనే ఓపెనర్ సంజనా ఖడ్కా(7)ను బౌల్డ్ చేసి నేపాల్‌ను ఒత్తిడిలో పడేసింది. ఆ తర్వాత ధాటిగా ఆడుతున్న సితా రనా మగర్(18)ను సైతం బౌల్డ్ చేసింది. ఆ తర్వాత కెప్టెన్ ఇందు బర్మ(14), రుబినా ఛెత్రీ(15)లు ఇన్నింగ్స్ నిర్మించే ప్రయత్నం చేశారు. కానీ, దీప్తి శర్మ, రాధా యాదవ్ వారిద్దరినీ వెనక్కి పంపడంతో నేపాల్ కోలుకోలేక పోయింది. దాంతో నేపాల్ నిర్ణీత ఓవర్లలో 96 పరుగులకే పరిమితమైంది. భారత్ గ్రూప్-ఎలో ఆడిన మూడు మ్యాచుల్లో జయకేతనం ఎగురవేసి సెమీస్‌కు దూసుకెళ్లింది. సెమీస్‌లో భారత్ గ్రూప్-బిలో రెండోస్థానంలో ఉన్న జట్టుతో తలపడనుంది.



ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్ షెఫాలీ వర్మ (81పరుగులు)

సెమీస్‌కు పాకిస్తాన్ మహిళలు

గ్రూప్-నుంచి రెండోజట్టుగా సెమీఫైనల్లోకి పాకిస్తాన్ జట్టు ప్రవేశించింది. మంగళవారం జరిగిన చివరి లీగ్ మ్యాచ్‌లో పాకిస్తాన్ జట్టు 10 వికెట్ల తేడాతో యుఎఇపై ఘన విజయం సాధించింది.

స్కోర్‌బోర్డు...

భారత్ మహిళల ఇన్నింగ్స్: షెఫాలీ వర్మ (స్టంప్)కాజల్ (బి)సీత 81, హేమలత (సి)రుబినా (బి)సీత 47, సజీవన్ (ఎల్‌బి)కబిత 10, జెమీమా రోడ్రిగ్స్ (నాటౌట్) 28, రీచా ఘోష్ (నాటౌట్) 6, అదనం 6. (20 ఓవర్లలో 3వికెట్ల నష్టానికి) 178పరుగులు. **వికెట్ల పతనం:** 1/122, 2/133, 3/156 **బౌలింగ్:** కబిత కన్వార్ 2-0-20-0, షబ్నమ్ 4-0-41-0, పూజ 1-0-13-0, కబిత జోషీ 4-0-36-1, రుబినా 1-0-14-0, ఇందు 4-0-29-0, సీత రనా 4-0-25-2.

నేపాల్ మహిళల ఇన్నింగ్స్: సంజన (బి)అరుంధతి రెడ్డి 7, సీతా రణా (బి)అరుంధతి రెడ్డి 18, కబిత కన్వార్ (సి)మంధాన (బి)రేణుక 6, ఇందు బర్మా (సి)షెఫాలీ వర్మ (బి)రాధా యాదవ్ 14, రుబినా ఛెత్రి (బి)దీప్తి శర్మ 15, పూజ మహతో (రనౌట్) దీప్తి 2, కబిత జోషీ (ఎల్‌బి) దీప్తి 0, బిందు రావత్ (నాటౌట్) 17, డోలీ భాటియా (సి)రీచా ఘోష్ (బి)రాధా యాదవ్ 5, కాజల్ (సి అండ్ బి) దీప్తి 3, షబ్నమ్ రాయ్ (నాటౌట్) 1 అదనం 8. (20 ఓవర్లలో 9వికెట్ల నష్టానికి) 96పరుగులు. **వికెట్ల పతనం:** 1/8, 2/21, 3/43, 4/52, 5/64, 6/64, 7/70, 8/82, 9/93 **బౌలింగ్:** రేణుక 4-0-15-1, అరుంధతి 4-0-28-2, తనూజ 4-1-12-0, దీప్తి 4-0-13-3, రాధా 3-0-12-2, సజన 1-0-11-0

రూ.20కోట్ల పెంపు మాత్రమే..

- **బడ్జెట్‌లో ఖేలో ఇండియాకు రూ.900 కోట్లు**

న్యూఢిల్లీ: 2024 కేంద్ర బడ్జెట్‌లో క్రీడలకు కంటితుడుపు పెంపు మాత్రమే కనిపించింది. కేంద్ర ఆర్థికమంత్రి నిర్మలా సీతారామన్ మంగళవారం ప్రకటించిన బడ్జెట్‌లో 2024-25ఏడాదికి గాను రూ.900కోట్లు కేటాయిస్తున్నట్లు వెల్లడించారు. ఇది గత ఏడాదితో పోల్చిచూస్తే రూ.20కోట్ల పెంపు మాత్రమే. 2023-24లో క్రీడలకు రూ.880కోట్లు కేటాయించగా.. 2022-23లో 596.39కోట్లు కేటాయించారు. ఆ ఏడాదితో గత ఏడాదిని పోల్చిచూస్తే సుమారు రూ.284కోట్ల పెంపు జరిగింది. కానీ గత ఏడాదితో ఈ ఏడాదిని పోల్చిచూస్తే మాత్రం కేవలం రూ.20కోట్ల పెంపు మాత్రమే కనిపిం చింది. రోజు రోజుకూ ఖర్చులు పెరుగుతున్న దృష్ట్యా ఈ నిధులు ఏమాత్రం సరిపోవని క్రీడా నిపుణులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

టాప్-30లో భారత్ నిలిచేనా..

- **26నుంచి పారిస్ ఒలింపిక్స్**



అత్యధిక జనాభాగల మన దేశం ఒలింపిక్స్‌లో పతకాలు సాధించడంలో ఎప్పుడూ వెనుకబడుతూనే ఉంది. టోక్యో ఒలింపిక్స్‌లో గతంలో ఎన్నడూ రానన్ని పతకాలు అంటే 1స్వర్ణ, 2రజతాలతో పాటు మరో నాలుగు కాంస్య పతకాలు దక్కాయి. మొత్తం 7 పతకాలు సాధించిన భారత్.. పతకాల పట్టికలో 48వ స్థానంలో నిలిచింది. ఒలింపిక్స్ చరిత్రలోనే భారత్‌కు ఇదే అత్యుత్తమ ప్రదర్శన. గత ఒలింపిక్స్ లో టాప్-50లో ఉన్న భారత్ ఈసారి టాప్-30 లక్ష్యంగా బరిలోకి దిగుతోంది.

ఒలింపిక్స్‌లో అమెరికాకు ధీటుగా చైనా..

పతకాల పట్టికలో అమెరికాకు చైనా ధీటుగా నిలుస్తోంది. 2020 టోక్యో ఒలింపిక్స్‌లో ఓవరాల్‌గా అమెరికా అత్యధిక పతకాలు సాధించినా.. స్వర్ణాల వేటలో చైనా నుంచి అమెరికా గట్టిని ఎదుర్కొంది. ఆ ఒలింపిక్స్‌లో చివరిరోజు అమెరికా ఒక స్వర్ణ దక్కడంతో ఊపిరి పీల్చుకొని మరోసారి అగ్ర స్థానంలో నిలిచింది. టోక్యో ఒలింపిక్స్‌లో అమెరికా (39స్వర్ణ, 41రజత, 33కాంస్య) టాప్‌లో నిలువగా.. చైనా (38స్వర్ణ, 32రజత, 18కాంస్యాలు) రెండో స్థానంతో ముగించింది. ఇక ఆతిథ్య జపాన్ 27స్వర్ణ, 14రజత, 17కాంస్యాలతో మూడో స్థానంలో నిలిచింది.


తటస్థ వేదికపై రష్యా

2024 పారిస్ ఒలింపిక్స్‌లో రష్యానుంచి 300 మంది రష్యా అథ్లెట్లు ప్రాతినిధ్యం వహిస్తున్నారు. ఉక్రెయిన్‌పై యుద్ధాన్ని సాకుగా చూపుతూ ఐఓసి రష్యా, బెలారస్ ఆటగాళ్ల నిషేధించి తటస్థ వేదిక(ఐఓసి) తరపున పాల్గొనేం దుకు అనుమతి ఇచ్చింది. దీంతో ఆ రెండు దేశాల అథ్లెట్లు పతకాలు సాధిస్తే వారి వారి దేశాల జెండా లను కాకుండా ఒలింపిక్స్ జెండాను ఎగురవేస్తారు.

గత ఐదు ఒలింపిక్స్‌లో భారత్ సాధించిన పతకాలు

	స్వ	ర	కా	మొ	స్థానం
2020 టోక్యో	1	2	4	7	48
2016 రియో	0	1	1	2	67
2012 లండన్	0	2	4	6	57
2008 బీజింగ్	1	0	2	3	51
2004 ఏథెన్స్	0	1	0	1	65

బామ్మ మాట బంగారు బాట



JEEVANA జీవన the family

'ఢిల్లీకి రాజా అయినా.. హైటెక్కు చదువులు ఉన్నా.. బామ్మ మాట బంగారు బాట..' అంటూ సాగే పాట ఈ తొంబైయేళ్ల లక్ష్మీకాంతం బామ్మకి సరిగ్గా సరిపోతుంది. బామ్మ స్వగ్రామం జంగారెడ్డి గూడెం. ఈ వయసులో కూడా గంభీరమైన స్వరంతో, స్పష్టమైన ఉచ్ఛారణతో మాట్లాడే బామ్మ జీవితం ఒక పుస్తకం అంటే అతిశయోక్తి కాదు.. ఆ పుస్తకంలో ప్రతి పేజీ మనకు ఎన్నో విషయాలను నేర్పిస్తుంది. ఔరా అనిపిస్తుంది. ఆచరించేలానూ చేస్తుంది. బామ్మని దగ్గరగా చూసినవారైతే, ఆమె దొడ్డ మనసు గురించి చెప్పడం మొదలుపెడితే ఒకపట్టాన ఆపరు. అంతలా వారి జీవితాలు ఆమెతో పెనవేసుకుంటాయి మరి! బామ్మ ఏది చేసినా సంచలనమే. చదువు, ఉద్యోగం, సైకిల్ తొక్కడం, బండి తోలడం, కారు నడపడం, వ్యవసాయం చేయడం, కుటుంబ బాధ్యతలు మోయడం వేటికవే ప్రత్యేకమైనవి. ఆమె గురించి చెప్పకోవడం మొదలుపెడితే, ముందుగా ఆమె దృఢసంకల్పం, ఆత్మవిశ్వాసం, సేవాగుణం మనకు పరిచయమవుతాయి.

స్వాతంత్ర్యం వచ్చేనాటికే 8వ తరగతి పూర్తి చేసిన లక్ష్మీకాంతం... టీచర్ కోర్సులో చేరటానికి ఇంట్లో పెద్ద యుద్ధమే చేశారు. 'మాది పెద్ద కుటుంబం. ఐదుగురు ఆడపిల్లలు, ఇద్దరు మగపిల్లల్లో నేనొకదాన్ని. అన్న, తమ్ముడు, నలుగురు చెల్లెళ్లు. నాన్న శ్రీరాములు వ్యవసాయం చేసేవారు. అమ్మ పున్నమ్మ గృహిణి. నాన్నను చిన్నప్పటి నుంచి చూస్తూ పెరిగాను. వ్యవసాయమంటే ఇష్టం. చదువంటే ఆసక్తి. నా ఇష్టాన్ని నాన్న ఎప్పుడూ కాదనలేదు. చదువుకుంటానంటే స్కూల్లో చేర్పించారు. 8వ తరగతి వరకు చదివా. టీచర్ ట్రైనింగ్ చేస్తానంటే ఇంట్లో వాళ్లు ఒప్పుకోలేదు. నాన్న కూడా భయపడ్డారు. అందరినీ ఒప్పించి ట్రైనింగ్‌కి వెళ్లడానికి ఐదేళ్లు పట్టింది' అంటూ తన చిన్ననాటి జ్ఞాపకాన్ని ఆమె గుర్తు చేసుకున్నారు.

ఏజెన్సీ ప్రాంతాల్లో టీచర్‌గా..

1952 నుండి 54 వరకు హయ్యర్ గ్రేడ్ శిక్షణ తీసుకున్న బామ్మకి ఏజెన్సీ ప్రాంతంలో ఉద్యోగం వచ్చింది. 'రవాణా సౌకర్యాలు అంతంతమాత్రం ఉండే ఆ ప్రాంతాల్లో ఉద్యోగాలు చేయడానికి మగవాళ్లు కూడా వెనుకాడేవారు. కానీ నేను మాత్రం భయపడకుండా వెళ్లేదాన్ని' అంటున్న బామ్మ పోలవరం, రామయ్యపేట, కొత్తూరు, పైడిపాక, చేగొండిపల్లి, లక్ష్మీపురం, సింగన్నపల్లి, కోండ్రుకోట తదితర ప్రాంతాల్లో విధులు నిర్వర్తించారు. 'మొదట్లో కాలినడకన వెళ్లేదాన్ని. ఆ తరువాత సైకిల్‌పై, స్కూటర్‌పై స్కూలుకు వెళ్లేదాన్ని. నేనే మా ఊళ్లో మొట్టమొదటిసారి, సైకిల్, స్కూటర్ నడిపా' అని బామ్మ చెబుతుంటే ఆ మాటల్లో ఎంత ఆత్మవిశ్వాసం కనిపిస్తుందో ..!

అందరికీ పెద్దక్కగా ...

ఒకపక్క ఉద్యోగం, మరోపక్క వ్యవసాయంలో నాన్నకు చేదోడువాదోడుగా ఉండడం లక్ష్మీకాంతమ్మకు ఎంతో ఇష్టం. కుటుంబ వ్యవహారాల్లో కూడా తన తండ్రికి ఆమె ఆసరాగా ఉండేవారు. పెళ్లి చేసుకోకుండా తన జీవితాన్నంతా కుటుంబానికే అంకితం చేశారామె. తండ్రి మరణం తరువాత, తమ్ముడు, చెల్లెళ్ల బాధ్యతను భుజాన వేసుకుని ఎంతో సమర్థవంతంగా నిర్వర్తించారు.

'నాన్నకు 40 ఎకరాల పొలం ఉండేది. వ్యవసాయం లాభసాటిగా లేక నష్టాలు వచ్చాయి. ఇంటినిండా పిల్లలు. అప్పులు. ఈ పరిస్థితుల్లో నాన్నకు అండగా నిలబడాలనుకున్నాను. అందుకే పెళ్లి చేసుకోకుండా చెల్లెళ్లని, తమ్ముడిని చదివించాను. నాన్న పోయాక, వాళ్ల పెళ్లిళ్ల బాధ్యత కూడా తీసుకున్నా. వాళ్లందరూ పెద్ద చదువులు చదివి, ఉన్నత ఉద్యోగాల్లో స్థిరపడేలా చేయాలని కలలు కన్నా. నా కుటుంబం ఎప్పుడూ ఎవరి దగ్గరా చేయి చాచకూడదని గట్టిగా అనుకునేదాన్ని. నాన్న పేరు నిలబడేలా చేయాలని ఎంతో ప్రయత్నించాను. అందరూ స్థిరపడ్డారు. వాళ్ల పిల్లలు కూడా ఉన్నత ఉద్యోగాలు సాధించారు. ఇప్పుడు నా కుటుంబం పెద్దదైంది. నా తోడబుట్టిన వాళ్లు, వాళ్ల పిల్లలు, వాళ్లకు పుట్టిన పిల్లలు అందరూ నన్ను ఎంతో గౌరవిస్తారు. అందరికీ నేనే పెద్ద దిక్కు.. పెద్దక్కనీ' అని చెబుతూ లక్ష్మీకాంతమ్మ నిండుగా నవ్వారు.

32 ఏళ్లుగా వ్యవసాయం ...

రిటైర్ అయ్యాక ఇక విశ్రాంతి తీసుకుందామని అందరూ అనుకుంటారు. కానీ లక్ష్మీకాంతమ్మ అలా అనుకోలేదు. 'నాన్న నుండి వచ్చిన పొలం కుటుంబ బాధ్యతలకు సరిపోయింది. నాకేమో వ్యవసాయం ఇష్టం. 1992లో రిటైర్ అయ్యాక, వచ్చిన డబ్బులతో ఓ 5 ఎకరాలు పొలం కొన్నా. ఓపిక ఉన్నప్పుడు వరి, మొక్కజొన్న, కంది, వేరుశనగ వంటి పంటలు సాగుచేశాను. పొలం పనులన్నీ దగ్గరుండీ చేసేదాన్ని. ప్రతి పనీ నేను చేసి, కూలీలకు చెప్పేదాన్ని. పొలానికి వెళ్లి అలా పనులు చేస్తుంటే, భలే సంతోషంగా ఉండేది. స్కూటర్ మీద పొలానికి వెళుతుంటే ఊళ్లోవాళ్లు ఆశ్చర్యంగా చూసేవారు. ఒకసారి ఊరికి కొత్తగావచ్చిన ఎస్ఐస్కూటర్ మీద నన్ను చూసి, మాట్లాడారు. ఈ వయసులో ఈ కష్టపడడం ఏమిటని ఎంతో ఆశ్చర్యంగా అడిగారు. ఏవైనా బాధ్యతలు ఉన్నాయా? అని ఆరా తీశారు. కానీ ఇదంతా నా కోసం, నా అభిరుచి కోసం చేస్తున్నానని తెలిసి అబ్బురపడిపోయారు. ఎంతో ఆప్యాయంగా మాట్లాడుతూ రోజూ నాతో పొలానికి కూడా వచ్చేవారు' అంటూ తన పొలం పనుల గురించి ఎంతో ఉత్సాహంగా చెబుతున్న లక్ష్మీకాంతమ్మ ప్రస్తుతం పామాయిల్ సాగు చేస్తున్నారు.

సేవాగుణంలోనూ ముందుంటారు..

కుటుంబానికి పెద్దదిక్కుగా ఉండడానికి సరైన అర్థం ఈ బామ్మ. ఆప్యాయతను పంచడమే కాదు, ఆర్థికంగా కుదేలైన కుటుంబాలకు సాయంగా నిలవడంలో కూడా ముందుండేవారు. ఉన్నత చదువు చదువుకోలేని బంధువుల పిల్లలను తన ఇంట్లోనే ఉంచి, చదివించారు. వాళ్లకు ఉద్యోగాలు వచ్చేవరకు నిద్రపోయేవారు కాదు. అంతలా వాళ్ల కోసం తపించేవారు. చుట్టాలు, బంధువుల పిల్లల కోసమే కాదు, ఆపదలో ఉన్నామని ఎవరు, ఎప్పుడు వచ్చినా తనకు తోచిన సాయం చేయడం బామ్మకి అలవాటు. చదువులకు సాయం చేయమని వచ్చేవారికి తనకు తోచిన సహకారం అందిస్తారు. తన దగ్గర 22 ఏళ్లుగా సాయంగా ఉన్న సత్యవతి ఇద్దరు పిల్లలను చదివిస్తున్నారు. 'సత్యవతి కూతురిని డిగ్రీ చదివించాను. బ్యాంకు పరీక్షలు రాయించాను. ఆ పిల్లకు ఉద్యోగం వచ్చింది. నా చుట్టూ ఉన్న పిల్లలు, కుటుంబాలు ఎప్పుడూ సంతోషంగా ఉండాలని కోరుకుంటాను. వాళ్లు బాధలో ఉన్నారంటే నా మనసు అసలు ఊరుకోదు. నాకు చేతనైంత సాయం ఏదోఒకటి చేసేదాక నిద్రపట్టదు' అంటున్న బామ్మ తన కోసం ఏమీ మిగుల్చుకోలేదు. వచ్చిన ఆదాయాన్నంతా ఇతరుల కోసమే వెచ్చిస్తున్నారు. ఆమెతో మాట్లాడుతుంటే నిండైన ఆత్మవిశ్వాసానికి ప్రతీకలా అనిపించారు.

- జ్యోతిర్మయి

Published and Printed by Mallajosyula Venkata Subrahmanya Sarma on behalf of Prajasakti Printers & Publishers Private Limited from D.No.27-30-4,Akulavari Street,Governorpet, Vijayawada, Krishna Dt., and Printed at Prajasakti Printers & Publishers Private Limited, D.No.14-12-19, Krishna Nagar, Tadepalli (M), Guntur Dt., Editor : Bendi Tulasi Das, Ph : 9490099275, email:editorprajasakthi@gmail.com, RNI Regd.No. 15795/68